తెలుగే గొప్ప భాష

– కాని కనుమరుగౌతున్నది

పారుపల్లి కోదండ రామయ్య,
రిటైర్డ్ ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజనీర్

ప్రచురణ సంఖ్య: 77, Published by:
Vanguri Foundation of America

Teluge Goppa Basha

Kaani Kanumarugautunnadi

– Parupalli Kodanda Ramaiah

Email: korapa4@gmail.com
Phone: 950 529 8565

Publication # 77

ISBN: 1-892408-68-6

© Author

Published by:
Vanguri Foundation of America
Vanguri Chitten Raju, Ph. D
P.O. Box 1948, Stafford,
Texas, 77497, USA
Phone: 832 594 9054
Email: vangurifoundation@gmail.com

First print February 2019.	1,000 copies
Second print April 2019.	1,000 copies
Third Print June 2019.	1,000 copies
Present Fourth print February 2020.	1,000 copies

Copies: in India:
Author: **95052 98565**
Vanguri Foundation of America (Hyderabad)
Vamsee Ramaraju
Phone 98490 23852,
Email: ramarajuvamsee@yahoo.co.in

JV Publications (**Book Design & Production**)
Jyothi Valaboju,
Phone: 80963 10140,
Email: jyothivalaboju@gmail.com

Navodaya & all popular book stores in Andhra Pradesh & Telangana
For Copies in North America:
Vanguri Foundation of America
Email: vangurifoundation@gmail.com

Price: Rs. 80/, USA: $10.00

ఈ పొత్తం లో...

మునుమాట	vii
ఎక్కు పెట్టిన ఉద్యమ కోదండం – అద్దంకి శ్రీనివాస్	viii
నా మెచ్చుకోలు ముచ్చట – ఆత్రేయపురపు పాండురంగ విఠల్ ప్రసాద్	x
కాలయాపన లేకుండా మనం కదలాలి – చెన్నూరు ఆంజనేయ రెడ్డి	xii
తెలుగు భాష నిబద్ధత కి చెకుముకి రాయి – జయధీర్ తిరుమల రావు	xv
నేను చెప్పే చిన్న మాట : వంగూరి చిట్టెన్ రాజు (ప్రచురణ కర్త)	xx
కణుపు ౧: 'నా' మాట	1
కణుపు ౨: చచ్చే భాష లక్షణాలు ఏమిటి?	11
కణుపు ౩: తెలుగే గొప్ప భాష	26
కణుపు ౪: తెలుగు వారి ఆత్మన్యూనత భావం	50
కణుపు ౫: మత భాషలు – తెలుగు	58
కణుపు ౬: తెలుగుపై ఇతర భాషల దాడులు	63
కణుపు ౭: ఇప్పుడేం జెయ్యాలి?	82
వెనుమాట	91
ఈ పొత్తాన్ని చదివిన పెద్దల తలపోతలు	94

ఆవిష్కరణ మహోత్సవాలు

హైదరాబాదులో

నాట్స్, డల్లాస్‌లో

కడప సి. పి. బ్రౌన్ వేడుకలో

న్యూజిలాండ్‌లో



తానా, వాషింగ్టన్ లో



అమెరికా తెలుగు సాహితీ సదస్సు, ఓర్లాండో లో

పూనాలో

విశాలాంధ్ర, విశాఖ లో

మునుమాట

ఒక జాతి భాష, సంస్కృతి, చరిత్ర, కళలను కాపాడాల్సిన మరియు పెంపొందించ వలసిన బాధ్యత, విధి ఆ జాతి జనులందరి మీద ఉన్నది. ఈ దిశలో నా తలపోతలను మీ ముందు ఉంచుతున్నాను. ఇందులో మీకు నచ్చని విషయాలు చాలా ఉంటాయి. మధ్యలోనే పుస్తకాన్ని మూసేసి నన్ను వెతికి పట్టుకొని అమీ తుమీ తేల్చుకోవాలనిపిస్తుంది కూడ. అందుకే కొంచం ఓపిక పాటించి చివర దాక చదవండి అని విన్నవిస్తున్నాను. అంతా చదివాక కూడ మీ మనసు మారకపోతే పట్టుపట్టి నన్ను పట్టండి, తట్టండి, తిట్టండి, నెట్టండి, కొట్టండి. తట్టుకుంటాను.

మన దేశంలోని ఏ పెద్ద భాషకు లేని ప్రమాదం తెలుగుకు ఉన్నదని అందరూ ఒప్పుకుంటారు. భాషతో పాటు, ఆ జాతి సంస్కృతి, విజ్ఞానం, కళలు, చరిత్ర – చివరకు ఆ జాతే అంతరించి పోతుంది. ఆ సంగతి అందరికి తెలియజేయాలని ఈ ప్రయత్నం. ఇక తెలుగుకు పూర్వ వైభవం తేవటానికి మీరు ఉద్యుక్తులవుతారని నా నమ్మకం. **తెలుగు తల్లి ఇబ్బందుల్లో ఉన్నది. ఈ ఐదు ఏండ్లలో మనం నిర్ణయాత్మకంగా కదలకపోతే పరిస్థితి చేయిజారిపోతుంది. తరువాత అనుకున్నా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది.** తెలుగే వద్దు అని గట్టిగా బజారుకు సైతం వచ్చి గొడవ చేసే తెలుగు వారు ఎక్కువ అవుతారు. భాషోద్యమంలో మీరు గట్టిగా పని చేయటమే కాక మిగిలిన వారికి కూడ ఈ సందేశం వినిపించి అందరూ తెలుగు తల్లి కోసం కదిలేట్లు చేయండి.

తల్లిని కాపాడుకోవటానికి పిల్లలు ఉద్యమిస్తారని ఆశ.

నా ఈ ప్రయత్నాల్లో నాకు వెన్నుదన్నుగ ఉన్న మిత్రులు అద్దంకి శ్రీనివాస్ గారికి మప్పిదాలు. నన్ను తట్టి ప్రోత్సహిస్తున్న పెద్దలు చెన్నూరు ఆంజనేయ రెడ్డి గారు, జయధీర్ తిరుమల రావు గారు, పాండురంగ విఠల్ ప్రసాద్ గార్లకు నిండు డెందంతో దండాలు.

తెలుగు, తెలుగు వారి సంస్కృతి, తెలుగు సంగీతం కోసం 50 ఏండ్లుగా పాటుపడుతున్న పెద్దలు వంగూరి చిట్టెన్ రాజు గారు ఈ పుస్తకాన్ని చదివి, సంతోషించి తమ ప్రచురణగా తమ ఖర్చుతో ముద్రించటానికి ముందుకు రావటాన్ని నేను ఎప్పటికీ గుర్తుంచుకొంటాను. వంగూరి ప్రచురణ కావటం వల్ల అంతర్జాతీయంగా తెలుగు వారందరికీ ఇది అందుబాటులో ఉంటుంది.

నా ఈ తెలుగు ఉద్యమంలో నాకు సహకరిస్తున్న ఎందరో పెద్దలు, పిన్నలు అందరికీ మప్పిదాలు. పొత్తాన్ని చదివి తగు కార్టూన్లను ఉచితంగా పంపిన భీమరావు గారికి (9848444841) మరీ మరీ మప్పిదాలు.

పారుపల్లి కోదండ రామయ్య, రిటైర్డ్ ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజనీర్

ఈ పొత్తం గురించి పెద్దల మాటలు

ఎక్కుపెట్టిన ఉద్యమ కోదండం

నాకు తెలిసి రెండు దశాబ్దాలుగా తెలుగునాట భాషగురించి నా బొందో అని పట్టుకుని వేళ్ళాడేవాళ్ళు ఎవ్వరూ సరిగా కనిపించనేలేదు.

ఎడారి బాటలో ఊటనీటి చెలమలా పారుపల్లి కోదండరామయ్యగారు.

పేరులో పేరుకున్న నెయ్యిలాంటి తెలుగు కమ్మదనం, వేషంలో ఇంజనీరుతనం కలగలసి...

సదరు భాషావాదులూ, భాషాప్రేమికులూ ఈయనెవరండీ బాబూ... అని ఆశ్చర్యపోయేలా

భాషాద్రోహుల పాలిట – ఏకులా వచ్చి మేకై కూర్చున్న ఘటికుడు... మా పారుపల్లి కోదండరామయ్యగారు.

తెలుగు భాషకోసం మొసలికన్నీళ్ళు మనకు కొత్తేమీ కాదు. కాని అసలైన కన్నీళ్ళు పెట్టుకొన్నవాడిని నేనే నా కళ్ళతో చూశాను. ఆయనే పారుపల్లి కోదండరామయ్యగారు.

భాష అంటే ఆమడ దూరం ఉండే రంగంలోనే పుట్టి పెరిగి, జుట్టు నెరసి, ఒక్క ఉదుటున ఉప్పొంగిన తరంగంలాగా భాషోద్యమ రంగాన దూకి అందరినీ ఒకే తాటిన నడిపించిన ఘనత ఎంత కాదనుకున్నా పారుపల్లివారికే దక్కుతుంది.

తెలుగు రాష్ట్రాలలోనూ, దేశంలోని ఇతర రాష్ట్రాలలోనూ, ప్రపంచంలోని ఇతర దేశాలలోనూ ఎక్కడ తెలుగు వాసన వచ్చినా పసిగట్టి అక్కడల్లా తెలుగు నెత్తావిని గుబాళింపజేయడం ఈయన నైజం.

సంప్రదాయవాదులూ, భాషావాదులూ విడాకులు తీసుకోబోతున్న మొగుడూ పెళ్ళాల్లా మూతి ముడుచుక్కూర్చుంటే వాళ్లని చూస్తూ... ఉన్న కాస్త అభిమానాన్నీ చంపేసుకోబోతున్న సామాన్య భాషాప్రేమికుణ్ణి వెన్నుతట్టిందో కోదండ హస్తం. అక్కడితో ఆగిందా... ఊహూ... ఊరూరా తిప్పింది. భాషకోసం ఎలుగెత్తేలా చేసింది. ఇప్పటిదాకా ఎంతో సాధించింది. ప్రభుత్వాల మెడలూ వంచింది. ఇదీ ఒక ఉద్యమముందోయ్... అని అంతా అటువైపు చూసేలా చేసింది.

వీటన్నింటినీ మించి తెలుగువాళ్ళకూ భాషాచైతన్యం ఉందని నిరూపించింది. ఇది ఒక్కటి చాలదూ... ఏనాటికైనా వేల గిడుగులూ, లక్షల గురజాడలూ కన్న కలల్ని సాకారం చేసుకుంటామన్న నమ్మకానికి ఊపిరులూదదానికి.

భాషోద్యమం మనకు పారుపల్లిని ఇస్తే ఆ పారుపల్లి ఉద్యమకారులకి స్ఫూర్తిని ఇస్తే... ఆ స్ఫూర్తికి అక్షర రూపం ఇస్తూ ఇప్పుడు ఈ చిరుపొత్తాన్ని విరిపొట్లంలా విప్పుతున్నారు మన కోదండరామయ్య గారు.

ఈయన భాషను ప్రేమిస్తాడని తెలుసు. ఈయన భాషను నిలబెట్టాలని కృషి చేస్తాడని తెలుసు.

కాని ఈయన భాషను ఇంత లోతుగా పరిశోధిస్తాడని మాత్రం తెలీదు అని మీరు ఈ పుస్తకం చదివాక అనుకుంటారు. నిజమే... భాషాకృషీవలులకు ఈ పుస్తకం ఏరువాక. ఒక భాషాశాస్త్రవేత్త ఎంత సాధికారికంగా భాషను విశ్లేషిస్తాడో అంతే సాధికారికంగా విశ్లేషించిన వైనం నన్ను ఆశ్చర్యపరిచింది. యువ పరిశోధకులకు ఈ పుస్తకం ఒక కరదీపిక. భాషాశాస్త్రవేత్తలకు మాత్రం ఒరిపిడిరాయి.

ఇందులోని విశేషాలను చెప్పాలంటే మళ్ళీ అదో పరిశోధన అవుతుంది గానీ... టూకీగా చెబుతా... తెలుగు నుడిలోని గమ్మత్తులూ, ధ్వని–వర్ణ–పద–వాక్య–పదార్థ–పదాంతరార్థ– అభిధ–లక్షణ–వ్యంజన–నుడికారం–కాకువు ఇలాంటి తమాషాలు ఎన్నో ఉన్నాయి. ఎన్నని చెప్పను! తెలుగులో ఉన్న సొగసులన్నీ రాశులుగా పోసి, దానికి అక్కడక్కడా శాస్త్రీయతను అద్ది మనముందు తుడిచిన అద్దంలా నిలబెట్టారు.

భాషాప్రేమికులూ... ఇంక ఆలస్యం దేనికి... ఏరుకున్నవారికి ఏరుకున్నంత... రండి... మీరు ఏ రకంగానూ నిరుత్సాహపడరనడానికి నాదీ భరోసా.

సెలవు.

డా. అద్దంకి శ్రీనివాస్.

నా మెచ్చుకోలు ముచ్చట

పోరుపల్లి వారు నాకు నెలవరి యగుటకు పేర్కొన వలసినది ఒక్కటే, ఆయనకు తెలుగున గల మిక్కుటమైన మక్కువ మాత్రమే అని చెప్పక తప్పదు. అమ్మ నుడిపై ఇంత మక్కువ గలవారు ఈనాడు అరుదైపోతున్నారు. పెఱ బాసలపై మోజు గట్లు తెంచుకొని పాఱుచున్నది. బ్రతుకు తెరువునకు అనే ఒక సాకుతో తమ అమ్మనుడిని ప్రక్కకు నెట్టేస్తున్నారు. అంతేకాక, ఈసడించుకొనుచున్నారు. పడమటి యెబ్బెట్టు తీరుల కలవాటు పడిపోయి, మన జట్టులలోగల మంచి కట్టుబాటులను మంట గలపివేస్తున్నారు. అందుచే మన నుడి కనుమరుగు అయ్యే ముప్పునకు జేరుకొన్నది. దానితో తప్పక మన కట్టుబాట్లు కూడ కనుమరుగవుతున్నాయి. ఈ సంగతి పొరుపల్లివారు ఇందు తేటతెల్లముగా వ్రాసి మీ ముందు ఉంచినారు. మన అమ్మనుడిని, దానివలన మన బ్రతుకు కట్టుబాట్లను కాపాడుకొనవలసిన తఱి యేర్పడినది. **ఇప్పుడు మేలుకోకపోతే, తెలుగు జాతి కూకటి వేళ్ళతో పెఱికి వేయబడుట తప్పనిసరి.**

తెలుగు నుడులలో ఉన్న తీపికి ఈ పొత్తమున పొరుపల్లివారు చూపించిన మచ్చులు చాల మెచ్చతగినవి. 'దేశభాషలందు తెలుగు లెస్స' , 'తెలుగు తేనె లొలుకు', 'చెఱకు కన్న తీపి తెలుగు మాట'—ఈ నానుడులు అచ్చతెలుగు గుఱించి అన్నవి కావని నా తలపు. అవి సంస్కృతము కూడిన కలబోత గుఱించి మాత్రమే. అచ్చ తెలుగులో వ్రాస్తే చదివే ఓపిక గల వాళ్ళు లేరు. విసుగు అని ప్రక్కన పెట్టేస్తారు. సంస్కృత అంటిక(సమాసము) లతో వ్రాస్తే, ఉబ్బితబ్బిబ్బౌతారు. ఏ నుడి యైనా, తనలో లేని మాటలను పెఱ బాసల నుండి తెచ్చుకొంటుంది. కాని, తెలుగు తన నుడిలో ఉన్న వాటికే పెఱ బాసల నుండి తెచ్చుకొన్నది. మామూలుగ, మాటలు తెచ్చుకొన్నా, ఏ బాస కూడ పెఱ బాసల చప్పుళ్ళను తెచ్చుకోదు. తెలుగు అలా కాక, సంస్కృతము నుండి చప్పుళ్ళను

కూడ తెచ్చుకొన్నది. తెలుగులో ద్విత్వములు, రేఫముతో సంయుక్తాక్షరములు తప్ప, ఒత్తులు ఉండవు. కాని, సంస్కృత మాటలను తెలుగు తనవిగా చేసేసికొన్నది. అంతే కాక, వానికి వికృతుల పేరిట విరిచేసి తెలుగు తనలో జేర్చుకొన్నది. అలా జేర్చుకున్నా, తెలుగు విస్తరించడానికి తోడ్పడింది అనుకోవచ్చు. కాని, అక్కఱ లేకుండా ఉరుదూ, ఆంగ్లము వంటి బాసలలో మాటలు కూడ కలిపేసికొని, ఆ మాటలకు తెలుగు మాటలు మఱచిపోయింది.

మీరు మీ అన్నదమ్ములలో ఎన్నవ వారు?

నేను రెండవ వెధవని.

ఇలా అనడము, వ్రాయడము, తెలుగులోనే అలవి.

పెఱ బాసల ఇది అలవి కాదని చూపబడిన తీరు మెచ్చుకోతగినది. What is your serial number? అని అడగాలేమో ఇంగ్లీషులో ఐతే!

నూట ముప్పదారు కోట్ల పదమూడు లక్షల అరువది వేల ఐదు వందల డెబ్బది నాల్గు మన భారత దేశ జనాభా!

సంస్కృతము ఎంత గొప్ప భాష ఐనా ఇట్లు తేలికగా సంఖ్యా మానము చెప్ప వీలుకాదు. ఇది పారుపల్లి వారు తమ గ్రంథములో చూపారు.

తెలుగులో గల సుళువులు, అందాలు తెలుగునకే సొంతము. అట్టి మచ్చులు ఈ పొత్తమున చాల ఇవ్వబడి యున్నవి. ఇట్లు ఇచ్చుటకు పారుపల్లి వారు చేసిన కమతము ఇంత అంత యని నుడువ జాలము. చదివి మురియగలరు. అన్న, తమ్ముడు అనుటకు తక్కిన బాసలలో రెండు మాటల కలిపి మాత్రమే అలవి యని పారుపల్లి వారు చూపిన తీరు నాకు చాల నచ్చినది.

అట్లే, తెలుగులో కొన్ని మాటల అందాలు తక్కిన వానిలో కానరావు. మచ్చుకు ఇవి చూపుతున్నాను. 'రాక రాక వచ్చారు'; ఇలా మరియాదకు పలుకుట నాకు తెలిసిన ఆంగ్ల, హిందీ బాసల కనిపించదు. అలాగే, "రాదు కాక రాదు" ; ఇలా ఒత్తి అలవి కాదని చెప్పుట తెలుగులోనే ఉన్నది. ఈ తీరున చెప్పుటకు తగిన మాట ఆంగ్ల, హిందీ నుడులలో కానరాదు. అందుచే మన తెలుగు గొప్పతనము గుర్తించుడు.

ఈ పొత్తమున వ్రాత యీ పూనికకు ప్రొద్దు పొడుపై రాజేయుచున్నది. ఈ నిప్పు రవ్వలు అందరి గుండెలలో ముట్టి, ముంచుకొస్తున్న అక్కఱ గుర్తెఱుగునట్లు రగుల్కొని చిచ్చుఱ పిడుగుల కురియించి అమ్మనుడిని కాపాడగలవని కోరుకొందాము.

ఆత్రేయపురపు పాండు రంగ విఠల్ ప్రసాద్.

M.Sc. (Nuclear Physics) కవి గాండీవి –బిరుదు

కాలయాపన లేకుండా మనం కదలాలి

మిత్రులు కోదండ రామయ్య గారికి,

మీరు పంపించిన పొత్తాన్ని సాంతం చదివాను. మీ అభిప్రాయాలని ఎవరూ కాదనలేరు. కాని ఒక్క విషయం మొదట్లోనే చెప్పాలి. సంస్కృత పదాలు లేకుండా తెలుగు రాయడం కష్టం. ఎప్పుడో సంస్కృత దాసులమైన మనం ఒక్కసారిగా బయట పడలేము. మరో మాట. ఈనాడు మనం సంస్కృతమనుకొనే పదాలన్ని ఆ భాషవి కావు. దేశీ భాషలనుంచి, ప్రాకృత భాషలనుంచి తీసుకోబడినవే. ఉదాహరణకు – పూజ, శివ, లింగ, నీరు, మీనం, గజం – ఇవన్నీ ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవి. అదేవిధంగా, సంస్కృతానికి పూర్వభాషలైన ప్రాకృతభాషలలో ఎన్నో దేశీ భాషల పదాలున్నాయి. పాళీ భాషలో ఇప్పటికే 250 పదాలను చీమకుర్తి శేషగిరిరావు గారు గుర్తించి "పాళీలో తెలుగు పదాలు" అనే సంకలనం చేసారు. ఈనాటి పండితులు ఇంకో 200 పదాలను గమనించారు. ఇంకా వెదికితే ఇంకొన్ని గుర్తించవచ్చు. ఈనాడు తత్సమాలని చెప్పబడే పదాలన్నీ దేశీ, ప్రాకృత భాషలనుంచి తీసుకొని సంస్కృతీకరించబడినవే. కాని భాషాశాస్త్రమెరుగుని మన పండితులు అవి సంస్కృతంలో నుంచి తెలుగులోనికి వచ్చాయని చెప్తారు. వ్యవహార భాష నుంచి పదాలు గ్రాంధికం లోనికి చేరుతాయి కాని గ్రంథాలలోని మాటలు వ్యవహార భాషలోకి అంతగా రావు.

మీరు తెలిపినట్లు మనం సంస్కృత దాస్యం వదిలించుకోవాలి కాని సంస్కృత పదాలను వదిలి వేయరాదు. తెలుగు పదాలు లేనప్పుడు సంస్కృత భాష పదాలను వాడుకోవచ్చు కాని, వాటితోపాటు ఆ భాష వ్యాకరణాన్ని దిగుమతి చేసుకోవడం గొప్ప నేరం. దీనివలనే దుష్ట సమాసమనే దుష్ట సంప్రదాయం ఏర్పడింది. ప్రజలు మెట్లోత్సవం, తెప్పోత్సవం అంటే, పండితులు దాన్ని తప్పుగా పరిగణిస్తారు. దేశీ పదాలను వికృతులనీ

సంస్కృతీకరించబడిన దేశీ పదాలని ప్రకృతులనీ ఇప్పటికీ అంటూనే ఉన్నాం. సిరి వికృతి శ్రీ ప్రకృతి అయింది! అనవసరమైన అర్థానుస్వారాలు మొన్న మొన్నటి వరకు పాండిత్య ప్రకర్షకు మాత్రమే పనికొచ్చాయి. కొండను పర్వతమని , పొడుగరిని ఆజాను బాహుడని, సొగసరిని అందగాడని, గొలుసుకతను ధారావాహికమని, నాయకుని నేత అనీ అనవలసిన అవసరం లేదు. మన తెలుగులో తెలుగెంత అని గమనించాలి! లయ బద్ధమైన దేశీ ఛందస్సును వదిలేసి వృత్త ఛందస్సుతో వ్యర్థ పదాలతో పద్య రచన చేయ వలసిన అవసరం లేదు. కాళిదాసు ఆనాడే గమనించినట్లు పాతవన్నీ గొప్పవి కావు.

ఈమధ్యనే ఒక రాజమండ్రి పండితుడు నాకు గిడుగు రామమూర్తి అనే ఆయన మన తెలుగు స్థాయిని తగ్గించాడని చెప్పడానికి ప్రయత్నించాడు! అన్ని పిల్లులు మ్యావ్, మ్యావ్ అంటే రాజమండ్రి పిల్లి మ్రావ్, మ్రావ్ అంటుందని ఒక చమత్కారం!

తెలుగు మనుగడకు మీరు చేసిన సూచనలు ఆలోచించతగినవి. ముఖ్యంగా తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పరచడం, తెలుగు మూలపదాల నుంచి కొత్త పదాలను మలచడం ఎంతో అవసరం. కన్నడ సోదరులు ఈ విషయంలో గొప్ప కృషి చేశారు. వారు మలచిన పదాలు మనకు పనికొస్తాయి. ఉదాహరణకు Bus stop ని వారు బస్ నిల్దాణ అన్నారు; ఎంత చక్కని పదం!

ఈ కింది సంస్కరణల కోసం మనమందరం కాలయాపన చేయకుండా శ్రమించాలి.

* 7 వ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో పిల్లలని చదివించి ఆంగ్లాన్ని ఒక భాషగా బోధించాలి. ఆతరువాత 12 వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో చదివే వారికి తెలుగుని compulsory చేయాలి.
* తెలుగు లిపిని సవరణ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.
* సంస్కృతం కాని మరో భారతీయ భాష కాని తెలుగుకు ప్రత్యామ్నాయం కాకూడదు.
* భాష బోధన పద్ధతిలో మార్పులు రావాలి – వేమన, సుమతి, భర్తృహరి లాంటి కవుల కులప్రసక్తి లేని నీతిశతకాల పద్యాలు పిల్లలతో సంవత్సరానికి కనీసం 50 కంఠస్తం చేయించాలి. ఇది 12 వ క్లాస్ వరకు జరగాలి.
* గద్యరచనలో నున్న మెలకువలను, నియమాలను తెలపాలి. ఈ విషయంలో మన కన్నా కన్నడ సోదరులు ముందున్నారు.
* తెలుగు రాష్ట్రాల్లో ఏ కొలువుకైనా తెలుగులో qualifying test ఉండాలి.
* తెలుగు రచనల్లో శబ్దాని కన్నా భావానికి ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యర్థ పదాలను వెతికి తీసి పారెయ్యాలి. దాని lyrical qualityని పోనీకుండా intellectual

contentని పెంపొందించాలి; చెప్పిందే చెప్పరాదు అనే విషయం తెలియజేయాలి .

* తెలుగు usage ని standardise చేయాలి.

మీ పొత్తం చిన్నదైనా అందరు చదువ తగినదీ, చదువవలసినది! అమ్మ నుడి సమస్యలన్నీ ఒకచోట చేర్చి వాటి పరిష్కారానికి సూచనలందచేశారు. మీ శ్రమ వృథా కాదు.

వందనాలతో,

చెన్నూరు ఆంజనేయ రెడ్డి, I.P.S.

తెలుగు భాష నిబద్ధతకు చెకుముకి రాయి

నాడు కరెంటును తయారు చేశాడు, దానిని పంపిణీ చేశాడు. ఒక కరెంటు కంపెనీకి సాంకేతిక పెద్దగా ఉన్నాడు. కరెంటు వెలుగును పుట్టిస్తుంది. చీకటిని తరుముతుంది. సుమారు 40 ఏండ్లు ఆ పని చేశాడు. నేడు 'తెలుగు' భాషని ఈ నేలలోంచి తిరిగి పుట్టించాలని, దానిని నలుదిక్కులా పంపిణీ చేయాలని, ఆ వెలుగు నిరంతరం ఉండిపోవాలని నాలుగేండ్ల నుండి ప్రయత్నిస్తున్నాడు; ఆయన పేరు పారుపల్లి కోదండరామయ్య.

తెలుగు నుడి ఈ నేలమీదే పుడుతుంది. దానిమీద నడయాడే శ్రమజీవులు, ఉత్పత్తి శక్తులే భాషను సృష్టిస్తారు. అందుకే, అలాంటి భాషలే నాలుగు కాలాలు బతుకుతాయి. ఇంకా తెలుగు నుడి బతికే ఉంది. కానైతే తోడేళ్ళ లాగ, పంజా విసిరిన పులుల్లా పరభాషలు తెలుగు మీద నిరంతరం దాడి చేస్తున్నాయి. **తెలుగు నేల మీది నీళ్ళు తాగి, ఆహారం తిని బతుకుతూనే తెలుగుని అంతరింపజేయాలనే పండితవర్గం, పాలకగణం, ప్రభుత్వ గుణం నిర్ణయించుకున్నాయి.**

భూస్వామ్య వ్యవస్థలో కూడ ప్రైవేటీకరణ ఉంది. అది పెట్టుబడిదారీ అనంతర కాలంలో పెరిగి విస్తరిల్లింది. దాని అసలు స్వభావం ఏమిటంటే ఇక్కడి పూలను, పండ్లను, ధాన్యాన్ని, నీటిని లాభాల కోసం విపణిగా మార్చడం. వాటిని ఇక్కడ కొత్త రూపంలో మార్కెట్ చేయాలంటే, లాభాల పంట తీయాలంటే, మనుషుల నాలికలను, దుస్తులను, సంగీతాలను, తిండి పదార్థాలను, ముఖ్యంగా భాషలను అంతరింపచేయాలి. ఎంతగా నామరూపరహితం చేస్తే అంత లాభం. ఈ లాభాలను రాజకీయాధికారం కోసం

ఖర్చుపెట్టి ప్రజలను అణగదొక్కవచ్చు. ఈ భూభాగాన్ని తమ వారి కోసం, తమ చేతిలోకి తీసుకోవడం కోసం అధికారపీఠం కైవసం చేసుకోవడమే పరమావధి. ప్రజలు తమ ఆత్మగౌరవాన్ని, అన్ని చిరునామాల్ని కోల్పోవాలని ఇలాంటివారు కోరుకుంటారు. అలా అన్నీ కోల్పోకపోతే మానవ సహజ చైతన్యం తిరిగి పెల్లుబుకుతుందని భయం. అందుకే ఈ క్లోనీ పాలకవర్గాలకు తల్లి భాషంటే భయం. ప్రజల చేతిలో భూమి ఉంటే వణుకు. అందుకే భూమిని లాగేస్తే దానితో పాటు భాష, పాట, ఆట, సంగీతం అన్నీ టోకున స్వాధీన పరచుకోవచ్చు. ఇప్పుడు సెజ్‌ల పేర, రాజధానుల పేర, భారీ నీటి ప్రాజెక్టుల పేర, ముఖ్యంగా అభివృద్ధి పేర రైతు భూమిని, ఆదివాసీ పోడుని, తరతరాలుగా పోరాడి తెచ్చుకున్న పంట భూమిని అనేక ఇక్కట్లు సృష్టించి, మాయోపాయంతో సులభాతి సులభంగా లాక్కుంటున్నారు. భూమిని కోల్పోవడమంటే భాషను, సాహిత్యాన్ని, గత వారసత్వ ధీశక్తిని, గౌరవాన్ని కోల్పోవడమే.

భాషల మీద, వాటి మూలాల మీద దాడి మొదలైంది. భాషీయుల మెదళ్ల మీద, హృదయాల మీద గాయాలు. వారి మాట మీద, పాట మీద నిఘా. పాఠ్యాంశాల తారుమారు, కొత్త కోర్సుల ఆకర్షణ వలయాలు. ఫీజు లేని చదువుల స్థానంలో, కట్నం పేరుతో స్త్రీని అమ్మకం సరుకు చేసినట్లు బడులలో, కళాశాలల్లో తల్లి భాష బరువు అయ్యింది. ఇప్పుడు విదేశీ విశ్వవిద్యాలయాలే కాదు, డే కేర్ సెంటర్లు, కాన్వెంట్లు వచ్చేస్తున్నాయి. ఇక పొలం, తల్లి, తల్లి భాష ఎక్కడ? తల్లులే పరాయీకరించబడిన మాతృమూర్తులైనప్పుడు, వారి గర్భ సంచులే కృత్రిమ ఆవాసాలైనప్పుడు మాతృభాష ఎక్కడిది? భయం గొలిపినా వాస్తవ పరిస్థితి ఇది.

భాషకు పవిత్రత అంటగట్టేవారున్నారు. దాంతో అంటరాని ఆలోచన అందులోంచే పుడుతుంది. ఏది తెలుగు అనే ఒక ఆలోచనకి చేరని వారు పది మంది గుడ్డివాళ్లు ఏనుగుని తడిమి అది ఎలా ఉందో చెప్పిన పాత సామెత ఈ విషయంలో ఇంకా అమలు అవుతోంది. భాష విషయకంగా దశలవారి కార్యక్రమం ప్రజాదృక్పథం లోంచి రూపొందింపబడలేదు. ఏ భాషారూపం గురించి అభివృద్ధి, ప్రచారం, అమలు చేయాలన్న అంశంపై స్పష్టత లేకున్నది. ప్రభుత్వంతో ఏయే పనులు, ఏయే దశల్లో ఎలా చేయించాలన్న కార్యక్రమానికి నిర్దిష్ట స్వరూపం ఏర్పడలేదు. కొన్ని డిమాండులు మాత్రం ఉన్నాయి. వాటిని ఆచరణలో సాధించడానికి ఉమ్మడి చైతన్యం ఇంకా పెంపొందలేదు. ఈ రంగంలో పనిచేసేవారిలో ఐక్య భావన కూడ లోపించింది. ఇది సాధ్యమైన నాడు తెలుగుకి మంచి ఘడియలు వస్తాయని అనిపిస్తుంది. భాష గురించి ఆలోచిస్తున్నవారు, ఉద్యమం చేస్తున్నవారు యువతరాన్ని ముందుపెట్టడంలో విఫలం కావడం కూడా ఒక కారణం. ఉద్యమంలోకి ప్రజల పాత్రని పెంచగలగాలి. వారిలోని అశాస్త్రీయ భావాలకు చెక్ పెట్టాలి. వాటికి ధీటుగా సమాధానం ఇవ్వగలగాలి. ఉదాహరణకి ఆంగ్లంలో చదవకుంటే

ఉద్యోగం రాదు అనే ఆలోచన తప్పు అని అంటాం. కాని ఆ ఆలోచన ప్రజలకి అర్థమయ్యేలా చెప్పగలిగి, అందుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో వారిని పాల్గొనేలా చేయలేక పోతున్నాం. అందుకు కారణం ఏమిటి? అంటే మనం ఇప్పటిదాకా ఐక్య కార్యాచరణ దిశగా ఎక్కువ ప్రయత్నం చేయలేకపోయామా? ఈ విషయం గురించి మనకి మనమే ఆలోచించుకోవలసిందే.

ప్రభుత్వ వర్గాలలో భాషాభిమానం కలిగిన పెద్దలు కొందరు పెదాలపై వరకే, అలవోకగా వేదికల నుంచి మాత్రమే భాష గురించి మాట్లాడుతారు. అక్కడి వరకు తమ ప్రజాస్వామిక చిరు ఆకాంక్ష వ్యక్తీకరణకే పరిమితం అవుతారు. వీరు ఉద్యమాన్ని, ఉత్సాహకర వాతావరణాన్ని చల్లబరచడం కోసమే పని చేస్తారని గత దశాబ్దం రుజువు చేసింది.

ఏది ఏమైనా తెలుగు భాష గురించి ఆలోచించే వారు పెరిగారన్నది సత్యం. కేవలం విద్యాత్మక రంగానికి చెందినవారే కాకుండా సమాజంలో ఇతర రంగాల వారు కూడా తెలుగు కోసం ఆలోచిస్తున్నారు. ఇది ఒక్కటే ఆశావహ లక్షణం. అంతే కాదు. వీరు తమకు తోచిన రీతిలో లోగడ చర్చించని తెలుగు భాషాకోణాలను వెలుగులోకి తెస్తున్నారు. వాటికి అక్షర రూపం కలిగిస్తున్నారు. అచ్చమైన తెలుగు పదాలను ఉపయోగిస్తున్నారు. విస్తృత నుడికారంలో భావ ప్రకటన చేయగలుగుతున్నారు. భాషా సామాజికతలోంచి తెలుగుని వెలుగు దారి తొక్కిస్తున్నారు. అలాంటి ప్రయత్నాలలో భాగంగా పారుపల్లి వారి ఈ పుస్తకాన్ని చూడాలి.

తెలుగు భాష గొప్పదే. కాని అది కనుమరుగౌతున్నది అని బలంగా చెబుతున్నది ఈ పుస్తకం. పారుపల్లి వారి లాంటి వారు వాడే అచ్చ/దేశీ/పల్లె పదజాలం మొదట కొంత కష్టం అనుపించినా మెల్లిమెల్లిగా అది అలవాటై ప్రచారం లోకి వస్తున్న తీరుని భాషాశాస్త్రవేత్తలు గుర్తించక తప్పదు. భాగాలు/అధ్యాయాలు (chapters) అనే మాటకు సమానంగా 'కణుపు' అనే తెలుగు పదాన్ని ఈ పుస్తకంలో వాడారు. ఇలాంటి ఎన్నో తెలుగు పదాలను ఏరి కోరి ఈ గ్రంథంలో ఉపయోగించారు. నిజానికి ఇలాంటి కొత్త పదాల సూచిక చివర అనుబంధంగా ఇస్తే బాగుంటుందని అనిపిస్తోంది.

కనుమరుగయ్యే తెలుగు భాష అనే మొదటి 'కణుపు'లో ప్రజల నోళ్ళలో దాగిన గాన సంప్రదాయం, దానిలో గల అచ్చ తెలుగు పదాలు, వ్యక్తీకరణలు, వాటి విలక్షణతల్ని విడమరిచి రాశారు. మన సంస్కృతికి భారమైన ఆంగ్ల బాల గీతాల అసమంజసాల్ని చెప్పి, భాషకు, నేలకు సంబంధం ఉందనే ఆలోచనను తేటతెల్లం చేశారు. 'వానా వానా వల్లప్ప' అని మనం ఇక్కడ పాడుకుంటే 'రెయిన్ రెయిన్ గో అవే' అని అక్కడ పాడుకుంటారు. అలాంటి గేయాల్ని ఇక్కడ పాడుకోవడం బేసబబుగా ఉంటుంది. మనకి

కప్పతల్లి, వాన రాక కోసం పాట ఉంటుంది. నిజానికి వాన కోసం పాట పాడటమే ఒక ఆట! ఇక్కడి పాటలు పిల్లలకు చక్కని భాషను నేర్పుతాయి అనే కోణం విస్పష్టంగా రాశారు. ఇప్పుడు ఈ తెలుగు గేయాలకి బదులు ఇంగ్లీషు రైమ్స్ నేర్పబడుతున్నాయి. అవి పిల్లలకి, మన సమాజాన్ని తలకిందులుగా అర్థం చేయిస్తున్నాయని రచయిత నొక్కి చెప్పిన పద్ధతి బాగుంది.

రెండో కణుపులో అసలు భాషను విస్మరించి కృతక తెలుగు భాషని ఉపయోగించడం సరికాదని నిర్ధారించారు. సొంత భాషని ఉపయోగించకపోవడం వల్ల ఆత్మన్యూనత పెరిగి బానిస భావనలకు లోనవుతారు. అందువల్ల సొంత ఆలోచనలు చేయలేరు. ప్రయోగాలు చేయలేరు. స్వీయ శక్తి వినియోగించడంలో కూడ వెనకబడి పోతారని చెబుతారు. ఇతర భాషాపదాలను, భాషలను ఏ కారణం చేతనైనా ఉపయోగించడం గొప్ప అనే భావన తప్పు. ఆ భాష అందమైనది. అలాగే సులభమైనది, ఆహ్లాదకరమైనది అని చేసే ఆలోచన అపాయకరం. దీని వల్ల మనతో కలిసి బతికే మనుషులను కూడా ప్రేమించలేం. సాటి మనుషులను ప్రేమించని వాడు దేశాన్ని కూడ ప్రేమించలేడు. తెల్లవాడి పదాలు, ఆ భాష మీద ప్రేమ, ఆకర్షణలకి – అవసరం అని పేరు పెట్టాం. తెలుపే గెలుపు అనే భావనని పెంచుతూ పోతుంటే ఈ నేల మీద వికసించిన భాషని, నుడికారాన్ని ఎలా గౌరవిస్తాం? దాని వల్ల మన మీద మనకి చులకన భావం పెరగదా? మనిషి మీద ప్రేమ నశించిన చోట భాష మీద కూడా అది ఎగిరిపోక తప్పదు. అందుకే నామ ఫలకాలపై, పెళ్లి పిలుపులలో మొత్తం తెలుగు లిపిలో సంస్కృతం లేదా ఆంగ్ల భాషలో కార్డులు వేయడం జరుగుతుందని, వాటిలోని భాషను విశ్లేషించారు. కొత్త మాటలకి సమానార్థక పదాలను పరభాషల నుండి కాకుండా తెలుగు లోంచే సృష్టించుకోవాలనే బి. స. బంగారయ్య ఆలోచనకి ఆచరాణాత్మక అక్షర రూపం ఈ పుస్తకంలో కనుపిస్తుంది.

ప్రస్తుత భాషాభిమానులు తెలుగు ప్రాచీనత గురించి మాట్లాడకుండా ఉండలేరు. ఈ రచయిత కూడ మూల ద్రావిడ భాషలలో తెలుగు విశిష్టతని నొక్కి చెప్పాడు. అక్షరాల చెక్కింపులు, తెలుగు లిపి ప్రాచీనత, రాత విధానం, నోటి సాహిత్యం లాంటి ఈ భాష ప్రత్యేకతలను గురించి చిన్నగానైనా నిండు గుండెతో వ్యక్తం చేశారు.

నిజానికి నాటి నుండి ఈనాటి వరకు తెలుగు రాతభాషగా, నోటి భాషగా అతి పెద్ద విస్తీర్ణత కలిగి ఉంది. ఇప్పుడైతే రెండు రాష్ట్రాల్లో అధికార భాషగా, ఐదు రాష్ట్రాలలో అనధికార భాషగా కోట్లాది మంది వాడే భాష తెలుగే. తెలుగు, కన్నడ భాషలకి ఎంతో సారూప్యత ఉంది. 'విజయ లిపి' పేరుతో ఒక సంయుక్త లిపి తయారు చేయబడింది. ఆ లిపిని రెండు తెలుగు రాష్ట్రాల చొరవతో కర్ణాటకలో కూడా అమలులోకి తేగలిగితే హిందీని మించి పోగలుగుతుంది. ఒక బలమైన రాజకీయ శక్తిగా కూడా ఎదగగలుగుతాం. ఇలాంటి ఆలోచనలు దురాశ కాదు. లోగడ జరిగిన వాస్తవ చరిత్ర. కేవలం తెలుగుని

భాషగానే కాదు, ఒక రాజకీయ శక్తిగా కూడా మలచడానికి ప్రయత్నం చేయాలి.

ఐతే మన రాజకీయ నాయకులు, కొందరు సినీ, వ్యాపార వర్గాల వారు తెలుగు భాషలో కీచులాట పెడుతున్నారు. ఒక ప్రాంత భాష, మాండలికం గొప్పదనే ఆలోచనలు కలిగిస్తున్నారు. వీరి వల్ల తెలుగు భాష అందరి తెలుగు వారిది కాకుండ పోతున్నది. మొదట ఈ దుష్ట భావన నుండి బయటపడి, ఇతర రాష్ట్రాలలోని వివిధ మాండలికాలను, తెలుగు వ్యవహారిక భాషారూపాలను, సాహిత్యాలను సమంగా ప్రేమించాలి. తెలుగు భాషోద్యమంలో పాల్గొని పొరుగు రాష్ట్రాల, నేల వాసులు కూడా తల్లి నుడిని కాపాడుకొనే అవకాశం ఉంది. మనం ఇప్పుడు వారితో చేతులు కలపవలసి ఉంది. ఇలాంటి అనేక ఆలోచనలకు పాదు ఈ పొత్తం. అందుకే అభినందనలతో స్వాగతం.

10 జనవరి 19,
జయధీర్ తిరుమల రావు,
హైదరాబాదు.

మన భాష లోని పదాలను వదిలేసి పరభాషల నుండి అరువు తెచ్చుకొని మాట్లాడుకునే జాడ్యం మనకు పట్టినపుడు మనది మృత భాష కాకుండ ఏమవుతుంది?

–రావు కొంచాడ, తెలుగు మల్లి, సంపాదకుడు, ఆస్ట్రేలియా.

నేను చెప్పే చిన్న మాట

పారుపల్లి కోదండ రామయ్య గారిదీ, నాదీ అప్పుడప్పుడు విద్యుల్లేఖల ద్వారా పరోక్ష పరిచయమే కాని ఆయన గురించి నాకు ఏమీ తెలియదు. ఆయన్ని ఎప్పుడూ కలవలేదు. అయితే గత అనేక సంవత్సరాల నుంచీ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ద్వారా ఇతరుల సహాయంతో ప్రపంచవ్యాప్తంగా మేము నిర్వహిస్తున్న సాహిత్య, ధార్మిక కార్యక్రమాలకి క్రమం తప్పకుండా ఆయన సహృదయంతో స్పందించడం, మంచి సూచనలు చెయ్యడం, తనంత తనే పూనుకుని మా కార్యక్రమాలని ప్రచారం చెయ్యడం మాత్రమే నాకు ఆయన గురించి తెలిసిన కొద్ది విషయాలు. అలాంటిది ఆయన హఠాత్తుగా ఈ గ్రంథం నాకు పంపించి ముందు మాట వ్రాయమని కోరడం భలే ఆశ్చర్యం కలిగించింది. తీరా పుస్తకం పూర్తిగా చదివాక కాస్త భయమూ, మరికాస్త ఇబ్బందీ కలిగాయి. ఇప్పటి దాకా మీరు చదువుతున్న ఈ ముందు మాటలోనే ఒక ఆంగ్ల పదం పడినప్పుడు, ఇక తరువాత అటు ఆంగ్లమే కాదు, సంస్కృతం ఛాయలు కూడా రాకుండా ఈ “మనలో మన మాట” పూర్తి చెయ్యాలేమోరా బాబోయ్ అనే అనుమానం నా సరదా భయానికి కారణం. నాకు ఇలాంటి ‘మంచి’ భయం కలిగే అవకాశం ఇచ్చినందుకు పారుపల్లి కోదండ రామయ్య గారికి ముందుగానే ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

తీరా నా అభిప్రాయాలు వ్రాసి పంపించగానే ఈ పుస్తక ప్రచురణ గురించి మా ఇద్దరి మధ్యా సంభాషణలు, ఉత్తర ప్రత్యుత్తరాలూ జరిగాయి. ప్రస్తుత వాతావరణంలో అనేక కోణాలలో విశ్లేషిస్తూ తెలుగు భాష పురోభివృద్ధి... **ఆ మాటకొస్తే అసలు తెలుగు భాష మనుగడ మీదే దృషి సారించిన ఇలాంటి పుస్తకం నాకు తెలిసి ఇప్పటి దాకా రాలేదు.**

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి దశాబ్దాల భాషా సాహిత్యాభిలాష, 75 పైగా పుస్తకాల ప్రచురణలో ఉన్న అనుభవం నేపథ్యంలో అపురూపమైన ఈ పుస్తకాన్ని

మేమే ప్రచురిస్తే అత్యంత సమంజసంగా ఉంటుంది అని పారుపల్లి వారు భావించి నాకు ప్రతిపాదించడం, నేను అంగీకరించడం జరిగాయి.

ఎంతయినా అమెరికా వాస్తవ్యుడిని కాబట్టి ముందుగా నాకు ఆశ్చర్యం కలిగించిన, ఆసక్తి కలిగించిన అంశం...ఈ పుస్తకంలో ఎక్కడా అమెరికా అనే మాట కనపడదు. కాని ప్రస్తావించిన మూడే మూడు చోట్లా దాన్ని "అమేరిక" అని మార్చడానికి ఏమైనా భాషాశాస్త్ర పరమైన కారణాలు ఉన్నాయేమో నాకు తెలియదు. అయితే కొన్ని ఇతర పుస్తకాలలో ఇక్కడ మేము ఉచ్చరించే పద్ధతిలో 'అమేరికా' అని వ్రాయడం చూశాను. అది వెటకారం ఏమో తెలియదు.

అసలు పుస్తకం విషయాని కొస్తే "తెలుగే గొప్ప భాష –కాని కనుమరుగౌతున్నది" అనే మకుటమే నాకు పూర్తిగా అర్థం అవలేదు. తెలుగే గొప్ప భాష అంటే మిగతా భాషలు గొప్ప భాషలు కాదు అనే అర్థం రావచ్చును కాని యావత్ భూప్రపంచంలో మా అమ్మాయి కంటే అందమైన వాళ్ళు ఎవరూ లేరు అని అందరు తల్లిదండ్రులు అనుకునే లాంటి అర్థం వస్తుంది. మన తెలుగు భాష గొప్పది అనుకోవడంలో తప్పు లేకపోవడమే కాదు, అది నిజం కూడాను. ఎందుకు గొప్పదో పారుపల్లి వారి ఈ పుస్తకంలో సోదాహరణగా చెప్పారు. అయితే ఇతర భాషలు గొప్పవి కాకుండా పోవు. ఏ భాష గొప్ప తనం ఆ భాషదే. ఏ అమ్మాయి అందం ఆ అమ్మాయిదే!

ఇక తెలుగు భాష కనుమరుగౌతున్నదా, లేక గొప్ప భాషగా కనుమరుగై మామూలు భాష గానే ఉండిపోతోంది అని రచయిత ఉద్దేశ్యమా అనేది పుస్తకం చదివాక కాని తెలియ లేదు. పుస్తకం చదివాక మనందరికీ... 'అమేరిక' లో ఉన్న మాతో సహా...స్పష్టంగా తెలిసినదీ, అనుమానమేమీ లేనిదీ ఏమిటంటే... ఆ రెండూ గత ముప్పై, నలభై ఏళ్ల నుంచీ మన కళ్ళ ముందే చోటు చేసుకున్న పరిణామాలే. అంటే గొప్ప భాషగా ఏ నాడో కనుమరుగు అయినప్పటికీ, నలుగురూ మాట్లాడే భాషగా కూడా ఇప్పుడు తెలుగు అంపశయ్య మీద ఉంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. "మార్పు చెందడం సహజం" అని కొంత మంది సమర్థింపు వాక్యాలు చెప్పినా కర్ణుడి చావుకి అనేక మంది కారకులయినట్టుగా ఈ మారణ కాండలో తెలిసో తెలియకో మనందరం తలో రాయి వేసిన వాళ్ళమే. అయితే ఆగ్నేయాస్త్రం వేసింది ఖచ్చితంగా తెలుగు ప్రభుత్వాలు, ఆ నాయకుల "అమేరిక" మోజు... అనగా ఆంగ్ల భాష మీద మోజు. భారత దేశంలో ఇతర ప్రాంతాలతో సహా యావత్ ప్రపంచంలో "అమేరిక" మోజులో సంస్కృతినీ, ఆఖరికి సినిమాలు, టీవీ ప్రసారాలలో కూడా ఆంగ్లం మట్టిలో తెలుగు భాషని తొక్కి, పూడ్చి పారేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్... అనగా ఆ రాష్ట్ర ప్రభుత్వం మరియు అపోహలలో ఉన్న మధ్య తరగతి ప్రజానీకం అనే చెప్పాలి. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో ఈ పొరపాటు సవరించే ప్రయత్నాలు మొదలయ్యాయి అని విన్నాను. అవి సఫలం అయితే

మరొక రెండు, మూడు తరాలలో అక్కడ తెలుగు భాష పరిస్థితి కాస్త మెరుగు పడుతుంది.

ఇంగ్లీష్ రాకపోతే ఉద్యోగాలు రావు..ముఖ్యంగా అమెరికాలో అస్సలు రావు. ఇంగ్లీష్ రావాలంటే ముందు అక్షరాభ్యాసం ఆంగ్లంలోనే చెయ్యాలి. అంగన్‌వాడి నుంచీ ఇంగ్లీషే నేర్పాలి...దాని పేరు "డిజిటలైజేషన్ అంగన్ వాడీ నుంచే మొదలు పెడుతున్న ఏకైక రాష్ట్రం". దానికి కావలసిన ఇంగ్లీష్ నేర్చుకోడానికి తెలుగు ప్రతిబంధకం. అంచేత తెలుగు నేర్పకూడదు. ఇలాంటి దౌర్భాగ్య భావజాలం ఉన్న విద్యా వ్యాపారవేత్తలు, రెసిడెన్సీ పాఠశాలలు, లక్షలు పోసి వాటిల్లో పిల్లలని చేర్పించే మధ్య తరగతి ప్రజలు తెలుగు నాట ఉన్నంత కాలం విద్యాభ్యాసం ఇంగ్లీష్ మీడియంలోనే జరగాలి అనేదే ఘనత వహించిన మన ప్రభుత్వం వారి పరమ దౌర్భాగ్య విద్యా విధానం. అన్నట్టు చైనా, జపాన్, ఫ్రాన్స్,జర్మనీ లాంటి దేశాలలో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ఎన్ని ఉంటాయో ఎవరికైనా తెలుసా? నేను ఆ విషయం వికీ పీడియా వారినీ, గూగుల్ వారినీ అడిగాను. వారి ప్రకారం జపాన్ లో 12 నగరాలలో ఉన్న మొత్తం ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఒకటా, రెండా ఏకంగా 34. జర్మనీలో 36, చైనాలో బీజింగ్ తో సహా 25 నగరాలలో 111. అదే మా కాకినాడలోనే కనీసం 50 ఉంటాయి. అందుకే ఆయా దేశాలతో పోల్చి చూస్తే మనకే ఇంగ్లీష్ బాగా రావాలి కదా! ఆ లెక్కన అవన్నీ వెనక బడ్డ దేశాలే కదా! అమెరికాలో నలభై శాతం ఆఫ్రికన్ అమెరికన్ వారి మాతృభాష ఆంగ్లం. అయినా వారికి ఊడిగాలు లేవు. అంచేత "ఇంగ్లీష్ నేర్చుకుంటే అమెరికాలోనో, ఆస్ట్రేలియాలోనో ఉద్యోగం గేరంటీ" లాంటి దురభిప్రాయాలు మధ్య తరగతి ప్రజానీకంలో పాతుకు పోవడం దురదృష్టం. దానికి కారకులైన విద్యా వ్యాపార వేత్తలూ, రాజకీయ నాయకులూ క్షమార్హులు కాదు.

ఈ చిన్న గ్రంథంలో పారుపల్లి వారు చాలా అంశాల మీద తను చేసిన పరిశోధనలు, అభిప్రాయ సేకరణలు ప్రస్తావించి తన ఆలోచనలకి, అభిప్రాయాలకీ వాటిని ఆధారంగా సమర్ధవంతంగా ఉపయోగించుకున్నారు. అందరినీ కలవరపెడుతున్న అంశాలు పారుపల్లి వారిని మరింత ఎక్కువగా బాధిస్తున్నాయి అని అర్థం అవుతోంది. కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానిదీ, ప్రపంచం బాధ శ్రీశ్రీ దీ అన్నట్టుగా ఈ నాటి తెలుగు వారు అందరిలో కొందరి బాధ పారుపల్లి గారిదీ, పారుపల్లి గారి బాధల్లో కొన్ని కొందరివీ అనుకోవచ్చును. ఈ బాధల్లో వీటిల్లో అవసరం ఉన్నా లేక పోయినా తెలుగు భాషలోకి ఆంగ్ల పదాలని కేవలం అరువు తెచ్చుకోవడం కాక శాశ్వత ప్రాతిపదిక మీద తెలుగులో కలిపేసుకోవడం మొదటిది. అసలు తెలుగు భాషని నేర్పించడమే మానేయడం రెండవది. ఇది ఎంత వరకూ నిజమో నాకు తెలియదు కాని యూనిసెఫ్ వారి చేత త్వరలో మరణించే భాషలలో పదో స్థానంలో ఉండే 'ఘన కీర్తి' మనం సంపాదించుకున్నాం. పాశ్చాత్య దేశాల సాంస్కృతిక ప్రభావం వలన అదృశ్యం అయిపోతున్న మన సంస్కృతి, ఆచారాలు,

పండగలు, బాంధవ్యాలు, భోజనం అలవాట్లు మొదలైనవి మూడో అంశం.

అయితే పారుపల్లి వారు ఉటంకించిన అనేక సమస్యలు నిజంగానే ఉన్నాయి అని అందరూ కొద్దో గొప్పో ఏకీభవించినా ఆయన ప్రతిపాదించిన పరిష్కారాలలో కొన్ని తప్పనిసరిగా ఆచరించ వలసినవి ఉంటే మరి కొన్ని ఆచరణ సాధ్యం కాదు. ఉదాహరణకి తెలుగు భాష మీద ఇతర భాషల దాడులు, ముఖ్యంగా ఇప్పుడు ఇంకా జరుగుతున్న ఆంగ్ల భాష దాడిని కాస్త నియంత్రించ గలమేమో కాని, వెనక్కి తిరిగి రాలేనంత దూరం వెళ్లి పోయిన సంస్కృత భాష "దాడి" ని తిరుగు మార్గం పట్టించడం అసాధ్యం. వీటిల్లో కూడా చదువరుల అభిప్రాయాలు ఎవరివి వారివే.

అదృష్టవశాత్తూ పారుపల్లి వారి ధర్మమా అని తెలుగు భాష ప్రస్తుత పరిస్థితుల మీద ఒక సమగ్రమైన అవగాహనతో విశ్లేషించిన ఈ పుస్తకం తెలుగు ప్రజలకి లభించి అందరిలో మరి కొందరికైనా కనువిప్పు కలిగించే అవకాశం ఉంది. ఈ పుస్తకంలో ప్రధాన అంశమైన తెలుగు భాష కనుమరుగౌతున్నది అనే విషయం మీద స్వదేశం లోనూ, విదేశాలలోనూ చాలా మంది చాలాకాలంగా గళం విప్పుతున్నారు. దురదృష్ట వశాత్తూ తెలుగు భాషా సాహిత్యాల విషయంలో చెవుల్లో సీసం పోసుకున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు ఉన్నంతకాలం అందరిలో ఆ కొందరిదీ అరణ్య రోదనమే. పారుపల్లి కోదండ రామయ్య గారి ఈ "తెలుగే గొప్ప భాష – కాని కనుమరుగౌతున్నది" అనే పుస్తకం ఆయా నాయకుల కంట పడితే, వారు చదవగలిగితే అప్పుడు ఆ వేడికి సీసం కాస్త కరిగి విషయం ఎంత ప్రగాఢమైనదో, మన అస్తిత్వ వినాశనానికి ఎంత దగ్గరలో ఉన్నామో అర్థం అవుతుంది. తెలుగు భాషా సాహిత్యాల పునరుద్ధరణని తలకెత్తుకున్న పాలకులు చరిత్రలో నిలిచి పోతారు. పారుపల్లి వారి గ్రంథం దానికి దోహదం చేస్తుంది అని ఆశిస్తున్నాను.

జరిగిందేదో జరిగిపోయింది. మధ్యతరగతి తెలుగు ప్రజానీకానికీ, రాజకీయ నాయకులకీ కనువిప్పు కలగవలసిన తరుణం ఆసన్నమయింది. ఈ పుస్తక ప్రచురణ సమయానికి ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికల హడావుడిలో ఉంది. ఈ ఎన్నికలలో ఎవరు గెలిచినా తెలుగు భాషా సాహిత్యాల మనుగడ, పురోగతుల మీద చిత్తశుద్ధితో, సరి అయిన శాస్త్రీయ అవగాహనతో దృష్టి పెట్టి విద్యా విధానాలలో తగిన మార్పులు తీసుకుని రావలసిన చారిత్రిక అవసరం ఇప్పుడు ఏర్పడింది. **ఆ నాయకులకి ఈ గ్రంథం దిక్సూచిగా ఉపయోగపడుతుంది అని మా ప్రగాఢ నమ్మకం.**

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి రజతోత్సవాల సందర్భంగా ప్రచురిస్తున్న ఈ అపురూపమైన గ్రంథం మా 77వ ప్రచురణ. ఈ గ్రంథం ఆంగ్ల భాషా వ్యామోహం లో మునిగి తేలుతున్న మధ్య తరగతి ప్రజానీకమూ, రాజకీయ నాయకులూ, తదితరుల

దృష్టిలో పడి, తెలుగు భాషా సాహిత్యపరమైన విషయాలలో మౌలికమైన మార్పులకి దోహదం చేస్తుంది అని ఆశిస్తున్నాను. మేము ఒడ్డున పడినవాళ్ళమే కావచ్చును కాని మమ్మల్ని నడిపిన తెలుగు భాష అనే తెడ్డుని నడి సముద్రంలో విసిరేసి కనపడిన కర్ర ముక్కని పట్టుకున్న వెర్రి వాళ్ళం కాదు.

భవదీయుడు,

వంగూరి చిట్టెన్ రాజు

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా

హ్యూస్టన్, టెక్సస్, (అమెరికా)

మార్చ్ 17, 2019

'నా' మాట

నేను హైదరాబాద్ విద్యుత్ పంపిణీ సంస్థ నుంచి చీఫ్ ఇంజనీర్‌గా పదవీ విరమణ చేశాక ఒక ప్రైవేటు లిస్టెడ్ కంపనీలో టెక్నికల్ డైరెక్టర్‌గా చేరాను. ఓ 10 టి.వి. చానల్స్ వారు విద్యుత్ సంబంధమైన చర్చలు వచ్చినప్పుడు నన్ను పిలుస్తుంటారు. పత్రికల్లో వ్యాసాలు కూడ రాస్తుంటాను. విద్యుత్ సంస్థలను లాభదాయకంగా నడపడంలో నేను ఇంజనీర్లకు సరి అయిన శిక్షణ ఇవ్వగలననీ, విద్యుత్ దొంగలను పట్టుకోవడంలో నాకు ప్రత్యేక నైపుణ్యం ఉన్నదనీ దేశంలో చాలా మంది అనుకుంటారు. అందుకనే అస్సాం, సిక్కిం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, బీహార్, గోవా, కర్నాటక లాంటి రాష్ట్రాలకు శిక్షణ ఇవ్వడానికి వెళ్తుంటాను. ఎన్ టి పి సి, సి ఐ ఆర్ ఇ, ఇ ఎస్ సి ఐ, టి ఇ అర్ ఐ, ఎన్ పి సి లాంటి సంస్థల వారు కూడ నన్ను పిలుస్తారు. టాటా, రిలయన్స్ లాంటి కంపెనీలు కూడ పిలిచేవి. ఒక అమెరికన్ సంస్థకు, (వాషింగ్టన్ లోని దాని ఆఫీస్ కు కూడ ఒక సారి వెళ్ళాను), ఒక బ్రిటిష్ సంస్థకు కూడ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను. 10 మెగా వాట్ల ఎండ విద్యుత్ తయారు చేయటానికి ప్రయత్నిస్తున్నాము. ఇలా పని ఒత్తిడిలో వుంటూనే జీవితాన్ని హాయిగా గడిపే నాకు, నాలుగేండ్ల కింద ఒక దినపత్రికలోని వార్త, నా తల తిరిగేట్లు చేసింది.

ఆ వార్త ఇలా ఉంది: ఐక్యరాజ్య సమితి యొక్క ఒక అనుబంధ సంస్థ (యునిసెఫ్) అంచనా ప్రకారం, ఒక భాషా కుటుంబంలోని 30% పిల్లలు చిన్నప్పటి నుంచే ఆ భాషలో చదవటం, రాయటం చేయకపోతే ఆ భాష కనుమరుగు అవుతుందని, అందులో తెలుగు భాష ఒకటని, భారతదేశపు మరే ఇతర పెద్ద భాషల పరిస్థితి అలా లేదనీ ఆ వార్త సారాంశం. ఇంకా కొంతమంది, ఈ విషయాన్ని బాగ పరిశోధన చేసినవారిని (ప్రజా సాహితి రవిబాబు గారితో సహా), కదిలిస్తే ఇంకొన్ని విషయాలు బయటపడ్డాయి. అలా

40% వరకు కూడ పిల్లలు తల్లి నుడిలో చదవకపోతే ఆ నుడి మహా ప్రమాదంలో పడినట్లు గాను, 50% మంది అలా చదవకపోతే, కాన్సర్ నాలుగో దశలో ఉన్న మనిషి లాంటిదే ఆ భాష అనీ, అటువంటి భాషను ఇంకెవరూ కాపాడలేరనీ, ఇక అది కనుమరుగు అవడం ఖాయమని వారు చెప్పారు.

నేను పదవ తరగతి తరువాత తెలుగును చదవలేదు. తెలుగు నానుడి (సారస్వతం) లో నాకు ప్రవేశం లేదు. కాని అమ్మ నుడి అంటే గట్టి మక్కువ మాత్రం వుంది. పై విషయాలు తెలిశాక ఇక స్థిమితంగా ఉండలేకపోయాను. నేనే స్వయంగా తెలుగులో చదివే పిల్లల లెక్కలను సేకరించాలనుకొన్నాను. నేను ఉండే ఇళ్ళ సముదాయం, మై హోం జుఅల్‌లో 2016 పొత్తిళ్ళు (flats) ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇంత కన్న పెద్ద సముదాయం లేదు. పట్టుబట్టి, వాటిలో ఓ 20 కుటుంబాలను ఈ విషయమై వివరంగా చూశాను. కాని ఒక్క కుటుంబంలోని ఒక పిల్లవాడు కూడ తెలుగులో చదవడం లేదు. బాగ డబ్బులు ఉన్న వారి ఇండ్లకు వచ్చాను, ఇది సరి అయిన మచ్చు కాదులే అనుకున్నాను. ఇక్కడ ఇంటిపని చేయడానికి పొద్దున్నే 700 మంది పని అమ్మాయిలు వస్తారు. వారిలో ఓ 20 మంది పని మనుషులను కూడ ఆరా తీశాను. ఒక్కరి కుటుంబంలో కూడ తెలుగు మాధ్యమంలో చదివే పిల్లలు లేరు. ఏవో తిప్పలు పడి కాన్వెంట్‌కే పంపించుకొంటామండి అని చెప్పారు. బాగా డబ్బులు ఉన్న వారి సాంగత్యంతో వీరు కూడ చెడిపోయారులే అనుకొన్నాను. ఇక రోడ్ మీద పడ్డా. అయిదారుగురు రిక్షా వాళ్ళను కూడ కదిలించి చూశాను. ఏమీ మార్పు లేదు. అందులో ఒకతను కాస్త గట్టిగా కూడ మాట్లాడాడు. 'మా పిల్లగాడు నాకే పుట్టాడు అనుకుంటానండి. ఇక తెలుగులో ఎందుకు చదివిస్తాను?' అన్నాడు. అసలు హైదరాబాదే సరి అయిన మచ్చు కాదు అనుకొన్నాను. హైదరాబాద్‌లో ఈ లెక్కలు మొత్తం రాష్ట్రపు సరి అయిన పరిస్థితిని ప్రతిబింబించవు అని అనుకున్నాను.

తరువాత కొన్ని రోజులకు నేను ఒక ఊరికి వెళ్ళాల్సి వచ్చింది. ఖమ్మం జిల్లాలో అది ఓ చిన్న పల్లెటూరు. రాత్రి అక్కడకు చేరుకొని వెంబడే పడుకున్నాను. తెల్లారి లేచేసరికి ఊరంతా గందరగోళంగ కనిపించింది. ఊళ్ళోకి వాన్లు (కొంత మంది రిక్షాలు, ఆటోలు, బస్సులలో పంపుతుండిరి) వచ్చి పిల్లలను అందరిని ఎత్తుకొని పోవటాన్ని చూశాను. 'ఏమిటిరా, ఈ హడావుడి' అని మా తమ్ముడిని ఆరా తీస్తే 'అన్నయ్యా, నువ్వు ఉద్యోగంలో ఉండగా సరిగా ఇక్కడకు వచ్చే వాడివి కావు. తరువాతైనా నువ్వు రాక చాల రోజులైంది. పగలు వచ్చినా, వెంబడే వెళ్లిపోతున్నావు. ఈ వేళప్పుడు నువ్వు ఎప్పుడూ ఉండలేదు. దగ్గరి బస్తీలో కాన్వెంట్ స్కూళ్ళు పెట్టారు. వాండ్లే వాన్లతో వచ్చి పొద్దున్నే పిల్లల్ని తీసుకొని పోయి మాపటి పూట ఇంటి దగ్గరికి తెచ్చి వదిలి వేస్తారు' అని అన్నాడు. ఓ తల్లి అంతకు ముందు రోజే బస్తీకి పోయి తన కొడుకును కాన్వెంట్‌లో చేర్చటానికి రుసుములు కట్టి

వచ్చినట్లున్నది. ఆ రోజు మొదటిసారిగా తన కొడుకును వానులో వేసి ఎంతో సంతోషపడటాన్ని గమనించాను. ఆ పిల్లవాడు తల్లిని 'అమ్మా' అని పిలిచి 'వెళ్ళొస్తా' అన్నాడు. వాడి మొకంలో బోస్టన్ లోని ఎం.ఐ.టి. లో చదవటానికి వెళ్ళుతున్నంత సంతోషం, గర్వం కనపడ్డాయి. ఆ రోజు మాపటి పూట దాక నేను అక్కడ ఉండాల్సి వచ్చింది. మొదటిరోజు కాబట్టి తల్లి తన కొడుకు కోసం ఎదురుచూడటాన్ని నేను అప్పుడు గమనించాను. వాడు బడి నుంచి వచ్చేటప్పటికి స్వయంగా తల్లి వాన్ దగ్గరకు రావడం, పిల్లవాడు 'మమ్మీ' అంటూ అమ్మ కౌగిట్లోకి చేరడం గబగబా జరిగాయి. మొదటి మాటగా ఆ పిల్లవాడికి ఏమి నేర్పారో గమనించండి. ఆ కొత్త పిలుపుతో, ఆ అబ్బాయి అమేరిక అధ్యక్షుడు అవుతాడు అన్నంత ఆనందం ఆహ్లాదం ఆమె అరవిందంలో అగుపించాయి. అంటే పల్లెటూళ్ళల్లోని పిల్లల్లో కూడ ఎక్కువ మంది తెలుగుకు దూరం అవుతున్నారు. తెలుగులో చదవని వాళ్ళు 80% కన్న ఎక్కువ మందే ఉన్నారు అని తెలుసుకున్నాక ఇక నా అమ్మ నుడి బ్రతకదు అన్న విషయం తేలిపోయింది.

తెలంగాణలో కే జి నుంచి, పి జి దాక ఆంగ్ల మాధ్యమమే అని కడియం శ్రీహరి, అంగనవాడీ (3వ ఏట నుంచే) లోనే తెలుగులో మాట్లాడనివ్వం అంటున్న నారాయణ తెలుగును ఇక ఒక తరం కాలంలోనే కనుమరుగు చేయనున్నారని ఏ మాత్రం పరిశీలన చేసిన వారికైనా తేటతెల్లంగా కనపడుతున్నది.

సంస్కృతికి భాష ప్రాణం.

తెలుగు కనుమరుగౌతుంది అని తెలుసుకొన్నాక ఇక దాని పర్యవసానాలు ఎలా ఉంటాయా అని తలపోయటం మొదలెట్టాను. వేల ఏండ్ల నుంచి ఇక్కడ ఉంటున్న తెలుగు వారు తమదైన సంస్కృతిని తమ నుడి ద్వారా మాత్రమే తరువాతి తరాలకు చేరవేస్తున్నారు. ఇతర దేశాలలాగ ఆ అనుభవాలను, ఒక పుస్తకంగా రాసి తరువాతి తరానికి చేరవేసే అలవాటు మనకు లేదు. ఈ మరుగును కనీసం కొడుకుకైనా తరువాత చెప్పుదాములే అని తండ్రి అనుకుంటూ చెప్పకముందే చచ్చిపోవటం కూడ జరిగేది.

మా చిన్నతనంలో ఇద్దరు ఆడపిల్లలు ఎదురెదురుగా నిలబడి ఒకరి కుడి చేతినొకరు అలానే రెండు ఎడమ చేతులను కలిపి పట్టుకొని వుండగ, మరో ఇద్దరు అలానె పట్టుకున్న పిల్లలు, మొదటి వారి చేతులకు అడ్డంగా పెట్టి, మొత్తం నలుగురు గుండ్రంగా లయబద్ధంగ ఎగురుతూ, 'వానా వానా వల్లప్పా' అని పాడుతుండేవారు. తుంపర వానలో కూడ అలా ఎగరటానికి మన చిన్నపిల్లలు ఇష్టపడతారు. వానను కోరటం మన సంస్కృతి. చెట్టుకు, పుట్టకు, పిట్టకు, నీ పొట్టకు, పంటకు, పూతకు, కాతకు, కాయకు, పిందెకు, ప్రతి ప్రాణికి నీరు అవసరం. చివరకు మన ఒంట్లో కూడ

60%కు పైగానె నీరు వుంటుంది. అంటే మన సమాజం మొత్తంగా వాన అంటే మక్కువ కలిగి ఉంటుంది. దీనికి మొత్తంగా వేరైన పరిస్థితి యూరోపు ఖండపు దేశాలలో వుంటుంది. అమేరిక కంటే కూడ అది ఉత్తర ధృవానికి దగ్గరగా ఉంటుంది కాబట్టి అక్కడ చలి అమేరికలో కన్న ఎక్కువగ వుంటుంది. అంత చలికి తోడు, వాన పడితే ఇంక ఏ పని కూడ సాగదు. నీటి చుక్కల లాగ, వడగండ్ల లాగ కాక సన్నటి దారపు ముక్కల (స్నో) లాగ వాన పడి దారిలో పెద్ద కుప్పల లాగ పడి ఇంక ఏ మాత్రం బండ్లను కదలనివ్వవు. అందుకని అక్కడ ఇలా పాడుతారు;

వానా వానా వెల్లి పో	(Rain rain go away)
ఇంకో రోజు వద్దూ గాని	(Come again on another day)
చిట్టి నాన్న ఆడుకోవాలి	(Little Johny wants to play)
వానా వానా వెల్లి పో	(Rain rain go away)

విచిత్రం! మన రాష్ట్రంలో పిల్లలకు ఇప్పుడు ఆ పాటను నేర్పుతున్నాం! ఇది ఎంత అసహజమైనదో, ఎంత అర్థ రహితంగా ఉన్నదో, ఇక్కడి పరిస్థితులకు ఎంత వ్యతిరేకంగా ఉన్నదో వేరే చెప్పాల్సిన పని లేదు. మన సంస్కురుతికి భిన్నమైన సంస్కురుతి వచ్చి చేరుతున్నది. కోట్ల మంది పిల్లలు దేశంలో వానా వానా వెల్లి పో అని అనడం వింతగా లేదూ!

మనం ఇప్పుడు నేర్పుతున్న మరో లాలి పాటను జూడండి;

Jack and Jill went up the hill
రాముడు, సీత కొండ మీదకు వెళ్ళారు
To fetch a pail of water
ఓ బొక్కెన నీళ్ళు తేవటానికి.
Jack fell down and broke his crown
రాముడు కింద పడ్డాడు. మోకాలి చిప్ప విరిగింది.
And Jill came tumbling after.
తరువాత సీత దొర్లుకొంటూ కిందకొచ్చింది.

నీళ్ళు తేవడానికి కొండ మీదకు వెళ్ళడం ఏమిటి? కింద పడ్డాక రాముడికి మోకాలి చిప్ప విరిగిందే అనుకొందాం, అందులో విశేషం ఏమిటి? తరువాత రాముడిని వదిలేసి సీత దొర్లుకుంటూ కిందకు రావడం ఏమిటి? మొత్తం మీద మనం పిల్లలకు చెప్పదలచుకొన్న నీతి, సందేశం ఏమిటి?

అసలైన మన తెలుగు పిల్లల పద్యం ఎలా ఉంటుందో చూడండి;

పట్టు పట్ట రాదు పట్టి విడువ రాదు
పట్టెనేని బిగియ పట్ట వలయు
పట్టి విడుట కన్న పడి చచ్చుటే మేలు
విశ్వదాభి రామ వినుర వేమ.

ఇదీ మన సంస్కృతి: అన్నిటినీ పట్టించుకోకు. అనవసరమైన వాటి మీద కన్ను పెట్టకు. లేక పోతే అసలైన వాటి కోసం నీకు తడవు మిగలదు. మంది నీ గురించి ఎన్నో మాటలు నీ ముందు, వెనుక కూడ అంటుంటారు. వాటిని నీవు పట్టించుకోవద్దు. కాని మితి మీరినప్పుడు, తప్పనిసరి అయినప్పుడు, ఇక గట్టిగ పట్టు పట్టటమే కాదు దాని అంతు చూడాల్సిందే, గెలవాల్సిందే. ఈ పోరాటంలో ఇక ప్రాణం పోయినా పరవా లేదు.

తల్లిదండ్రుల యెడల ప్రేమను చూపించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పే ఈ పద్యాన్ని చూద్దాం.

'తల్లిదండ్రుల యెడ దయ లేని పుత్రుండు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా
విశ్వదాభిరామ వినుర వేమ'

'నీ చిన్నతనంలో పల్లెటూర్లో వుండగా, మాపులు చివరి మెతుకును నీకు పెట్టి తల్లి పస్తులు ఉండేది. తెల్లారి చదువుకోసం నీవు బస్తీకి వెళ్ళాలంటే తన పుస్తెలను అమ్మింది నీ తల్లి. అటువంటి తల్లి ముసలిది అయితే, నీవు పట్టించుకోకుండ వుంటే నీకూ ఒక పురుగుకూ తేడా ఏమి ఉన్నది?' అని చిన్నతనం నుంచే పిల్లలకు నీతిని నేర్పే నుడి మనది. ఆ నుడిని నేర్పక పోవడం వల్ల, 'ముసలి వారి ఇండ్లు' (old age homes) పెరుగుతున్నాయి. ఇంతకు మునుపు అమేరిక వెళ్ళిన పిల్లల తల్లిదండ్రులే అటువంటి ఇండ్లలో చేరే వారు. ఇప్పుడు ఇక్కడ పిల్లలు ఉన్న వారు కూడ ఆ ఇండ్లలో చేరటాన్ని మనం చూస్తున్నాం. చాల ఎక్కువ పేరున్న, ఒక పెద్దమనిషి, కూతురుకు చాల పెద్ద మొత్తంలో తను సంపాదించిన సంపదను ఇచ్చినా, ముసలివారి ఇంటిలో చేరటాన్ని మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి. నన్ను నా కూతురు చిన్న పిల్లడి లాగ చూసుకుంటుంది, తను తెలుగు చదువటం వల్ల.

మేము చిన్నతనంలో శ్రవణ కుమారుని కత చదువుకున్నాము. పెద్దగ మలుపులు తిరిగే కతేమీ కాదది. కొసమెరుపు కూడ ఏమీ ఉండదు. శ్రవణ కుమారుడు అనే ఒక యువకుడు ఉంటాడు. కావిడిలో కుండలు పెట్టుకొని నీళ్ళు మోస్తూ బ్రతుకుతుంటాడు. అతని తల్లిదండ్రులిద్దరికీ కుష్టు జబ్బు వస్తుంది. చేతుల వేళ్ళ చివర, కాళ్ళ వేళ్ళ చివర,

పుండ్లు ఏర్పడి వారు కదిలే పరిస్థితి ఉండదు. వేళ్ళు కూడ కొంత కొరుక్కొని పోతాయి. తొందరలోనే చనిపోవటం ఖాయమని తెలుసుకొంటారు. అయినా చనిపోయే ముందు కొన్ని పుణ్యతీర్థాలు తిరిగి చూడాలనే కోరిక కలుగుతుంది. శ్రవణుడికి ఆ కోరికను తెలియజేస్తారు. అతడు ఇక, ముందు వెనుక చూడకుండ, కావిడిలోని కుండలను తీసేసి తన తల్లిదండ్రులను ఆ సిబ్బులలో కూర్చొనబెట్టుకొని, అలా కావిడిలో తల్లిదండ్రులను మోసుకొంటూ వారికి ఇష్టమైన అన్ని తీర్థాలను చూపిస్తాడు. చివరకు వారు పూర్తి సంతోషంతో కన్ను మూస్తారు. చాల చిన్న కత. ఒకసారి చదివాక బ్రతికినంత కాలం గుర్తు ఉండే కత. 'తల్లిదండ్రులే ఇలలో వేలుపులు; వారు తృప్తితో ఉండేట్లు చూడటం పిల్లల పని' అని చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పటం మన సంస్కురుతి. ఆ కత ఇప్పటి బడి పిల్లలకు ఎంత మందికి తెలుసు?

మనవైన ఆడ, మగ సంబంధాలు కూడ నిందు మార్పునకు గురి అవుతున్నాయి.

ఒక మనిషి ఒక రోజులో 100 రూపాయల పని జేస్తే, ఇద్దరు వేరు పనితనాలున్న మనుషులు కలిసి 300 రూపాయల పని చేస్తారు. కలిసి పని చేయటంలో ఉన్న అదనపు సౌకర్యం అది.

నివసించేటప్పుడు కూడ ఒంటరిగా కన్న, ఒక కుటుంబం లాగ (ఒకరి కన్న ఎక్కువగ) నివసిస్తేనే ఎక్కువ సౌకర్యవంతంగ ఉంటుందనేది ఆచరణలో రుజువైంది. జ్వరం వచ్చినప్పుడు, తాత్కాలికంగా సంపాదన లేనప్పుడు, బయటి ఊరికి వెళ్ళాల్సి వచ్చినప్పుడు ఒకరినొకరు ఆదుకుంటారు. ఒకరు ఇంటి విషయాలు చూసుకుంటే మరొకరు బయటి పని చూసుకునే ఆడ, మగ వారుగ ఒక కుటుంబం మొదలౌతుంది. దానివల్ల ఆ జాతి తన తరువాతి తరాన్ని కూడ కనగల్గుతుంది. అందుకని చాల చిన్నతనం నుంచే ఆడ, మగ పిల్లలను చాల స్పష్టంగా విడిగా కనపడేట్లు పెంచే సంస్కురుతి మనది. పుట్టిన కొన్ని నెలల నాటికే బయటి అలంకరణను బట్టే పిల్లా, పిల్లగాడా అన్న విషయాన్ని మనం తేలికగ వేరుజేసి గుర్తించగలం. జుట్టు, జడ, బొట్టు, కాటుక, చెవి పోగు, ముక్కు పుడక, గాజులు, కాటుక, ఓణి, పరికిణి వగైరా తేడాలు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. అర మైలు దూరంనుంచైనా కనపడుతున్న మనిషి ఆడా మగా అన్న విషయాన్ని మనం తేలికగా గుర్తించగలం. అందుకనే మన సంస్కురుతిలో ఆడవారిని ఎన్నుకోవటంలో, ప్రేమించటంలో మగవాడు ఏ మాత్రం పొరబడడు. కాబట్టి ఆడ మగల మధ్యనే పెండ్లిండ్లు అవుతుంటాయి. విదేశాల్లో ఈ తేడాలు లేకపోవటం వల్ల తోడు కావాల్సి వచ్చినప్పుడు ఏదో ఒక మనిషి చాలు అనుకుంటారు. కాని ఇప్పుడు మన దగ్గర కూడ పరిస్థితి వేగంగా మారుతున్నది. అందరు ఒక రకం దుస్తులే వేసుకుంటారు, ఒక రకంగానే కనపడుతుంటారు. గచ్చిబౌలిలో పది ఏండ్ల కింద వెనుక నుంచి చూసి ఆడో

మగో తెల్సుకోలేక పోయేవాడిని. ఇప్పుడు ఎదురుగా వచ్చి దాటిపోతున్నా తేల్చుకోలేక పోతున్నాను. ఒకే రకమైన దుస్తులు, తలకట్టు, జుట్టు గమనించ వచ్చు. బొట్టు లేదు, జడ లేదు, గాజులు లేవు, కాలి మెట్టెలు లేవు, మంగళ సూత్రం లేదు, చీరె లేదు, ఓణీ లేదు. పైగా యునిసెక్స్ గుడ్డలు.

ఇలా ఆడ, మగ తేడా కనపడక పోవడం వల్ల కలిసి కాపురం చేయటానికి ఎవరో ఒక మనిషి చాలు అన్న పరాయి సంస్కృరుతి మనకు చేరింది. అందుకని మగ, మగ పెండ్లిండ్లు; ఆడ, ఆడ పెండ్లిండ్లు; కొన్ని రోజులు మగ/ఆడతో మరి కొన్ని రోజులు ఆడ/మగతో కలసి ఉండటం, మగ/ఆడగా పుట్టి ఆడ/మగగా మారేట్లు ఆపరేషన్ చేయించుకోవటం లాంటివి మన దగ్గరికి వచ్చేశాయి. ఒక ప్రభుత్వ అంచనా ప్రకారం అటువంటివారు ఆంధ్రప్రదేశ్‌లో ఒక లక్ష మందికి పైగా ఉంటారు. వారి కోసం ముఖ్య మంత్రిగారు నెలవారీ భత్యాన్ని ప్రకటిస్తే నంద్యాల దగ్గర వారు ముఖ్యమంత్రి గారికి గుడి కట్టించారు. కలకత్తాలో అటువంటి వారి హక్కుల కోసం పది వేల మందితో ఊరేగింపు జరిగింది. మగ నుంచి ఆడగా మారిన వ్యక్తి న్యాయమూర్తి అయిన ఉదంతాన్ని కూడ విన్నాము. రైలు టికెట్ రిజర్వేషన్‌లో ఇంతకుముందు సెక్స్ అన్న దగ్గర మగ, ఆడ మాత్రమే కనిపించేవి. ఇప్పుడు ఆడ, మగ, ట్రాన్స్ జెండర్ అని చూపుతున్నారు. ఇక్కడ నేను కొజ్జాలను గురించి రాయటం లేదన్నది గమనించాలి. అది పుట్టుకతో వచ్చిన ఒక లోపం. మగ/ఆడగ– మామూలుగ పుట్టిన వారే చూపుతున్న ధోరణి గురించి మనం ఇప్పుడు అనుకుంటున్నాం. ఈ ధోరణుల నైతికత గురించి కూడ నేను మాట్లాడటం లేదు, అంటే ఈ ధోరణులు మంచివా కావా అన్నది కూడ నేను చర్చించటం లేదు. ఇప్పుడున్న సంస్కృరుతికి భిన్నమైన సంస్కృరుతి ఎంత పెద్ద ఎత్తున వచ్చి చేరుతున్నదో మనం చూడాల్సిన అవసరం ఉన్నది అని మాత్రమే మీ ముందు ఉంచుతున్నాను. అత్యున్నత న్యాయస్థానం కూడ ఇప్పుడు ఈ ధోరణిని చట్టబద్ధం చేసింది.

ఇప్పుడు పెండ్లిలో కూడ ఓణీ, పరికిణి కనపడవు. పంచె పోయింది. చీరె కనుమరుగు అవుతున్నది. జడ, బొట్టు, కాటుక వగైరా కనపడవు. మెట్టెలు, మంగళసూత్రం కూడ మొగమాటంతో మాయమవుతున్నాయి.

ఒక జాతి యొక్క పాటను, ఆటను, అలవాటును, తమదైన వారి ప్రత్యేకతను వారి భాషే తరువాతి తరాలకు చేరవేస్తుంది. భాష లేకుండా ఆ జాతి సంస్కృరుతిని ఊహించలేము. తూర్పు బెంగాలులో ఉర్దూ పెత్తనం ఎక్కువైనప్పుడు, తమ భాషను కాపాడుకోవటానికి, వారు తమకు వేరే దేశం కావాలని పోరాడి, గెలిచి బంగ్లాదేశ్‌ను సంపాదించుకొన్నారు. భాష ముందు మతం లొంగిపోయింది.

ఆడవారిపై దాడులు ఎక్కువవుతున్నాయి.

అసలైన తెలుగు సారస్వతంలో ఆడవారిని చాల గొప్పగ చూశారు, గౌరవించారు. నిజానికి దేవతలంటే ఆడవారే. పోలేరమ్మ, మాంచాలమ్మ, మైసమ్మ, మరిడెమ్మ. తిరపతమ్మ, మావుళ్ళమ్మ, మచేనమ్మ, సమ్మక్క, ఎల్లమ్మ, గంగానమ్మ, మద్దిరావమ్మ, జోగులమ్మ, సారక్క, అంకమ్మ, తలుపులమ్మ, సోమాలమ్మ, మోద కొండమ్మ, పోచమ్మ, జంకారి, ముకమ, నూకాలమ్మ, మాచారమ్మ, మారమ్మ, సుంకులమ్మ, ముత్యాలమ్మ, ఉప్పలమ్మ, ఎల్లారమ్మ, గంగానమ్మ, మెరిటాలమ్మ, నాంచారమ్మ, ఊర్లమ్మ, పెద్దమ్మ, బాలమ్మ, పైడితల్లి – ఇలా ఏ వేలుపును చూసినా అంతే. మీరు ఒక మగ దేవత పేరును సైతం చెప్పలేరు. తెలుగు సంస్కురుతిలో మగ వాడు వేలుపుగ ఉండటాన్నే ఊహించకూడదు. మహా అయితే, చొక్కా పంచె లేకుండ పొట్టి లాగుతో, చేతిలో తాళ్ళను పట్టుకొని, వీపు మీద బాదుకొంటు వేలుపుకు కాపలా వుండే 'పోత రాజు' స్థాయి వరకు మాత్రమె మగ వారికి పెరుగుదల ఇచ్చారు.

కులకాంత తోడ నెప్పుడు
గలహింపకు, వట్టి తప్పు ఘటియింపకుమీ
కలకంఠి కంట కన్నీ
రొలికిన సిరి ఇంట నుండ నొల్లదు సుమతీ.

(ఎప్పుడూ భార్యతో తగువులు పెట్టుకొనరాదు. లేని నేరములను ఆమెపై ఆరోపించరాదు. ఉత్తమ ఇల్లాలి యొక్క కంటి నీరు క్రిందపడినచో ఆ ఇంటి నుంచి సంపద తొలగిపోవును. అంటే సంపద, సౌఖ్యములు తొలగి దారిద్ర్యము సంభవించును.)

స్త్రీకి ఇవ్వాల్సిన గౌరవం, ప్రాముఖ్యతలను గూర్చి ఎంత స్పష్టంగ మన సంస్కురుతి చెప్తున్నదో చూడండి.

ఇప్పుడు మనం తెలుగు నేర్పక పోవటం వల్ల ఆడవారి యెడల మన వారి మనస్తత్వం మారిపోయింది. యాసిడ్ దాడులు, కుత్తుకలు కోయడాలు, చిన్న విషయాల పైనే ఆత్మహత్యలు – విడాకులు, ఆలితో పాటు పిల్లలను కూడ చంపే ఘోరాలు చూడాల్సి వస్తున్నది. తల్లి నుడిలో మనం చదువు నేర్పకపోవడంవల్లనే ఈ పరిస్థితి దాపురించినదని ప్రొ. గారపాటి ఉమామహేశ్వరరావు గారు సూత్రీకరించారు.

మనదైన సంస్కురుతిని కూడ మనం, పిల్లలకు తెలుగు నేర్పకపోవటం వల్ల, మన తరవాతి తరానికి చేరవేయలేక పోతున్నాము. కాబట్టి తెలుగు చనిపోతే తెలుగు వారిదైన సంస్కురుతి కూడ చచ్చిపోతుంది.

తెలుగుతో పాటు తెలుగువారి విజ్ఞానం కూడ కనుమరుగౌతుంది.

ఈ 4000 ఏండ్ల కాలంలో, ఈ నేల మీద తిరుగుతూ, తెలుగువారు తమదైన కొంత జ్ఞానాన్ని సంపాదించారు. హరప్పా, వింధ్య పర్వతాల నుంచి కన్యాకుమారి దాక, పడమర కనుమల నుంచి తూర్పు కనుమలదాక వీరు నివసించారు. ఏ కాలంలో ఏ ప్రాంతంలో ఎలా వుంటుంది, ఎక్కడ ఏ పంటలను ఎప్పుడు వేస్తే బాగ పండుతాయి, ఎక్కడ ఎటువంటి నేలలున్నాయి, వాన పడితే/పడకపోతే ఏ పంటలు వేయాలి, ఎక్కడ ఉండటానికి వీలుగ ఉంటుంది, ఎక్కడ పూలు కాయలు ఎప్పుడు పండించవచ్చు, ఎక్కడ వరదలు వస్తాయి, ఏప్రాంతంలో ఏడాదిలో కొన్ని రోజులు మాత్రమే నివాసం ఉండ వచ్చు వగైరా విషయాలన్నీ ఎన్నో తరాలుగా ఇక్కడ తిరిగి తెలుసుకొన్నారు.

తెలుగువారి వ్యవసాయం, వ్యాపారం, కట్టడాలు, ఇతర పరిజ్ఞానం, కళలు చాల పాతవి. శాతవాహనుల కాలం నాటికే తెలుగు వారు రోమ్‌తో వ్యాపారాలు చేసేవారు. ఇండికా (విదేశీయుడు రాసిన ఒక పొత్తం) ద్వారా అప్పటికే తెలుగువారికి 30 బలమైన దుర్గాలున్నాయని చెప్పబడింది.

మొదటి వేదం నాటికి ప్రధాన వృత్తి గొడ్ల పెంపకమే. రెండో వేదం నాటికి మాత్రమె సాగు వృత్తిగా వచ్చింది. కాని క్రీ. పూ. 2300 నాటికే హరప్పాలోని తెలుగువారికి వృత్తిగ సాగు ఉండేది.

వాన తరి మొదట్లో కనపడే లక్షణాలను బట్టి ఆ ఏడు వానలెలా పడుతాయో మన పల్లెటూరి వారు తెలుసుకోగలరు అన్న మందలను ఈ నానుడి ద్వారా తెలుసుకొనండి; 'పడమట వరదగుడేస్తే పాడుబడ్డ గుంటలన్నీ నిండుతాయి, తూర్పున వరద గుడేస్తే తుంగ పాసైనా తడవదు.' ఇది కడప జిల్లా పలుకుబడి.

తుమ్మెదలు ఆడితే తూమెడు వాన.

జాజి కాయ పోస్తే, జోకొట్టినట్టు నిద్దరోతారు; మాచికాయ పోస్తే, మతి పోయినట్టు నిద్దరోతారు.

మాఘ మాసం చలికి మాకులు వణుకుతాయి.

ఆశ్లేష కార్తెలో ముసలెద్దు రంకెలు వేస్తుంది.

పడమట పావురం పిట్టంత మబ్బున్నా పాతాళాన్ని పెళ్లగిస్తుంది.

ఉత్తమం ఉత్తరేణి, మధ్యమం మారేడు, ఏదీ లేకపోతే వేప– పళ్ళు తోముకోవటానికి సూచన.

ఆణి (ఆషాఢం) లో వాన పడితే ఆరు వానలు మెండు.

పల్లెటూళ్ళలో వినపడే ఒక సామెతను చూడండి; 'ఉత్తర జూసి ఎత్తర గంప'. చాల చిన్న మాటలలో ఎన్నో ఏండ్ల అనుభవాన్ని రంగరించి తరువాతి తరాలకు ఎలా అందిస్తున్నారో చూడండి. ఈ మాటలకు తెల్లం తెలియని వారి కోసమని కొద్ది వివరణను ఇస్తాను. 'గత 4000 ఏండ్ల మన అనుభవం, ఈ ప్రాంతంలో ఉత్తర కార్తె వరకు వాన కురవక పోతే, ఇక ఆ ఏడు అంతా వానలు ఉండవు అని చెప్తున్నది. అంటే ఇక కరువు వచ్చింది; పంటలు వుండవు అన్న మాట. అందుకని ఆ కార్తె వరకు కూడ వానలు పడక పోతే, ఓ గంప జూసుకొని, నీ పిల్లను, మేక పిల్లను, చెంబు తపేలా అందులో బెట్టుకొని మకాం ఎత్తేసేయ్. మళ్ళీ వాన వచ్చే కాలానికి తిరిగి రా'. తెలుగులో ఉన్న ఇటువంటి జ్ఞానమంతా తెలుగుతోటే కనుమరుగౌతుంది.

తెలుగు వారి చరిత్రను కూడ తెలుగు భాషే నిలుపుతుంది.

ఇక తెలుగు మాట్లాడే వారు ఉండరు. తెలుగు సంస్కృతి ఉండదు. తెలుగు వారిదైన జ్ఞానం ఉండదు. తెలుగు వారి చరిత్ర ఉండదు. అంటే తెలుగు జాతి చని పోయినట్లేగా మరి?

తెలుగుతో బాటే తెలుగు జాతి కూడ కనుమరుగు అవుతుంది.

ఈ బాధాకరమైన విషయం తెలుసుకున్నాక ఈ సంగతిపై ఇంకా కొంత తరచి చూడాలనిపించింది.

కణుపు ౨

చచ్చే భాష లక్షణాలు ఏమిటి?

'నా తెలుగు మనుగడకు ముప్పు వచ్చింది' అని తెలుసుకొన్నాక ఇక ఆ జబ్బు కూడ ముదిరిపోయింది అని గుర్తించాక, చచ్చిపోయే భాషల లక్షణాలు ఎలా ఉంటాయో తెలుసుకొందామనుకున్నాను. ప్రతి జబ్బుకు తనవైన లక్షణాలు కొన్ని ఉంటాయి. కుష్టు జబ్బు వస్తే వంటి మీద, వేళ్ళ చివర మరీను, పుండ్లు ఏర్పడుతాయి. క్షయ జబ్బు వస్తే దగ్గుతుంటారు, సన్నబడుతుంటారు. వీపు మీద కాన్సర్ వస్తే పెరుగుతూ రసిగారే పుండ్లు ఏర్పడుతాయి. మరి చచ్చే భాష లక్షణాలు ఏమిటి? నాకు తెలిసిన సాహితీకారులను ఈ ప్రశ్న అడగటం మొదలెట్టాను. ముందు కొంతమంది కంగారు పడ్డారు. కొంత మంది జాతి ఎలా చస్తుంది అన్నారు. విషయాన్ని వివరించాక నా ప్రశ్నకు కొంత సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించారు. చివరకు వారి దగ్గర ఈ విషయమై కావలసిన సమాచారం దొరకదు అని ఒప్పుకొన్నారు. మేము నన్నయ స్త్రీలను ఎలా వర్ణించాడో చెప్పమంటే, తిక్కన పండుగలను ఎలా వర్ణించాడో చెప్పమంటే చెప్తాం కాని ఈ గొడవ మాకు తెలియదన్నారు. భాషా శాస్త్రజ్ఞులను (linguists) కలవమన్నారు. భద్రిరాజు కృష్ణమూర్తి, చేకూరి రామారావు లాంటి వారిని కదిలిస్తే కొన్ని సంగతులను జెప్పారు. చివరకు వారు కూడ, పూర్తి వివరాల కోసం, మానవ శాస్త్రవేత్తలను (anthropologists) కలవమన్నారు. వీరు ఈ విషయమై ఎక్కువ వివరణ ఇవ్వగలిగారు. మొత్తం మీద చాల మంది దగ్గర విన్న తరువాత చచ్చే భాషకు ఈ క్రింది లక్షణాలు ఉంటాయి.అని తెలుసుకున్నాను.

ముందుగా మాటలకు ముప్పువస్తుంది.

ఆ భాష మాటలు మోటుగ, వాడరాని మాటలుగ చూడబడతాయి. పేరు పలకలు బదులు నామ ఫలకాలు అంటారు. పేరు పలకల మీద బడి అని రాయరు. పాఠశాల అని

రాస్తారు. పెండ్లికి పిలిచేప్పుడు 'మా జ్యేష్ఠ కుమారుడు' అని రాస్తారు. 'మా మొదటి కొడుకు' అని రాస్తే మొరటుగ కన్పిస్తుంది. 'దండాలు, కైమోడ్పులు, మంగిడీలు' మాయమై 'నమస్తే, నమస్కారాలు, గుడ్ మార్నింగులు' వచ్చేస్తాయి. వివాహ మహోత్సవం, పరిణయ మహోత్సవం అంటాము గాని పెండ్లి పండుగ/వేడుక/పబ్బము అనలేము. అందువల్ల ఇప్పుడు తెలుగువారు మాట్లాడేప్పుడు పరాయి మాటలే ఎక్కువ వినపడతాయి. పండితులైతే సంస్కృతం మాటలను వాడటం గొప్ప అనుకొంటారు. ఇతరులు ఆంగ్ల మాటలను వాడితే గొప్ప అనుకొంటారు. మొత్తం మీద తెలుగు తల్లిని చంపే పని ఆగకుండ అందరి చేతులతో కొనసాగుతున్నది.

డా. శ్రీనివాస చక్రవర్తి (చెన్నై ఐ ఐ టి లోని న్యూరో సైన్సు ఆచార్యులు) ఇలా అన్నారు: 'తెలుగులో అపారమైన శబ్దపుష్టి ఉంది. కాని పదాలను వాడకపోతే అవి పువ్వుల్లా వడలి రాలి పోతాయి.'

ఇక్కడి రచయితలు ఒక ఉదంతాన్ని ఇలా చెప్పుకొంటారు:

ఒకసారి వాజపేయి ప్రధానమంత్రిగ ఉన్నప్పుడు, హైదరాబాద్ వస్తే, తిండి ఏర్పాటు చేశారు. ప్రక్కనే ఉన్న ముఖ్యమంత్రిగారిని మీల్స్ అన్న మాటకు తెలుగు మాట ఏమిటి అని వాజపేయి అడిగారు. ఆయన గారు 'అన్నం' అన్నారు.

"అది సంస్కృతం మాటే. తెలుగు మాట చెప్పండి" వాజపేయి గారు అన్నారు.

"భోజనం."

"అది కూడ సంస్కృతం మాటే. తెలుగు మాట చెప్పండి."

"ఇంత కన్న తెలుగులో మాటలు లేవు."

పక్కనే ఉన్న వంటవాడు 'కూడు, బువ్వ, తిండి అని అంటారండి' అన్నాడు. కొంచెం కొన ఊపిరితోనైన తెలుగు కొట్టుమిట్టాడుతున్నదంటే దానికి కారణం బడుగులే.

అన్నం యొక్క తెలుగు మాటలను వాడటం మోటు అయిపోయింది. కూడు, బువ్వ, తిండి లాంటి తెలుగు మాటలను వాడరాని మాటలుగ, దాదాపు తిట్టు మాటలగ అనుకొంటున్నాము. కొంతమందికి అటువంటి మాటలున్నాయి అని కూడ తెలియని దశకు చేరుకొన్నాము.

ఆ భాష మాటల వాడకం లేకపోవడం వల్ల అటువంటి మాటలను ఎవరైనా, అమ్మ నుడి మీద మోజుతో, వాడదామన్నా తెలియని మాటలుగా అయిపోతాయి. కష్టం అన్న మాటనే తీసుకోండి. దయ చేసి ఇక్కడ కొంచెం ఆగి, ఈ పుస్తకంపైనుంచి మీ చూపును మరల్చి, దీని బదులు ఒక తెలుగు మాటను పట్టుకోండి. ఎక్కువ మంది బాధ అంటారు.

అది కూడ తెలుగు మాట కాదు. కొంత మంది ఎం. ఏ. తెలుగు చదివిన వారు కూడ చెప్పలేకపోయారు. కష్టం అనే మాటకు తెలుగులో ఉన్నన్ని మాటలు మరే నుడి లోను లేవు. నాకు అంతగా తెలుగు పరిజ్ఞానం లేదు. అయినా నేను చూసినవే ఎన్ని మాటలు ఉన్నాయో చూడండి; ఇడుములు, ఇక్కట్లు, ఇబ్బందులు, పాట్లు, కడగండ్లు, తిప్పలు, తంటాలు, అగచాట్లు, అరిది, బిరుసు, ఎవ్వ, గొడదు, ఇమ్ముదప్పు, జటిలం, కరకరి, కసాలా, కస్తి, కటువు, కొడిమె, నిగ్గడి, పీడ, గడ్డు, కక్కస, బెడద, పోటు, కవుకులు, కడివి, ఎడరు, అలుగులము, అలజడి, అంకిలి, అంగద, అందెబిందెలు, కీడు, గండం, చిక్కు, చేటు, తెక్కలి, పాటు, (ప్రాణ)గొడ్డము, సేగి, దావంతము. ఇవి కాక కన్యా కుమారి నుంచి వింధ్య పర్వతాల దాక ఉన్న పల్లెల్లోకి వెళ్లి సేకరిస్తే ఇంకా చాలా మాటలు దొరుకుతాయి. పాత పుస్తకాలలో కవులు రాసినవి, ఇప్పుడు వాడనివి ఇంకా ఎన్ని ఉన్నాయో పరిశోధకులు బయటకు తీస్తే తెలుగు ఎంత సుసంపన్నమైన భాషో అందరికి తెలిసి వస్తుంది. ఈ తరం వారే ఈ మాటలను మరచి పోతున్నప్పుడు, తరువాతి తరాలకు ఈ మాటలు కూడ తెలియవు.

కొత్త మాటల అవసరం వచ్చినప్పుడల్లా వేరే భాషలనుంచి తెచ్చుకుంటారు.

ప్రతి భాషకు, వివిధ రంగాల్లో పెరుగుతున్న అవసరాల వల్ల, కొత్త మాటల అవసరం, దాదాపు ప్రతి రోజు, వస్తూనే వుంటుంది. బ్రతకగలిగే భాషలు, (హీబ్రు, తమిళం, మాండరిన్ లాగ) ఈ మాటలను తమ వేర్లనుంచే పుట్టించుకొంటాయి. తెలుగులో మాత్రం ప్రతి కొత్త మాటకు సంస్కృతం వైపు వెళ్తారు; అక్కడ కూడ కుదరకపోతే ఆంగ్లం మాటనే ఉంచుతారు. రాజరాజ నరేంద్రునికి వెయ్యి ఏండ్ల తరువాత మొదటిసారిగ తెలుగుకు విలువను ఇచ్చిన ఏలికగ మనం నరసింహారావు గారిని చూశాము. ఆయనగారు మొదటి తరగతి నుంచి స్నాతకోత్తర దశ వరకు అన్ని రంగాలలో తెలుగు పాఠ్యపుస్తకాలను తయారు చేయమంటే, తెలుగును చంపటానికి కంకణం కట్టుకున్న మన పండితులు ఎంత ఘోరం చేశారో చూడండి:

Vertebrata అనే మాట వెన్నెముక గల ప్రాణులను సూచించే మాట. దీనిని తెలుగీకరించటానికి ఎప్పటి లాగనే, తెలుగుపై ఉండే చిన్న చూపు తోటి, సంస్కృతం నుంచి 'సకసేరుకములు' అనే మాటను తయారు చేశారు. కేరళ, కాశ్మీరులోని మామూలు సంస్కృత పండితులను అడిగినా దీని అర్థం చెప్పలేరు. తెలుగులో జంతువుల మాటలను ఏలు అనే మలి చేర్పు (suffix) మాటతో తయారు చేయటం మనకు తెలుసు. తాపీగ పోయే జంతువును తాబేలు అన్నారు. కుందుకుంటూ వెళ్ళే జంతువును కుందేలు అన్నారు. మనుషుల పెంపకంలో ఉంటూ గట్టిగ పొట్టిగ ఉండే జంతువును పొట్టేలు అన్నారు. యజమాని కొంచెం కనుమూస్తే పట్టుకొని తినేద్దాం అనే ఆశతో గొర్రె పిల్లకు తోడుగ మసిలే జంతువును తోడేలు అన్నారు. అందుకని అదే దారిలో వెన్నెముక గల

జంతువును వెన్నేలు అంటే ఎంత సహజంగా వుంటుందో చూడండి. పిల్లవాడు ఇక ఈ మాటను బ్రతికినంత కాలం మరచిపోడు. సకసేరుకములు అనే మాట పిల్లవాడికి గుర్తుండటం కష్టం, అన్నంలో పంటి కింద రాయి లాగ ఉంటుంది. 'చివరకు తెలుగు కంటె ఆంగ్ల మాధ్యమమే మంచిది' (కనీసం తరువాత చదువుల్లోనైన పనికి వస్తుంది) అని పిల్లవాడు ఆంగ్లం వైపు పారిపోయేట్టు ఈ దిక్కు మాలిన మాటలు చేస్తున్నవి. డా.శ్రీనివాస చక్రవర్తి (చెన్నై ఐ ఐ టి లోని న్యూరో సైన్సు ఆచార్యులు) ఇలా అన్నారు: '... సైన్సు బోధనలో విపరీతమైన పరిభాషను వాడి పాఠకులను హడలగొట్టడమే.'

Reptile అంటే పాకుడు జంతువు. దీనిని తెలుగీకరణ చేయమంటే మన పండితులు 'సరీసృపం' అన్నారు. గుజరాతు, బెంగాలులోని సంస్కృతం పండితులను అడిగినా వారు సరీసృపం అంటే అర్థం చెప్పలేరు. అంతగా కృతకమైన, ఎవ్వరికీ తెలియని మాటను ఎంత అసహజంగా పెట్టెడి ధైర్యం మన పండితులకు ఉందో చూడండి. ఈ మాటను వారం రోజుల తరువాత చెప్పమంటే మీరు కూడా చెప్పలేరు. అదే పాకేలు అని అంటే ఎంత సహజంగా ఉంటుందో ఎంత అర్థవంతంగా ఉంటుందో గమనించండి. తమిళనాడు లోని కొత్తగ తెలుగు రాయడం నేర్చుకొన్న తెలుగు వాడు, పురుసోత్తం ఈ మాటలను ప్రతిపాదించాడంటే అసలైన తెలుగు వాళ్ళం అనుకొనే మనం తెలుగును ఎంతగా నాశనం చేస్తున్నామో ఆలోచించండి.

Protozoa అనే మాట వచ్చేసరికి సరి అయిన మాట సంస్కృతంలో కూడ తోచలేదు; దాన్ని అలానే తెలుగులోనూ వాడటం మొదలెట్టారు. లాటిన్ నుడిలో proto అంటే మొదటి అని zoa అంటే ప్రాణి అని అర్థాలు. దీనికోసం తొలి+ఏలు= తొలేలు అనే మాట ఎంత తేలికగా ఉందో, ఎంత తేలికగా తయారు చేసుకోవచ్చో చూడండి. ఇక ఆ మాటను ఒకసారి విన్న పిల్లవాడు బ్రతికినంత కాలం మరచిపోడు. గుర్తు పెట్టుకొనటానికి వీలు కాని ఈ సంస్కృత మాటల దెబ్బకు, తెలుగు పిల్లవాడు ఆంగ్ల మాధ్యమం లోనికి పారిపోయాడు.

Vehicle అనే మాట వచ్చేసరికి ఎప్పటి లాగ సంస్కృతం నుంచి వాహనం అనే మాటను తెచ్చుకున్నాము. తెలుగులో వూరేగటం అంటే బండి/పల్లకిలో వూర్లో తిరగటం అని అర్థం. బస్సును తెలుగులో ఊరేగి అని పిలవడం కొన్ని చోట్ల చూస్తున్నాం. అంటే ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్ళడానికి పనికొచ్చే బండి అని అర్థం. ఇందులోనుంచే అన్ని రకాల బండ్ల మాటలను తయారు చేయవచ్చు అని మేము చర్చించుకొంటున్నప్పుడు, మా దగ్గర పూదోట శౌరీలు గారుండిరి. తెలుగు భాషోద్యమంలో వారు ప్రముఖులు. బోధన్ ఊళ్ళో పంతులమ్మగ పనిచేసి పదవీ విరమణ చేశారు. వారు పంతులమ్మగ పనిచేసేటప్పుడు ఈ విషయాన్ని బడిలో పిల్లల ముందుంచి మీకు కనపడే బండ్లకు తెలుగు మాటలను తయారు చేయండి అంటే పిల్లలు లెక్క లేనన్ని మాటలను కనిపెట్టారు. ఆ

వివరాలు మరో చోట ఇవ్వబడ్డాయి. నిజంగా తపన ఉంటే, తెలుగులోని కలుపు మొక్కలను ఏరేయటం ఎంత తేలికో ఈ ఉదంతం తెలియజేస్తున్నది.

తమిళులు ఈ చిక్కును ఎలా ఎదుర్కొన్నారో చూద్దాం;

విద్యుత్ అంటే సంస్కృతంలో మెరుపు అని అర్థం. రెండు మేఘాలు దగ్గరికి వచ్చినప్పుడు మెరుపు, చప్పుడు కలగడాన్ని మనిషి ఒక దిగ్భ్రమగా ఎప్పటినుంచో చూస్తున్నాడు. చాలా పైకి ఎగురవేసిన గాలిపటం నుంచి మెరుపు కిందికి రావటం చూశాక దానికి ఎలక్ట్రిసిటీ (విద్యుత్) అని పేరు పెట్టాడు. తల్లి నుడి మీద ఎక్కువ మక్కువ ఉన్న తమిళులు ఇంగ్లిష్, సంస్కృతం కాదని తమ నుడి వేళ్ళనుంచే విద్యుత్‌కు బదులుగ ఒక పేరును తయారు చేసుకోవటానికి ప్రయత్నించి అది అంతగా కుదరనట్లుంటే పెద్దమ్మ, తెలుగు దగ్గరకు వచ్చారు. విద్యుత్ గుర్తును ఒక సారి మననం చేసుకోండి. ఆంగ్ల అక్కరం S ను గుండ్రంగ కాకుండ మూడు సరళ రేఖలలో రాసినట్లుంటుంది. అంటే ఒక చారగా ఉంటుంది. అందుకని మిన్ను నుంచి వచ్చిన ఒక చార, 'మించార' అని విద్యుత్‌కు తమిళంలో పేరు పెట్టారు. ఇక పేరు పెట్టాక ప్రతి ప్రభుత్వ ఉత్తర్వులోను, పేరు పలకలోను, టి.విలోను, పత్రికలలోను తప్పక వాడతారు. కాబట్టి తమిళనాడులోని పల్లెటూరు వాడినడిగినా విద్యుత్ ను 'మిన్సార' అనే అంటాడు తప్ప మన లాగ కరెంటు, ఎలక్ట్రిసిటీ అని అనడు. మిన్ను అనే పేరు పాత ద్రావిడ మూల భాషలో వుంది గాని తమిళంలో మాత్రం ఇప్పుడు ఆకాశం అనే మాటకు వానం అనే మాటనే వాడతారు.

తమిళంలో అసలు కొత్త కలుపు మొక్కలు రాకుండ ముందే పదిలంగా ఉంటారు. తంజావూరులో దీనికోసం పండితులతో ఒక సంఘాన్ని వేశారు. కొత్త మాటల అవసరం ప్రతి రోజు వస్తూనే ఉంటుంది. ఆ కొత్త మాటల జాబితాను, భాష మీద ప్రేమ ఉన్న ఆ ప్రభుత్వం, ఆ సంఘానికి పంపిస్తుంది. వారు వారం రోజులలో వాటికి తగిన తమిళం మాటలను పుట్టిస్తారు. ప్రభుత్వం వాటిని అందరికి తెలియజేస్తుంది. ఇక అప్పటి నుంచి ప్రభుత్వం, పత్రికలు, రేడియోలు, టీవీలు, బడులు, సాహితీవేత్తలు ఆ మాటలను వాడతారు. అయిదారు నెలలలోనే, అవి సహజమైన మాటలుగ చలామణి అవుతాయి. ఇది అక్కడ నిరంతర ప్రక్రియగ ఉంటుంది. వారు పోలీస్ అనరు. కావల్ (తెలుగులో కావిలి లేక కావలి) అని అంటారు. కానిస్టేబుల్ ను కావల్ కారన్ (కావలివాడు) అని గర్వంగ అంటారు. విద్యుత్‌కు కూడ వారు తయారు చేసుకొన్న మాట మిన్సారనే వాడతారని ఇంతకు ముందే చూశాము. తమ జాతి, భాష, సంస్కృతి అంటే నిజమైన ప్రేమ, అభిమానం ఉన్న ప్రభుత్వాలు అలా పని చేస్తుంటాయి.

వేరే భాషలనుంచి వచ్చిన మాటలను కూడ తమ భాషా సంప్రదాయాల ప్రకారం రాయడం మానేస్తారు.

స్వాభిమానం ఉన్న వారెవరైనా, పరాయి భాషలనుంచి తప్పనిసరి అయి మాటలను తెచ్చుకున్నా వాటిని తమ భాష నుడికారంలోనే రాస్తారు. 'ముంగిస' అన్నమాట తెలుగునుంచి ఆంగ్లంలోకి పోయినప్పుడు వారు తమదైన నుడికారంతో 'mongoose' అని రాసుకున్నారు. అలానే 'పందికొక్కు' ను 'bandicoot' అని రాసుకొన్నారు. హలంతంగా చేసుకున్నారు. పల్లకిని palanquin అన్నారు. (చెప్పులు chappals; తాడి toddy)

తమిళులు 'లక్ష్మి'ని 'లచ్చుమి' అని గర్వంగ రాసుకొంటారు. మనం మాత్రం, ఏ మాత్రం సిగ్గు ఎగ్గు లేక ఆ పెరమాటలను అలానే రాస్తున్నాము. సరి కదా వాటి కోసం కొత్త కలుపు అక్కరాలనే పుట్టిస్తున్నాము. పంటను ఉర్దూలో fasal అంటారు. దానిని తెలుగులో రాసేటప్పుడు ఫసల్ (అజంతం కాదు చూడండి) అని రాస్తూ ఒత్తు ఫ క్రింద ఒక చుక్కను కూడ పెడ్తున్నాము. జ, ఞ,ఋ, ౠ, ఖ, ఝ, ధ లాంటి అక్కరాలన్ని అలా తెలుగులో మనం పుట్టించుకొన్న కలుపు మొక్కలే. ఏ భాషాశాస్త్ర నియమాల ప్రకారం కూడ ఋ, ౠ లు అచ్చు చప్పుళ్ళు కావు. కాని సంస్కురుతంలో అవి అచ్చులు కాబట్టి మన దగ్గర కూడా అవి అచ్చులు అని అంటున్నాము.

పైగా ౠ అనే అక్కరాన్ని మనం ఎప్పుడూ వాడం. ఆ అక్కరాన్ని వాడి రాసే పదం లేకపోయినా మనం మాత్రం దాన్ని బలవంతంగ మన పిల్లలకు ఒకటవ తరగతి నుంచే నేర్పటం ఎంత ఘోరమో చూడండి. గమ్మత్తేమిటంటే సంస్కురుతంలో కూడా ఆ అక్షరాన్ని వాడరు కాని నేర్పుతుంటారు. ఇంతకు మునుపు రేయి అనేవాళ్ళం, ఇప్పుడు రాత్రి అని మాత్రమె వాడుతున్నాము.

చచ్చిపోయే భాషాకుటుంబం వారి తమవైన పేర్లు కూడ ముందుగ చావడం మొదలెడతాయి.

ఎఱ్ఱన, తిక్కన, పోతన, మారన, కొండయ్య, బండన్న, చిముకుడు, తిక్కాడు, చెంచయ్య, పుల్లయ్య, మంగమ్మ, బొఱ్ఱమ్మ, తాయారు, పిచ్చమ్మ, గాలెమ్మ, జాలమ్మ, సమ్మక్క, మైసమ్మ, సారక్క లాంటి మాటలు మాయమవటం మన కళ్ళ ముందే జరిగిపోతున్నది. ఆంగ్లేయులు Longfellow, (గేడి వాడు) Hillman (కొండయ్య) అని పెట్టుకోవటానికి సంకోచించరు. మనం మాత్రం తెలుగు మాటలనుంచి వచ్చిన పేర్లను పెట్టుకొంటే ఏ మాత్రం భరించలేని దశకు చేరుకొన్నాము. ఇంత ఆత్మన్యూనత భావం ఉన్న జాతి ఎలా బ్రతుకుతుంది? నా మనవడికి కోదండ రామయ్య అని పేరు పెడితే వాడు బడి అయినా మానేస్తాడు లేకపోతే మా 7వ అంతస్తు నుంచి దూకనైనా

దూకుతాడు. మొదటి రోజే బడిలో ఆ పేరు మీద వాడిని అంతగా హేళన చేస్తారు. విశాఖలో నాకు తెలిసిన కుటుంబంలో ఒకరు తమ బాబుకు తాత పేరు పెట్టారు. బడిలో పిల్లల పరిహాసాలకు వాడు బెంగపడి మౌనంగా ఉండిపోయాడు. చివరికి వాడికి నత్తి రావటాన్ని వారు గమనించారు.

తమిళనాడు శాసనసభలోని సభ్యుల పేర్లను పట్టుబట్టి తమిళపు పేర్లగా మారుస్తారు. అక్కడి బళ్ళల్లో పిల్లల పేర్లు మార్చుకొంటే స్కాలర్ షిప్పులను ఇస్తారు. సినిమా పేరు తమిళంలో లేకపోతే దానిని ఆడనివ్వరు. తెలుగు సినిమాలకు మాత్రం మనం తెలుగు పేర్లు లేకుండ చూస్తాం. తమిళంలో కోచ్చడైయన్ వుంటే తెలుగులో విక్రమ సింహ ఉంటుంది. అక్కడి ఎందిరన్ ఇక్కడ రోబో అవుతుంది.

మన ఆత్మన్యూనత భావం ఎంత వరకు చేరుకున్నదంటే 'మన పేర్లు మంచివి కావు. ఇతరుల పేర్లు మాత్రం మంచివి' అనుకొంటున్నాము. అందుకని మన దగ్గర అజయ

ముఖర్జీలు, బెనర్జీలు, శివాజీలు కనపడతారు. ఇవి కొంత నయం. చాలాసార్లు ఇతర భాష నాయకుడి ఇంటి పేరు, తండ్రి పేరు, చిన్నప్పటి ముద్దు పేరు, సరే ఆయన పేరు కూడ పెట్టుకుంటాం. అందుకనే మన దగ్గర బాబు రాజేంద్ర ప్రసాద్ లు, బాల గంగాధర తిలక్ లు, మోహన్ దాస్ కరంచంద్ గాంధీ లు కనపడతారు. గొప్ప వారి పేర్లు పెట్టుకోవడంలో తప్పు లేదు కాని, అందులో కూడ ఇచ్చి పుచ్చుకోవడం ఉండాలి. అలా లేకపోతే, మనది తక్కువ రకం జాతి అనీ, వేరే వారిది ఎక్కువ రకం జాతి అనీ మనమూ, వారూ ఏ మాత్రం అనుమానం లేని నిర్ధారణకు వచ్చినట్లు లెక్క. ఆరు భాషలలో పాండిత్యం ఉన్న కృష్ణ దేవ రాయలు, పరాయి పాలనపై పోరాడిన అల్లూరి సీతారామ రాజు, జాతీయ జెండాను తయారు చేసిన పింగళి వెంకయ్య, కనీసం వెంకటేశ్వర స్వామి పేరయినా ఉత్తరాదిన ఎవరైనా పెట్టుకొంటారా? తప్పదు అనుకొంటే తిరుపతి వేలుపును వేంకటేశ్వరుడు, శ్రీనివాసుడు అని పిల్చే బదులు వారిదైన ధోరణిలో 'బాలాజీ' అని పిలిచి మురిసి పోతుంటారు.

ప్రతి ఊర్లో మనకు ఝాన్సీలు కనపడుతారు. ఎందుకంటే ఆమె ఉత్తరాది ఆమె. 160 ఏండ్ల క్రింద ఆమె 10 రోజులు మాత్రమే రాణిగ ఉండి శత్రువుల చేతిలో 29వ ఏట చనిపోయింది. కాని ఒక తెలుగు రాణి 800 ఏండ్ల క్రింద 50 ఏండ్లకు పైగా పరిపాలించింది. తన 82వ ఏట గుర్రం మీద స్వారి చేస్తూ, ఒక చేత చంటి బిడ్డను పట్టుకొని రెండవ చేతితో కత్తి పట్టుకొని శత్రువుతో యుద్ధం చేస్తూ చనిపోయింది. అంత గొప్ప పోరాట యోధులు ప్రపంచ చరిత్ర లోనే కనపడరు. గుర్రపు స్వారి తెలియని ఒక మంచి యువకుడిని నాలుగు గంటలు గుర్రం మీద ఉరికిస్తే ఇక ఎప్పటికి పనికి రాని వికలాంగుడిగ మిగిలి పోతాడు. గుర్రంలో స్ప్రింగ్‌లు ఏమీ ఉండవు. అలా స్వారి చేస్తే అతడి తలకాయ, కాళ్ళు పట్టుకొని నడుమును నాలుగు గంటలు రాయికి వేసి కొట్టినట్లే. స్వారి సమయంలో రికాబులలోని కాళ్ళ మీద బరువును మోపుతూ నడుము భాగాన్ని పైకి ఉబకబట్టి ఉంచాలి. అందుకని 'మా తెలుగు తల్లి' పాటలో 'రుద్రమ్మ భుజశక్తి' అంటారు. ఇంత చేస్తే చెత్త తెలుగు రాణి పేరు కదా అని రుద్రమ దేవి పేరును ఎవరూ పెట్టుకొనరు.

పాశ్చాత్యులు 2000 ఏండ్ల నాటి బైబులులో ఉన్న ఒక పేరును మోటు అనుకొనక తప్పక పెట్టుకుంటారు.

చచ్చి పోయే భాషల వారికి తమ మాటల మీద పెను రోత(ఫోబియా) వచ్చేస్తుంది.

పిచ్చి కుక్కలు లేక నక్కలు కరిస్తే రాబీస్ జబ్బు వస్తుంది అని మీకు తెలుసు. దాని లాటిన్ పేరు హైడ్రో ఫోబియా. అంటే ఆ జబ్బు వచ్చిన వారికి నీరు పడదు. నీరును ఏ మాత్రం దగ్గరకు రానివ్వరు.

బువ్వ లేకుండ మనిషి 30, 40, రోజులు బతకగలడేమో కాని నీళ్ళు లేకుండ వారం రోజులు కూడ బతక లేడు. ఆ రోగి నీళ్ళు తాగకపోతే వారం రోజుల్లో చస్తాడు. నీళ్ళు దగ్గరకు తెస్తే వెంబడే చస్తాడు. అంటే ఇక బ్రతకటం కుదరదు అన్న మాట. తెలుగు వాడి పరిస్థితి అలా వుంది ఇప్పుడు. తెలుగు మాటలను వాడటాన్ని సహించలేడు. వాడకపోతే తెలుగువాడిగా బ్రతుకలేడు.

తిండి, కట్టుబడి, వంట వంటి అన్ని రంగాల రోజువారీ మాటల్లో కూడ అమ్మ నుడి తగ్గి పోతుంటుంది.

ఇప్పుడు మనం పచ్చడి అనము. పికిల్ లేక చట్నీ అంటాం. బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అంటాం. మాపటి తిండి, చిరుతిండి (సిర్దిండి), పైటి కూడు (పైటన్నం) అనలేము. అలా అనాలంటే అమ్మ నుడి మీద గౌరవం ఉండాలి. ఆత్మాభిమానం ఉండాలి. అలా తమిళులకు, హిబ్రూ వారికి(ఇస్రఏలీలకు), జపనీయులకు, ఇతర బతక గలిగిన జాతులకు ఉంది.

అసలు తిండ్లలో కూడ ప్రతి జాతికి తమవైన ప్రత్యేకతలు ఉంటాయి. ఇప్పుడు మనకు గారెలు దూరమౌతున్నాయి. సమోసాలు వచ్చాయి. పులిహోర పోయింది, బిరియాని వచ్చింది. వేరే తిండ్లు తినవద్దని కాదు గాని మన ప్రత్యేకతలను పూర్తిగ మర్చి పోవద్దనే ఇక్కడ మనం గుర్తించాలి. అమేరిక ప్రెసిడెంట్ వస్తే 'మా బిరియాని రుచి చూడండి' అంటాడు తెలుగు ముఖ్యమంత్రి. అసలు బిరియాని నీ ప్రత్యేకత ఎలా అయింది? అరబిక్ దేశాల్లో ఈ వంటకం చేయరా? కనిపెట్టిందే అక్కడ. ఉత్తర ప్రదేశ్, బీహార్ వగైరాల్లో చేయరా? ఆత్మాభిమానం ఉంటే, 'మా పాయసం, బొబ్బట్లు, ఊరగాయ, ముద్దపప్పు, ఆవు నెయ్యి, గడ్డ పెరుగు, గోంగూర, పులిహోర, పెసర గారెలు, పాలన్నం, సాంబువ్వ, పూర్ణాలు, పాల తాలికలు, చక్కర పొంగలి, ఉండ్రాళ్ళు, కుడుములు, చలిమిడి రుచి చూడండి' అనాలి.

ఇంటిని కట్టేటప్పుడు వాడే మాటల్లో కూడ తెలుగు పోతున్నది. మట్టం అనటం లేదు. లెవెల్ అంటున్నాం. ఇటుక, పనోళ్ళు, తలుపు, అంతస్తు, ఇనుప చువ్వలు అనే బదులు బ్రిక్, లేబర్, డోర్, ఫ్లోర్, ఐరన్ రాడ్స్ అంటున్నాము.

పగలు టి.వి. కార్యక్రమాల్లో వంటలను గూర్చిన మాటలను వినండి; ఓ స్పూన్ ఆయిల్, టూ గ్రామ్స్ వీటు, వన్ కిలో బ్రింజాల్ తీసుకొని, మిక్స్ చేసి, ఫ్రై చేసి, కూల్ చేసి, టేస్ట్ చేయండి. అమ్మ భాషను ఇంత నీచంగా చూసే జాతి ఈ నేల మీద మరోటి ఉండదు. ఒరియా టి.వి.లలో పట్టుబట్టి ఒరియా మాటలనే వాడుతారు అని వైజాగ్ పాత్రో గారు అన్నారు.

చచ్చి పోయే భాష యొక్క వాక్య నిర్మాణ శైలి కూడ మారిపోతుంటుంది.

మనం ఇంత వరకు, మాటలు ఎలా చస్తుంటాయో, తెలిసిన మాటలను కూడ వాడటానికి ఎలా జంకుతుంటారో చూశాం. ప్రతి నుడికి తనదైన నానుడి నిర్మాణ ప్రక్రియ ఉంటుంది. చచ్చిపోయే నుడి ఇందులో కూడ తనదైన ప్రత్యేకతను పోగొట్టుకొంటుంది.

'నేను ఏదైతే చెప్పదల్చుకున్నానో అది బుద్ధప్రసాద్ గారు చెప్పేశారు'. ఇటువంటి వాక్యాలను మనం ఇప్పుడు తరచుగ వింటున్నాం. హిందీ, ఆంగ్ల వాక్య ప్రక్రియల నుంచి ఈ వాక్య ప్రక్రియ నేరుగా దిగుమతి అయింది. What I wanted to say, has already been told by Buddhaprasad garu అని ఆంగ్లంలోను, 'మై జో కహనా చాహ్ రహా థా, బుద్ధప్రసాద్ జీ వో బోల్ దియే' అని హిందీలోను అంటారు. ఆ భాషల్లో మరో రకంగా ఆ భావాన్ని చెప్పటం కుదరదు. కాని మనదైన తీరులో చెప్పాలంటే 'నేను చెప్పదలచుకొన్నది బుద్ధ ప్రసాద్ గారు చెప్పేశారు' అని చెప్పాలి.

'మంత్రిగారు అలా చెప్పటం జరిగింది' అని వింటుంటాం. ఈ ప్రయోగం కూడ పరాయిదే. మనదైన తీరులో చెప్పాలంటె 'మంత్రిగారు అలా చెప్పారు.' అని అనాలి. 'అందుకనే ఇవ్వాళ మీ వూరు రావటం జరిగింది, అన్నీ చూడటం జరిగింది, మీరు చెప్పినవి వినడం జరిగింది' అని వికృతంగా మాట్లాడటం చూస్తున్నాము. చూడటం జరగటం, చూడటం కదలటం, చూడటం దూకటం ఏమిటో? 100 ఏండ్ల క్రితం ఎక్కడా తెలుగు పుస్తకాల్లో ఇటువంటి ప్రయోగాలే లేవు. ఒక మంత్రిగారు 'అలా జరగటం జరిగింది' అని అనటాన్ని నేను విన్నాను. మనకి పట్టిన రోగం బాగ ముదిరిందిరా అని తేల్చుకొన్నాను.

'ఆ అమ్మాయి వస్తూంది' అని అంటున్నారు. వస్తూ+ఉన్నది =వస్తూంది గా చేసి తెలుగు మాటలతో సవర్ణ దీర్ఘ సంధిని చేశారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకొనటం అంటే ఇదే.

'అలా చేస్తోంది మా వాడే' అని అంటున్నారు. చేస్తా+ఉన్నది= చేస్తోంది గా చేసి తెలుగు మాటలకు గుణ సంధి రోగాన్ని తెచ్చారు. 100 ఏండ్ల క్రితం ఈ రోగానికి చాల దూరంగ ఉండే వారు తెలుగు రచయితలు.

తెలుగులో కర్మను సూచించే నామవాచకానికి ఒక విభక్తిని పెడతారు. అందుకని ఆ మాటను వాక్యంలో ఎక్కడ పెట్టినా అర్థం మారదు. రాముడు రావణుని చంపెను, రావణుని రాముడు చంపెను, రాముడు చంపెను రావణుని, రావణుని చంపెను రాముడు అని ఎలా అన్నా అర్థం ఒక్కటే. ఆంగ్లంలో Ramudu killed Ravanudu అనే వాక్యం బదులు Ravanudu killed Ramudu అని అనలేము. ఆంగ్ల ప్రభావం వచ్చిపడి ఇప్పుడు మనం కర్మకు పెట్టాల్సిన విభక్తులను పెట్టటం మానివేస్తున్నాము.

భావోద్వేగాలు వచ్చినప్పుడు అమ్మ నుడి నుంచి బయటకు వెళ్తారు.

చిన్నప్పుడు ఓ హిందీ పుస్తకంలో ఒక కత చదివాను. ఒక రాజు గారి దగ్గరకు ఒక పండితుడు వచ్చాడు.

'మీ దగ్గర ఉన్న సాహితీవేత్తల కన్న నేను గొప్పవాడిని. నాకు చాల భాషలు వచ్చు. మీరు కనీసం నా తల్లి నుడి ఏదో కూడ కనుక్కోలేరు' అంటాడు.

ఏ భాషలో పరీక్ష పెట్టినా అది అతని తల్లి భాషే అన్నంత గొప్పగా అతను మాట్లాడుతుంటాడు. రాజు గారికి పాలు పోలేదు. రామ లింగడు 'రేపు తేలుద్దాం' అని వాయిదా వేయిస్తాడు. ఆ పండితుడు పడుకొన్న గదిలోకి రాత్రి పూట ఒక మనిషిని దొంగ లాగ పంపించారు. పండితుడు 'ఎవడురా వాడు' అని దిగ్గున లేచాడు. దానితో అతని తల్లి నుడి తెలుగు అని తేల్చి వేశారు.

ఒక మనిషికి పట్టరాని సంతోషం, కోపం, అచ్చెరువు, ఏడుపు, భయం వస్తే అతను తల్లి నుడిలోకి తెలియకుండానే వెళ్లిపోతాడు. కాని ఇది కనుమరుగు అవుతున్న నుడికి వర్తించదు. ఇప్పుడు మనకు సంతోషం వస్తే హ్యాపీ న్యూస్, యూ అర్ గ్రేట్ అంటాం. లేక పోతే హిందీ పాటనో ఆంగ్లం పాటనో అందుకొంటాం. మా జిల్లాలో పాత తరం వాండ్లయితే బాగ నచ్చిన మనిషి చాల రోజుల తరువాత కనపడగానే 'సాబ్ కబ్ ఆయే' అనేస్తారు. కోపం వస్తే అప్పటి దాక తెలుగులో మాట్లాడుతున్న వాళ్ళం "గెట్ అవుట్, అరే చల్" అని అనేస్తాం. అచ్చెరువు కలిగితే వావ్ అంటున్నాం. ఏడుపు, ఇబ్బంది వస్తే 'ఓ మై గాడ్' అని వస్తున్నది.

మేము చిన్నప్పుడు మా భావాలను వెలిబుచ్చటానికి అమ్మో, ఓరి బాబో, బలేగుంది అనే వాండ్లం. ఇప్పుడవి మచ్చుకు కూడ కనపడవు.

కళలు చావడంతో ఆ నుడి బతుకు ముగిసి పోతుంది.

ఇంతకు మునుపు పాట, ఆట, నాటకాల్లో తెలుగుకు తిరుగు ఉండేది కాదు. తమిళనాడు లోని పాటలు ఆటలు నాటకాల్లో పాల్గొనే దేశ దిమ్మరులలో 95% మంది తెలుగు వారే. కర్నాటకలో కూడ దాదాపు అదే పరిస్థితి. కాని మనం ఇప్పుడు మన కళలను తక్కువగ చూస్తున్నాం. కోలాటం మన కళ కాబట్టి మనం దానిని కావాలని దూరం చేసుకొంటున్నాం. అంతకూ దానిని ఆడాల్సి వస్తే, వేరే వారి కళగా చెప్పుకొని (దాండియా) ఆడతాం. కాని తెలుగు వాసన మాత్రం మనకు కనపడకూడదు. భాంగ్రా ఆడతాం కాని తప్పెట గుండ్లు, గొల్ల సుద్దులు, జముకుల కథలు, గరగ, పేరిణి, వీర నాట్యం, యక్షగానం, చిందు లాంటివి పనికి రావు. చెక్క భజనల్లో లలితావనం, పద్మవ్యూహం, బృందావనం, చిడతల రామాయణం లాంటివి ఉంటాయని తెలియని స్థితికి చేరుకున్నాం.

300 ఏండ్ల కింద ఇక్కడకు వచ్చిన కొంత మంది మరాఠీలు తెలుగు నాటకాన్ని

చూసి మురిసి పోయి ఆ నాటకాన్ని తమ ప్రవృత్తిగానే కాదు తమ బతుకుగా చేసుకున్నారు; ఇప్పుడు వారు తెలుగువారై పోయారు. వీరు ప్రతి రోజు సురభి పేరున నాటకాలను ఆడుతూనే ఉంటారు. హైదరాబాదులోనైతే రెండు చోట్ల ఆడుతున్నారు. ఇక అరుగు మీద వీరే ఆడతారు, పాడతారు. అరుగు వెనుక వాయిద్యాలను వాయిస్తారు, రంగులు వేస్తారు, పాటలు పద్యాలు మాటలు రాస్తారు, మించు (విద్యుత్) ఏర్పాట్లు చేసుకొంటారు, అరుగు (స్టేజి) అలంకరణ చేసుకొంటారు, కళ్ళు తిరిగిపోయే తెరలు చేస్తారు, అరుగు మీద మంటలు, వానలు పుట్టిస్తారు. కావలిసిన రక రకాల దుస్తులను తయారు చేస్తారు. ఒకే ఆటలో 50 మంది వరకు నటులు మీకు కనపడతారు. ఏడాది పిల్ల నుంచి 80 ఏండ్ల పెద్ద మనుషుల వరకు అందరు నటిస్తారు; వేరే పని పెట్టుకోకుండ ఈ కళ కోసమే బ్రతుకుతారు. సినిమాలో ఒక జంటపాటలో రాజకుమారి తన వంతు పాట పాడేశాక ద్రుశ్యం అడవిలోనున్న కథా నాయకుడి మీదకు పోవాలంటే ఎంత సేపు పడుతుందో ఊహించండి. అంత కన్న తక్కువసేపులోనే మీ ముందు, స్టేజి మీద, వీరు ద్రుశ్యాన్ని మారుస్తారు. అసలు మీ కండ్లను మీరే నమ్మలేరు. 10 అడుగుల ఎత్తున్న దెయ్యాలు, ఎగురుకుంటూ వచ్చే లడ్డూలను చూసి మీరు నాటకాలలో కూడ ఇంత పనితనమున్నదా అని ముక్కున వేలేసుకొంటారు. కాని ఇప్పుడు తెలుగు వారి న్యూనతభావం వల్ల ఈ కళకు ఆదరణ తగ్గడం వల్ల వారి బ్రతుకు బరువై పోతున్నది. ఇది చదివాకనైనా మీరు ఒక శనివారం నాడో ఆదివారం నాడో భాగ్యనగరంలో సాయంత్రం అసెంబ్లీ దగ్గరి పబ్లిక్ గార్డెన్స్ లో వీరి నాటకాన్ని పట్టుబట్టి చూడండి. చూశాక 'ఇంత గొప్ప కళను ఇంత వరకు చూడని మూర్ఖుడినా నేను' అని అనుకుంటారు. 50 మంది నటులు ఉంటారు, 50 మంది ఇతర కళల వారు ఉంటారు, చూసే వారు మాత్రం 10 మందే ఉంటారు.

కల్లోల్ అనే బెంగాలీ నాటకం, అగాథా క్రిస్టీ రాసిన మౌస్ ట్రాప్– కొన్ని వేల రోజులు చూశారు మాత్రు భాష మీద మమకారం ఉన్న ఆ మనుషులు.

ఎన్నో ఏండ్ల కింద రాజస్థాన్ నుంచి ఇక్కడకు వచ్చిన సుగాలీలు (లంబాడీలు), వారి కళలను, దుస్తులను, గాజులను, మాటలను, పాటలను, ఆటలను ఇంకా పొగరుతో కాపాడుకొంటున్నారు. తమిళులు సింగపూరు, సింహళం, మలేసియాలకు ఎన్నో తరాల కింద వెళ్లి తమ నుడిని మరువక అక్కడ దానిని అధికార భాషగ సాధించుకొన్నారు. శ్రీ లంకలో దాదాపు తెలుగువారు తమిళులంత మంది ఉన్నా తమ ఉనికిని చాటుకోలేక పోతున్నారు; మన ప్రభుత్వాలు కూడ దీనికి కనీస సహాయం, సానుభూతి చూపలేక పోతున్నాయి. మన వారు ఏ దేశం వెళ్ళినా ఒక తరం తరువాత తెలుగు వాసనే లేకుండ అంతరించి పోతున్నారు.

సంఖ్యలను కూడ పలుక లేని జాతి ఎలా బతుకుతుంది?

అని సంగనభట్ల గారు అడిగారు. ఒకటి, రెండు అనలేక వన్, టూ అంటున్నాము. తెలుగు ఆచార్యులు కూడ దీనికి వేరుగా లేరు. ఇప్పుడిది పల్లెటూరికి కూడ పాకింది. మా

ఊరికి వెళ్లినప్పుడు కాయగూరలు అమ్ముతున్న అమ్మాయితో 'రేపు పొద్దునే వచ్చి తాజా కూరగాయలు ఇవ్వమ్మా. ఎందుకైనా మంచిది, నేను రేపు పిలవటానికి నీ చేపలుకి అంకెను చెప్పమ్మా' అన్నాను. ఆ అమ్మాయి ఆంగ్లంలో నైన్, ఎయిట్ అంటూ చెప్పటం మొదలెట్టింది. 'తెలుగులో చెప్పు తల్లీ' అన్నాను. చాల ఇబ్బందిగ తొమ్మిది, ఎనిమిది, నాలుగు వరకు అని ఇక అనలేక, 'నేను ఇంగ్లీసులోనే చెపుతాను. మీకు ఇష్టముంటే కాయలు కొనండి. లేకపోతే మానేయండి' అని నన్ను గట్టి గొంతుతో హెచ్చరించింది. పైట పట్టి లాగినా అంత కోపపడేది కాదేమో! తెలుగులో చెప్పమంటే ఆ అమ్మాయిని సభ్యత లేని అమ్మాయిగ నేను భావించాను– అలా చాల పెద్ద ఎత్తున అవమానపరిచాను అని అనుకొన్నది. తెలుగు పంతుళ్ళు, ప్రాచార్యులు కూడ ఇలాగే ఉంటారు. వారి సొంత చేపలుకి అంకెను సైతం తెలుగులో చెప్పలేరు. కనీసం అలా చెప్పాల్సిన అవసరం వుంది; ఇకనుంచి అయిన, అలా చెప్పుదాం అనే సోయి కూడ మనకు కలగటం లేదు.



భాషలో అందంగా మాట్లాడటం తగ్గిపోతుంది.

తెలుగులో చక్కగా మాట్లాడేవారిని వేళ్ళ మీద లెక్కించవచ్చు. సభలో మాటలతో నవ్వించి, కవ్వించి, జనాన్ని, కార్యోన్ముఖులను చేయగలిగే మన నాయకులు ఎంత మంది ఉన్నారు? తమిళనాడులో తాలూకా స్థాయి నాయకులు కూడ ఎంతో నేర్పుగా మాట్లాడతారు. వారు వేదిక మీదనుంచి మాట్లాడుతుంటే ఆ భాష తెలియని మనం కూడ ఉఱ్ఱూతలూగేట్లు అనుప్రాసాలంకారం, యమకం వగైరాలను వాడతారు. ఈసారి పని కట్టుకొని పరికించండి: సభల్లో మాట్లాడే తెలుగు వారిలో 99% మంది వరుసగా మూడు వాక్యాలను తప్పు లేకుండ మాట్లాడలేరు.

అంతర్గత పోరాటాలు ఎక్కువై ఇతర మాండలికాల వారితో శత్రు వైరుధ్యాలు తెచ్చుకొంటారు.

పూర్తిగా తెలుగు యాసలోనే ఆంగ్లం మాట్లాడే మన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను అమేరికలో ఎవ్వరూ తక్కువగా చూడరు. విద్యుత్ సంస్థలో డైరెక్టర్‌గ పని చేసిన వినయకుమార్ గారు అమేరిక వెళ్ళి, విమానాశ్రయంలో ఒకరిని తను పోవాల్సిన చోటుకు దారి అడిగారు. వీరు చెప్పేది అక్కడి మనిషికి తెలియక, అక్కడి మనిషి చెప్పేది వీరికి తెలియక 10 నిమిషాలు పట్టినా ఆ దేశస్థుడు ఓపిగ్గా చెప్పాడే తప్ప పరిహసించలేదు. మనం మాత్రం వేరే మాండలికాల వారు ఇలా మాట్లాడుతారురా అని పరిహాసాలు చేస్తుంటాం. మనం మాట్లాడే తీరు గొప్ప అని డాంబికాలు పోతుంటాం.

ఇతర లక్షణాలు

కనుమరుగయ్యే జాతి తన నుడిలోని పొత్తాలను చదవటం మానేస్తుంది. తాతల పుస్తకాలను మనకు తెలిసిన గొప్ప తెలుగు రచయితల మనమళ్ళు చదవరు. భూసురపల్లి వెంకటేశ్వర్లు గారి సూటి ప్రశ్న: 'ఏ రచయిత అయినా సరే, తన పుస్తకాన్ని కొడుకుతో చదివిస్తున్నాడా?'

తెలుగు పిల్లలకు పోతన, తిక్కన, ఆదిభట్ల తెలియరు. సుమతీ శతకం, వేమన శతకం తెలియవు.

పాటంటేనే తెలుగు అన్న దశనుంచి తెలుగు పాట లేనే లేదు అనే దశకు వచ్చాము. అన్ని రాష్ట్రాల వారు 'ఇది ఒక గొప్ప పాట' అని పాడుకొనే ఒక తెలుగు పాట ఈ 70 ఏండ్లలో వచ్చిందా? ఒక తెలుగు సినిమా పాటలో 64 హిందీ మాటలు కాదు వాక్యాలను చూశాను. ఇప్పుడు తెలుగువాడు 'హిందీ పాటలు బాగుంటాయి. తమిళం పాటలు బాగుంటాయి. ఇంగ్లిష్ పాటలు ఇంకా బాగుంటాయి.' అనుకొనే దశకు చేరుకొన్నాడు. తమిళనాడులో పనికి రాని సినిమా ఇక్కడ కోట్లు సంపాదిస్తుంటుంది అని కండ్లలో

నీళ్ళతో చెప్పారు నంద్యాల నారాయణ రెడ్డి గారు, తమిళనాడులోని ఇతర తెలుగు వారు నాతో.

వేరే భాషల సినిమాలు, టి వి సీరియళ్ళను ఏ మాత్రం స్వాభిమానం లేని తెలుగు వారు ఎగబడి చూస్తుంటారు. ఇతరులు ఎలా ప్రవర్తిస్తారో మనం ఇక్కడ గమనించాలి. కన్నడిగులు ఇతర భాషల టి వి సీరియళ్ళ డబ్బింగులను కూడ నిషేధించారు. తమిళులు ఇతర భాషల కార్యక్రమాలను చూడటం తలవంపులు అనుకుంటారు. ఒకసారి నేను ఒక రాత్రి మద్రాస్‌లో గడపవలసి వచ్చింది. వేరే వారికోసం ఎదురు చూస్తూ టి వి కార్యక్రమాలను చూశాను. ఒక్క చానల్ లో కూడ తెలుగు నుంచి డబ్ అయిన సినిమాల పాటలు కనపడలేదు. ఇక్కడ మాత్రం తెలుగు చానల్స్‌లో కూడ సగం కన్న ఎక్కువ ఇతరుల పాటలే. ఇందువల్ల తెలుగు సినిమాల మార్కెట్ తక్కువై ప్రయోగాత్మక సినిమాలను తీయలేకపోతున్నారు. ఒక మంచి తమిళం సినిమా వస్తే, ఒక్క చెన్నై లోని సినిమా హాళ్ళే నెల రోజులు ఆడించి దానిని బతికించగలవు.

అందువల్ల ఈ మూడు నాలుగు ఏండ్లలోనే తెలుగు భాష మీద అభిమానం ఉన్న వారు ఒక సైన్యంలాగ కదిలి సమరశీల పోరాటం చేయకపోతే మన అమ్మ నుడి అడుగంటుతుంది. ఒకసారి చనిపోయిన భాషను ఎవ్వరూ బతికించలేరు. ఎన్ని ప్రయత్నాలు జరిగినా సంస్కృతం, పాళీ, లాటిన్, ప్రాకృతం లాంటి గొప్ప నుడులను కూడ ప్రజల భాషలుగ చేయలేక పోతున్నారు.

కణుపు 3

తెలుగే గొప్ప భాష

తెలుగు కనుమరుగు కావడం ఖాయం అని తెలుసుకొన్నాక చిన్న వారి నుంచి చాల పెద్ద వారి వరకు చాల చోట్ల నా గోస వినిపించాను. కొంత మంది ఈ మాటలే వినడానికి ఇష్టపడలేదు. విన్న వారు కూడ ఏమీ చేయడానికి కదలడం లేదు. ఇక మనం ఏమీ చేయలేము అన్న నిస్పృహ నాలో కలిగింది. 'సరే ఎన్నో భాషలు చస్తున్నాయి. వాటిలో తెలుగు కూడ ఒకటిలే' అనుకొన్నాను. మళ్ళీ ఆలోచించి 'తెలుగు ఇతర భాషల లాంటిదేనా? ఏమైన గొప్పతనం ఉన్నదా?' అని నాకు నేను అడుగుకున్నాను. ఆ అడకకు జవాబుగ తెలుగు గొప్పతనాన్ని గురించి కొన్ని వివరాలను సేకరించి మీ ముందు ఉంచుతున్నాను.

1. నేలమీద మొత్తం 6,500 దాకా నుడులుంటే అందులో 5 మాత్రమే అజంత భాషలున్నాయి. వాటిలో తెలుగు ఒకటి.

అజంత భాష అంటే ఆ నుడి లోని ప్రతి మాట చివర అచ్చు ఉంటుంది. అచ్ + అంత = అజంత.

అ, ఆ, ఇ, ఈ, ఉ ...వగైరాలు అచ్చులు అన్న మందల (విషయం)ను ఇక్కడ గుర్తు తెచ్చుకొందాం.

మచ్చుకు పై మొదటి వాక్యాన్నే తీసుకుందాం. 'అజంత' అనే మొదటి మాటలో చివర అకారం ఉంది. తరువాతి మాట 'భాష'లో అకారం; అలాగే– 'అంటే'లో ఏ, 'నుడి' లో ఇ, 'లోని' లో ఇ, 'ప్రతి'లో ఇ, 'మాట'లో అ, 'చివర'లో అ, 'అచ్చు'లో ఉ, 'ఉంటుంది'లో ఇ అనే అచ్చులు ఉన్నాయి.

ఇలా ఇటాలియన్ నుడి (భాష) లో కూడా ప్రతి మాట చివర అచ్చు ఉంటుంది.

ఇటలీ, సిసిలీ, లియొ నార్డో డావిన్సి, నాజీ, జీనా లోలో బ్రిగడ (నేను కళాశాలలో చదువుకొనే రోజుల్లో ఇటాలియన్ సినిమా కథా నాయకురాలు) ముస్సోలినీ, గారిబాల్డి, మైకెలంజెలొ, మోనాలిస, మజ్జిని మొదలగు మాటలను గమనించండి.

దీని వలన వచ్చే గొప్పతనం ఏమిటి అన్న విషయాన్ని ఇప్పుడు చూద్దాం.

మామూలుగా ఒక అచ్చుతో ముగిసిన మాట తరువాత, మరో మాట లోనికి వెళ్ళాలంటే, చాల సులువుగా, మెత్తగా ఉంటుంది. అలా గాకుండ, ఒక హల్లు తరువాత మరో మాట లోకి వెళ్ళాలంటే, కొంత ఆగి, తరువాత కదలాల్సి వస్తుంది.

60 కిలో మీటర్ల వడితో వెళ్తున్న ఒక కారును వెంటనే సున్న వడికి తెచ్చి, మళ్ళీ 60 కిలో మీటర్ల వడితో వెళ్ళితే ఎలా గతుకులతో ఉంటుందో, ఇతర నుడులలో మాట్లాడటం అలాగుంటుంది.

మూడు, నాలుగు వందల ఏండ్ల కింద మన నాడుకు (దేశమునకు) వచ్చిన పోర్చుగీసు వారు, ఫ్రెంచ్ వారు, డచ్ వారు, తెలుగును వింటుంటే ఇటాలియన్ నుడిని వింటున్నట్లుగా తట్టటం వల్ల తెలుగును 'ఇటాలియన్ అఫ్ ది ఈస్ట్' అన్నారు. తెలుగు తెలియని వాడి ముందు తెలుగును మాట్లాడుతున్నా, వాడికి వినటానికి ఇంపుగా ఉంటుంది.

ఇతర నుడులలో కూడా కొన్ని అజంత మాటలు ఉంటాయి. కాని తెలుగులో లాగ అన్ని మాటలు అలా ఉండవు.

2. తెలుగులో మాత్రమే శతకాలు ఉన్నాయి.

శతకం అంటే, కనీసం వంద కన్న ఎక్కువ ఉండే పద్యాల గుంపు అన్నమాట. ఎక్కువగా 107కి పైనే ఉంటాయి. అవి విడివిడిగా ఉండే పద్యాలు కావు. ఒకే రకం పద్యాలై వుండి, ఒకే మకుటాన్ని (పద్యం చివర వచ్చే మాట లేక మాటల గుంపు) కలిగి ఉంటాయి. వేరే నుడులలో పద్యాలే వుండవు కాబట్టి శతక సంప్రదాయం ఉండటానికి వీలే లేదు. భర్తృహరి సుభాషితాలకు మకుటం ఉండదు కాబట్టి అవి మన అంచనా ప్రకారం శతకం కిందకు రావు. వాడుక నుడి కాదు కాబట్టి మనం ఇక్కడ సంస్కృతాన్ని పెద్దగ లెక్కలోకి తీసుకోవడం లేదు.

ఎక్కువగా ఒక శతకం ఒక మందల (విషయం) మీదనే కేంద్రీకరిస్తుంది. నరసింహస్వామి శతకం ఆ పేరు గల వేలుపు గురించే చెపుతుంది. కుమారీ శతకం ఒక అమ్మాయి చిన్నప్పుడు తల్లి గారింట్లో ఎలా మెలగాలో, బయట ఎలా మెలగాలో, పెండ్లి అయ్యాక అత్త గారింట్లో ఎలా మెలగాలో చెపుతుంది.

శతకాల వల్ల పిల్లలకు జ్ఞాపక శక్తి పెరుగుతుంది.

మనదైన నీతిని తరువాతి తరానికి విజయవంతంగా చేరవేస్తాం.

వినదగునెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
కని కల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

ఎవ్వరు చెప్పినా వినాలి. విన్న తరువాత తొందరపడక బాగా ఆలోచించాలి. అలా నిజము కల్లలను గుర్తించగలిగిన వాడే ఈనేల మీద సరి అయిన నీతిపరుడు.

కష్టబెట్టబోకు కన్నతల్లి మనసు
నష్టబెట్టబోకు నాన్న పనులు
తల్లిదండ్రులన్న దైవ సన్నిభులురా
లలిత సుగుణజాల! తెలుగు బాల!

తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని మన సంస్కురుతి ఎంత గట్టిగా చెప్తున్నదో గమనించండి.

శతకాల వల్ల పిల్లలకు సంగీత జ్ఞానము, లయ జ్ఞానము చిన్నప్పటినుంచే తెలియకుండానే కలుగుతాయి.

ఇప్పుడు, మరీ మధ్య తరగతి పిల్లల్లో సంగీత లయ జ్ఞానాలు తగ్గి పోవడాన్ని మనం గమనించాలి. ఎవరైనా పాడబోయినా, పెద్దలు ప్రోత్సహించక పోగా, తక్కువ చేసి మాటలాడటం కద్దు.

'**త**ల్లిదండ్రుల యెడ **ద**య లేని పుత్రుండు
పుట్టనేమి వాడు **గి**ట్టనేమి
పుట్టలోని చెదలు **పు**ట్టవాగిట్టవా
విశ్వదాభి రామ **వి**నుర వేమ'

పై పద్యాన్నే మరో సారి అని చూడండి. ఒత్తుగా రాసిన అక్కరాల (త, ద, పు, గి, పు, పు, వి, వి)దగ్గర తాళం పడటాన్ని చూస్తాం. అందువల్ల పద్యం చదువుతుంటే తెలియకనే తాళ జ్ఞానం వస్తుంది.

ఒక సందేశాన్ని పిల్లవాడు గుర్తుంచుకొనేట్లు చెప్పడానికి పద్యం బాగ పనికొస్తుంది.

పిల్లలు మంచి మాటలను, పద బంధాలను నేర్చుకొని చక్కగా మాట్లాడటానికి అలవాటవుతారు. పది వాక్యాలను పలికిన దానికన్న సందర్భాన్ని బట్టి ఒక మంచి పద్యాన్ని అంటే వీనుల విందుగా ఉంటుంది. విషయాన్ని కూడ గట్టిగ హత్తుకునేట్టు చేరవేయడానికి పనికి వస్తుంది.

మనదైన సంస్కృతిని తరువాతి తరానికి చేరవేయటానికి పద్యాలు తోడ్పడతాయి.

3. మన దేశంలో ఇతర నుడుల కన్న తెలుగు నుడిని మాటలాడేవారే ఎక్కువ.

ఇంగ్లిష్ వారు పరిపాలించిన రోజుల్లో, టంకసాల నుంచి బయటకు వచ్చిన ఒక అణా బిళ్ళను చూడండి. ఒక వైపు ఆంగ్లంలో ఒక అణా అని రాసి రెండో వైపు తెలుగులో 'ఒక అణా' అని రాయడాన్ని గమనించవచ్చు.

బీహార్ కింద నుంచి కన్యా కుమారి వరకు, పడమర కనుమల నుంచి తూర్పు కనుమల వరకు ఉన్న మంది తెలుగును మాట్లాడటాన్ని గమనించటం వల్లనే ఆంగ్లేయులు అలా చేశారు.

అయితే కొంత మంది తెలుగు వారి కన్నా హిందీ వారు ఎక్కువ ఉన్నారు కదా అని అనుకోవచ్చు. కాని ఇక్కడ ఒక మందలను (విషయాన్ని) మనం గుర్తుకు తెచ్చుకోవాలి. గాంధీ గారు రాజకీయాలలోకి వచ్చాక, ఆంగ్లేయులను వెళ్ళమని పిలుపు ఇచ్చాక, వారి నుడిని మాత్రం ఎందుకు ఉంచుకోవాలి అన్న అడక (ప్రశ్న) వచ్చింది. అప్పటికే ఉత్తరాదిలో ఉన్న ఎన్నో నుడులను (బ్రజ భాష, ఖడీబోలి, కన్నౌజి, అవధి, భోజపురి, బుందేలి, బఘేలి, మాళవి, నిమడి, గోండి, కట్లో, భిలి, హర్యాన్వీ, దున్దరి, బంగారు, జాటు, రాజస్థాని, ఛత్తీస్ గరి, మార్వారీ, జైపురి, మైథిలి, బ్రజ భాష, భోజపురి, మేవాడి, హరౌతి, కిషన్గిరి, కుమావని, గర్వాలీ, జోహార్, గోర్ఖాలీ, దోత్యాలి, థారు, బొక్ష, భాబార్, అంగిక, బజ్జిక, ఖడీపాయి, మాగహి, సంతాలి, ముండారి, హో, ఖన, భుమ్జి, కుర్మాలి, ఒరాన్, కోర్వ, పహారియా, నాగపురి, సాద్రి, ఖోర్త లాంటి ముఖ్యమైనవే కాక ఎన్నో ఇతర నుడులను) చంపేసి ఒకే నుడిని తీసుక రావాలని హిందీని పైకి తీసుక వచ్చి అందరి నెత్తిన రుద్దుతున్నారు. ఇప్పటికీ బీహార్ ఉత్తరాన ఉండే ఒక రైతును, దక్షిణాన ఉండే ఒక రైతు దగ్గరకు తీసుకొని వెళ్తే, ఇద్దరూ వేరే నుడి వాడితో మాటాడినట్లు తలపోస్తారు. తల్లి నుడిగ మాటలాడే నుడులను లెక్కేస్తే ఇప్పటికి తెలుగే ముందుంటుంది.

1965 లో దక్షిణాదిన హిందీ వ్యతిరేక ఉద్యమం బాగా ఊపులో ఉన్నపుడు, మరి హిందీకి బదులు ఏ భాషను అనుసంధాన భాషగా ఉంచాలి అన్న చర్చ వచ్చింది. అప్పుడు ఎం. పి. గా ఉన్న అన్నాదురై, పార్లమెంట్‌లో మాట్లాడుతూ 'తెలుగే దేశానికి సరి అయిన అనుసంధాన భాష' అని చెప్పడాన్ని మనం గుర్తించాలి.

4. మన దేశంలో ఇతర భాషల కన్న తెలుగు భాషే పాతది.

చీఫ్ సెక్రటరీగా పని చేసిన ఐ ఎ ఎస్ అధికారి, తమిళుడు అయిన కాశీ పాండ్యన్ ఎంతో పరిశీలించి చెప్పిన మాట ఇది. మద్రాస్ లోని ఆర్కైవ్స్ లో ఎంతోకాలం పని చేసి చాల పరిశోధన చేసిన తమిళుడు, సుబ్రహ్మణ్యం మలయాండి కూడ ఇదే అభిప్రాయాన్ని

వెలిబుచ్చాడు.

ఈ నాలుగు వందల ఏండ్లలో, లోకంలో ఎక్కువ పేరు పొందిన నలుగురిలో ఒక భాషా శాస్త్రజ్ఞుడు అయిన సునీత్ కుమార్ చటర్జీ తెలుగు మాత్రమే భారత దేశంలో అతి పురాతన భాష అని ఎప్పుడో తేల్చి చెప్పాడు. తెలుగు నుడిలోనే చాల పాతవైన రాతి చెక్కింపులు దొరికాయి.

అయినా చాల మందికి తమిళమే పాత నుడి అన్న అభిప్రాయం వుంది. దీనికి సంగ సాహిత్యాన్ని మాత్రమే సాకుగ చూపిస్తారు. ఆ సాహిత్యం మూల ద్రావిడ భాషలో ఉండడాన్ని మనం మర్చిపోతున్నాము. తమిళంలో డిగ్రీ చేసిన చదువరి కూడ ఆ సాహిత్యాన్ని అర్థం చేసుకోలేడు అన్న మందల(విషయం)ను మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి. ఆ సాహిత్యంలో తెలుగు రైతుల వ్యవసాయం, పంటలు, తెలుగు సంస్కురుతి, అలవాట్లు, పాటలే ఉంటాయి. కాకపోతే, సంస్కురుతం మీద మోజుతో మనం సంగ సాహిత్యం మనది కాదన్నాం. తమిళులు తమది అని చెప్పుకొని తద్వార తమదే పాత నుడి అని చెప్పుకొంటున్నారు.

తెలుగు కూడ ద్రావిడ భాషే. కాని మిగిలిన వాటి కన్న ద్రవిడం నుండి తెలుగు ముందు బయటకు వచ్చింది. తదుపరి తమిళం ఇంకా తరువాత మిగిలిన నుడులు బయటకు వచ్చాయి.

తెలుగు రాజులైన శాతవాహనుల నాటికే రోమ్ తో వ్యాపార సంబంధాలు ఉండేవి.

5. తెలుగు అజంత మాటలను కలిగి ఉండటమే కాదు. దాదాపు అన్ని హల్లుల చివర అచ్చు ఉంటుంది.

అజంత మాటల వలన వినడానికి ఇంపుగ ఉంటుందని ఇంతకు మునుపే మనం చూశాం. ఇంకా అదనంగ, తెలుగు మాటలోని ప్రతి హల్లు తరువాత అచ్చు ఉంటుంది అన్నది ఇప్పుడు మనం గమనించాలి. ఇక్కడ కొన్ని తెలుగు మాటలను చూడండి: తల, కలత, ఇటుక, పులుపు, ఎరుపు, చెడు వగైరా; అంటే తెలుగులో ఒక హల్లు తరువాత మరో హల్లు, నడుమ అచ్చు లేకుండ, దాదాపుగ రాదు. ఇప్పుడు ర వత్తుతో కొన్ని హల్లులు వస్తున్నాయి.

కాని తెలుగులో ద్విత్వాక్షరాలు ఉండొచ్చు, సంయుక్తాక్షరాలు మాత్రం ఉండవు. అన్న, అమ్మ, చెల్లి లాంటి మాటల్లో ద్విత్వాక్షరాలు ఉన్నాయి. స్త్రీ, గ్రహం, క్లుప్తత, స్టేషన్, ఖర్చు లాంటి మాటల్లో ఒక హల్లు తరువాత మరో హల్లు కనపడే ధోరణిని గమనించండి. అవి తెలుగు మాటలు కావు మరి.

తెలుగులో మాటలాడుతుండిన ఇద్దరు మనుష్యులను విని రవీంద్ర నాథ టాగోర్

'వారు మాటలాడుతున్నారా, పాడుతున్నారా'అని అన్నాడట. అదీ తెలుగు గొప్పతనం. ప్రతి హల్లుకు తరువాత అచ్చు రావడం వల్లనే ఇలా తెలుగు, వినడానికి, నేల మీద అన్ని నుడుల కన్న బాగుంటుందన్న మాట.

6. తెలుగు రాత (లిపి) అన్ని రాతల కన్న గొప్పది.

తెలుగులో మాత్రమె రాసింది చదువుతారు, చదివింది రాస్తారు. ఏ మాత్రం తెలుగు వాసన లేని ఒక ఎస్కిమో దగ్గరకు మనం పోయి ఓ పది రోజులు పాటుపడి, తెలుగు భాషను నేర్పకుండా తెలుగు రాతను మాత్రమె, నేర్పాము అనుకోండి. ఇక అతనికి ఈనాడు దిన పత్రికను ఇచ్చి చదవమంటే, మీరూ నేనూ చదివినట్టే చదువుతాడు. విషయం తెలియక పోయినా అతను అలా చదవగలగడాన్ని ఇక్కడ మనం గమనించాలి.

మా ఊరిలో ఒక పిల్లవానికి నేను ఆంగ్లం అక్కరాలను నేర్పి, boy అని రాస్తే, బి ఓ వై అని చదువుతాడు గాని బోయ్ అని చదువడు. ఉర్దూ కూడ యురోపియన్ భాషల లాగే ఉంటుంది. బె, అలిఫ్, తే అని రాసి బాత్ అని చదువుతారు. తమిళం పరిస్థితి ఇంకా ఘోరం. దాని రాత సరిగ పెరగలేదు. చ, ఛ, జ, ఝ (చాప, జారు లలో వాడే చ, జ లను కూడ కలుపుకొంటే) లాంటి ఆరు చప్పుళ్ళను చూపడానికి ఒకే అక్కరం ఉంటుంది. అంటే కాంతి అని రాసి ఉన్నా అక్కడి సందర్భాన్ని బట్టి గాంధి అని చదువుకోవలసి ఉంటుంది.

ఈ మందలలో సంస్కురుతం కూడ తెలుగు ముందు దిగదుడుపే. దేవనాగరి రాతలో 'పెడ–పేడ', మెడ–మేడ, లెట్–లేట్, మెట్–మేట్, సెల్–సేల్, టెల్–టేల్, నెల–నేల లాంటి పదాలను వేరుగ రాయలేము. ఆ రాతలో ఎ, ఏ లకు మారుగా ఒకే అక్కరం వుండటం వల్లనే ఇదంతా. అలానే ఒ–ఓ ల మారుగా ఒకే అచ్చరం (రమణుడు– కావ్య కంత గణపతి ముని) ఉంటుంది. అందుకని కోడి–కొడి లను వేరుగ రాయలేము. తొలి–తోలి, తొడ –తోడ, దొర–దోర లను కూడ ఒకే లాగ రాస్తారు. చలి లోని చ పలుకును, జారి లోని జ పలుకును కూడ సంస్కురుతంలో రాయలేము. కల–కళ ల తేడాను కూడ చూపించలేము.

ఏదైన సరిగ వుంటే, సరి గుర్తు (✓)ను పెట్టటం చూస్తాం. అలా తెలుగులో చాల అక్షరాలకు సరి గుర్తు ఉన్నది. క, గ, చ, డ, త, ద, న, ప, మ, య, ర, వ, శ, ష, స, హ,ళ, క్ష అక్కరాలను చూడండి. తలకు తలపాగ ఎంత అందమో, అక్కరాలకు తలకట్టు అంత అందం.

ఈ తలకట్టు ప్రయత్నం కన్నడంలో మాత్రం కొంత జరిగింది. కాని దానిని సగానికి నరికేశారు. తెలుగు అక్కరాలు మాత్రమె గర్వంగ, తల ఎత్తుకొని తలకట్టుతో నిలబడి ఉంటాయి.

7. తెలుగు నేర్చుకొన్నవారే ఇతర నుడులలోను సరిగా మాట్లాడ గలరు.

ఇక్కడ ఓ చిన్నకత: స్వాతంత్రం ఇంకా రాని నాళ్ళల్లో, ఒకసారి గాంధిగారు మధిరకు (ఖమ్మం జిల్లాలో నేను పుట్టిన తాలూక) వచ్చారు. ఆనాడు మధిర మందితో ఆయన మాట్లాడుతున్న బొమ్మ కూడ ఒకటి మా దగ్గర ఉన్నది. ఒక పిల్లవాడు మరొకడిని 'శంకర రావూ' అని పిలవడాన్ని విని ఆయన చాల ముచ్చటపడ్డారు. 'మీ పిల్లలు అంత చక్కగ ఎలా మాట్లాడతారు?' అని అడిగారు. సరే, మన వారు చెప్పారనుకోండి; ' మా పంతుళ్ళు పిల్లలను చంపుక తింటారు. చిన్నప్పటి నుంచే పలకడంలో చాల పట్టుదలగా ఉంటారు. ఒకటవ తరగతిలోనే విష్వక్సేనుడు, ధృతరాష్ట్రుడు లాంటి మాటలను, గోడ కుర్చీ వేయించి మరీ నేర్పుతారు'.

ఇంతకీ అసలు సంగతి: స, శ, ష లను తెలుగు వారు, మాత్రమె సరిగా పలుకుతారు. బెంగాలీలు మూటిని ష లాగే, ఒరియా వారు మూటిని స లాగే, అస్సామీలు మూటిని హ లాగ పలుకుతారు. ఎక్కువ మంది ఉత్తరాది వారు 'స' ను 'స' లాగే పలికినా శ, ష లను మాత్రం ష లాగే పలుకుతారు. శంకర్ ను షంకర్ అని, ప్రదేశ్‌ను ప్రదేష్ అని, శిశిర్ ను షిషిర్ అని పలకడాన్ని మనం చూస్తూనే వుంటాం. తమిళులు శ, ష, స, చ లు నాల్గింటిని స లాగ పలుకుతారు. కన్నడిగులకు పంటి (దంత) చ, జ లు పలుకవు. పంటి చ, జ లను తెలుగు వారు, మరాఠీలు మట్టుకే పలుకగలరు. మరే ఇతర నుడిలో లేనన్ని చప్పుడులను తెలుగు రాతలో రాయగలము. అందుకనే ఏ భాష మాటలనైనా తెలుగు వారు చక్కగా అనగలరు.

8. సంగీతానికి తెలుగే అనువైన నుడి.

ఇంతకు మునుపు మనం చూసినట్లుగ, అచ్చులు ఎక్కువగ వుండటం వల్ల, మాట్లాడినప్పుడు వీనులకు విందుగ ఉండటమే కాక, పాడటానికి కూడ చాల వీలైనది తెలుగు.

మలబారులోని మలప్పురంలో మోహిని అనే మలయాళం అమ్మాయి గాని, మదురై లోని తమిళ మీనాక్షిగాని, మంగళూరులోని కన్నడం అమ్మాయి మాధురిగాని, మంగళగిరి లోని తెలుగు మహాలక్ష్మిగాని 'సంగీతం నేర్చుకొని మొదటి కచేరి (అరంగేట్రం) ఇస్తున్నాను' అని పిలిస్తే వెళ్ళిన వారు ముందుగ త్యాగరాజ స్వామి తెలుగులో రాసిన 'పంచ రత్నాలు' పాడాలి అని కోరుకొంటారు. అలా పాడలేకపోతే 'మరల ఒక ఆరు నెలలు నేర్చుకొని పిలువు అమ్మా' అని వెళ్లి పోతారు. 600 ఏండ్ల నుంచి అంటే అన్నమయ్య, క్షేత్రయ్యల నుంచి సవ్వడి (సంగీతం) అంటే తెలుగే. మీరు చాల లోపలి కర్ణాటకకు వెళ్లి, ద్రిమ్మరి కళాకారుడిని ఒక పాట పాడమంటే తెలుగు పాటను ఎత్తుకొంటాడు. అతనికి తెలుగు రాదు. ఎందుకు అలా పాడుతున్నావు అంటే

'పాట అంటే తెలుగు పాటే కదండీ' అంటాడు అమాయకంగా. తమిళనాడు లోని 90% దేశ ద్రిమ్మరులు (ఆ సంచారులే జానపదాలు పాడుతుంటారు) తెలుగు వారే.

జులై 25, 2002 నాడు రాష్ట్రపతిగ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తన మొదటి ప్రసంగాన్ని 'ఎందరో మహానుభావులు అందరికి వందనములు' అంటూ గొప్ప మాతృభాషా ప్రేమికులు మౌలానా అబ్దుల్ కలాం గారు మొదలెట్టారు. (ఐక్య రాజ్య సమితిలో కూడ తిరుక్కురళ్ లోని కొన్ని మంచి వాక్యాలతో ఆయన మాటలాడటం మొదలెట్టారు.)

ఎక్కువగా హల్లుతో ముగిసే మాటలు ఉంటాయి కాబట్టి, వేరే భాషలలోని మాటలు, పాట పాడటానికి, తెలుగు మాటలలా వీలుగా వుండవు. లండన్ అని పలికాక రాగం తీయడం మొదలు పెడితే ఆ పాటగాడిని పిచ్చాసుపత్రికి తరలిస్తారు. హిందీలో కూడ కల్, తుమ్, ఘర్, హమ్, పర్, బాత్ లాంటి మాటల తరువాత రాగం తీయడం కుదరదు. తమిళంలోనూ రామన్, తమిళ్, నాన్, మురుగన్, సెందిల్ అన్నాక రాగం తీయడం కుదరదు.

9. తెలుగులో మాత్రమే పద్యాలున్నాయి.

ఇలా అని పేరొందిన పాటగాడు, బాల సుబ్రహ్మణ్యం గారు అన్నప్పుడు నేను కూడ మొదట్లో నమ్మలేకపోయాను. పద్యాలు తెలుగుకు మాత్రమే చెందినవి. ఈ మాటలు మీకు అచ్చెరువును కలిగిస్తాయి. హిందీలో, ఆంగ్లంలో కూడ పద్యాలు ఉంటాయి.కదా అని మీరు అడగవచ్చు. కాని ఆ నుడుల్లో పద్యాలు వుండవు అనే నేను అంటాను. మీకు అక్కడ కనిపించే పద్యాలు లాంటివి, నిజంగ వచనాలే. కాకపోతే మాటలను కాస్త అటు ఇటు మారుస్తారు. మనలాగ గణ విభజన ఉండదు. తెలుగులో ఒక రకం పద్యాన్ని, (కందం అనుకోండి) ఎవరు ఎప్పుడు రాసినా, ఏ పాదంలోని ఒక స్థానాన్ని చూసినా, ఎల్లప్పుడు గురువుగా గాని లఘువుగా గాని ఉంటుంది. అంతే గాని ఒక కవి ఒక స్థానంలో లఘువును, మరో కవి అదే స్థానంలో గురువును పెట్టటం జరుగదు. క్లుప్తంగ చెప్పాలంటె తెలుగులో పద్యాలకు గణ విభజన వుంటుంది. ఇంగ్లిష్, హిందీ, జర్మని, చైనీస్ లాంటి భాషలకు అలా ఉండదు. సంస్కురుతంలో గణ విభజన వుంటుంది గాని యతి, ప్రాసలు వుండవు. మిగిలిన అన్ని నుడుల కన్న తెలుగుకు దగ్గరగా కన్నడం వుంటుంది. అందులో కూడ గణ విభజన, ప్రాసలే ఉంటాయి.గాని యతి ఉండదు. సలక్షణంగా గణ విభజన, యతి, ప్రాసలతో తెలుగులో మాత్రమే పద్యాలుంటాయి.

(రాజాజీ ఒకసారి మాట్లాడుతూ తెలుగులోని ఒక మాండలికమే కన్నడం అంటాడు. కన్నడ నుడి మొదటి కవులందరు తెలుగు వారే. పంప, పొన్న, రన్న *(కన్నడ కవిత్రయం)* నుంచి ఇప్పుడు మైసూరు విశ్వ విద్యాలయంలో జానపదుల మీద కన్నడంలో గొప్ప

పరిశోధనలు చేసిన ర వ స సుందరం గారి వరకు తెనుగులు కావడాన్ని మీరు గమనించండి. ఇప్పుడు కూడ కన్నడంలో గొప్ప రచనలు చేస్తున్న వారిలో ఎందరో తెలుగు వారున్నారు.)

అందువల్ల శతకాల ప్రక్రియ తెలుగు నుడి గొప్పతనం. ఒక శతకం అంటే ఎక్కువగ ఒకే ఛందస్సు కలిగిన, ఒకే కవి రాసిన 107 కన్న ఎక్కువ ఉన్నపద్యాల గుంపు అన్నమాట. పైగా ఒకే విషయాన్ని అవి నొక్కి చెపుతుంటాయి. భాస్కర శతకంలో భాస్కరుని గురించే వుంటుంది. కుమారీ శతకంలో ఒక అమ్మాయి పుట్టింట్లో, బడిలో, బయటి ప్రపంచంలో, పెండ్లి అయ్యాక అత్త గారింట్లో పరిస్థితులు ఎలా ఉంటాయి, ఎలా మెలగాలి అన్న విషయాలను ఎత్తి చూపుతారు. వేమన శతకంలో ఇంగిత జ్ఞానం తెలియ జేస్తారు.

శతకాల వల్ల ఒనగూరే లాభాలను ఇంతకు ముందే చూశాం.

10. అష్టావధాన ప్రక్రియ తెలుగుకే సొంతం.

అష్టావధానంలో ఒక కవి ఒకే సారి 8 విషయాలపై చూపు పెడతాడు. అవి ౧. పురాణ పారాయణం ౨. వ్యస్తాక్షరి ౩. ఆశువు ౪. సమస్యాపూరణం ౫. సద్యోవర్ణన ౬ అప్రస్తుత ప్రసంగం ౭. నిషిద్ధాక్షరి ౮. దత్తపది. వీటిలో కొంత మంది కొన్ని మార్పులు చేస్తుంటారు. ఎంత విన్నా కనీసం ఒక్కసారైనా అష్టావధానాన్ని చూస్తే తప్ప ఈ గొప్పతనాన్ని మనం తెలుసుకోలేము. నిషిద్ధాక్షరి ప్రక్రియలో అవధాని ఒక పద్యంలోని ఒక అక్కరాన్ని చెప్పాక, అడగరి సందర్భాన్ని బట్టి తరువాత ఫలాని అక్కరం రాకూడదు అని చెప్తాడు. ఆ అక్కరాన్ని వదిలేసి, వేరే ఒక అక్కరాన్ని తీసుకొని అవధాని పద్యాన్ని సాగించాలి.

అప్రస్తుత ప్రసంగంలో పండితుని తెలివి, సమయస్ఫూర్తి, చెణుకుతనం బైటకు వస్తాయి. 1970ల్లో మేడసాని మోహన్ గారు ఒకసారి ఖమ్మం జిల్లాలోని మధిర తాలూకాకు వచ్చారు. అవధానం చూద్దామని నేను అక్కడకు వెళ్ళాను. అడగరులు తక్కువ అయినందున నన్ను కూడ ఒక అడగరిగా కూర్చోమన్నారు. 'నాకు తెలుగు నుడి గురించి అంతగా తెలియదు' అన్నాను. 'అవసరం లేదు. అవధాని ఏదైనా తీవ్ర ఆలోచనలో ఉన్నప్పుడు ఏదో సందర్భం లేని ఒక ప్రశ్నను అడుగుతూ ఉండు' అన్నారు. ఇక్కడ విషయం ఏమిటంటే, అవధాని అటువంటి వ్యాఖ్యలను కూడ పట్టించుకోకుండా ఉండ కూడదు. పైగ దానిపై కూడ చతురతతో వ్యాఖ్యానించాల్సిందే. ఇక, చాల పెద్ద ఆలోచనలో మేడసాని గారు పడ్డప్పుడు నేను అందుకున్నాను; 'మేడసాని గారి మేడలో సాని ఎప్పుడు దూరిందండి?' ఆయన గారు తడుముకొనకుండా అన్నారు; 'అల్ల అల్లసాని వారి నాటి నుంచీ ఆ అలవాటు అలానే ఉందండి'

ఈ ప్రక్రియ వేరే నుడుల్లో లేదు. సంస్కృతంలో కొంత చేశారు కాని ఆ చేసిన వారు కూడ తెలుగు వారే. తెలుగులో చేసిన తరువాతే అక్కడ చేశారు.

11. పద్య నాటకాల, పద్య రాగాల సంప్రదాయం తెలుగు వారిదే.

మా ఊరు వెళితే, సాయంత్రం అయ్యేసరికి, పోగుఅయినోళ్ళలో మా తమ్ముడొకడు 'అన్నయ్యా, ఒకటి విసరనా' అంటాడు. 'సరే' అంటే భీంపలాస రాగంలోనో, కల్యాణి రాగంలోనో కమ్మగా ఒక పద్యాన్ని పాడతాడు అన్నమాట. వాడికి చదువు కూడ రాదు. కాని వాడు పద్యాన్ని పాడుతుంటే మనం మైమరచి పోవాల్సిందే. అటువంటి వాళ్ళు చాల మంది ఉన్నారు మా ఊళ్ళో.

మా చిన్నతనంలో 10 కిలోమీటర్ల దూరంలో నాటకం ఉన్నా చీకటిలో నడుచుకుంటూ అంత దవ్వు వెళ్ళి, డబ్బులు బెట్టి టికెట్ కొనుక్కొని మరీ చూసేవాళ్ళం. అబ్బూరి, రఘురామయ్య, ఆంజనేయ రాజు, డేవిడ్ లాంటి వారి పద్యరాగాలు తెలుగు తల్లికే సొంతం. ఇతర భాషల్లో పద్యాలే లేవు కాబట్టి ఆ పద్యాల్ని పాడే సంప్రదాయం కూడ వారికి లేదు.

12. తెలుగులో మాత్రమే పద్యాలను, వాక్యాలను ఒకే హల్లు చప్పుడుతో రాయగలరు.

ఈ క్రింది వాక్యాలను చూడండి:

౧. కాకీక కాకీకే కాక కేకీకా? కేకము అంటే నెమలి. 'కాకి ఈక, కాకి ఈకే కాక నెమలి ఈక అవుతుందా' అని దీని తెల్లం(అర్థం). చిన్నప్పుడు నెమలి ఈకలను అపురూపంగా వయ్యల పుటల నడుమ పెట్టుకునే వాళ్ళం.

౨. కాకీక కాకికే కోక కాక కేకికా?

౩. ఇద్దరు నూనె వ్యాపారం చేస్తున్నారు. నానని (తడిసి చెడిపోని) నువ్వులతో నూనె చేస్తే మంచిదని అనుకుంటారు. అందులో ఒకడు మరొకడితో ఇలా అంటున్నాడు:

నానీ! నీ నానని నూనె నీ నూనే. నా నానిన నూనె నా నూనే. నేను నిన్న నీ నానని నూనెను నా నూనని, నా నానిన నూనెను నీ నూనని నేనన్నాని, నీ నాన్న నిన్న నన్నెన్నెన్నన్నా నేనన్నానా నాన్నా? నీ నాన్న నన్ననినా నేను నీ నాన్ననను, నిన్ననను.

ఇలా ఒకే చప్పుడుతో తెలుగులో పద్యాలే రాసిన గొప్ప వారున్నారు.

ఇటువంటి అందాన్ని మరే నుడిలోను మీరు చూడలేరు.

తమిళంలో ఒకే అక్కరంతో రెండు వాక్యాలు రాశారు కాని రెండు వేరు చప్పుళ్ళతో వాటిని పలకాలి.

13. పద్యాల్లో వింతలు

ప్రతి పద్యంలో, కొంతమంది రచయితలు ముందే సూచించినట్లుగా, వారి పేరులోని మొదటి అక్కరం మొదటి పాదంలో ఒక చోట, రెండవ అక్కరం రెండవ పాదంలో ఒక చోట, అలానే మిగిలిన పాదాలలో కూడ మిగిలిన అక్కరాలు వచ్చేట్లు రాస్తారు. వారి ప్రతి పద్యంలోను ఇక అలాగె వుంటుంది. అంటే, ఆ పద్యాన్ని ఫలాన కవి రాశాడని, ఒక డిజైనర్ పద్యంగ మనం చూడవచ్చు.

కొంత మంది ముందే చెప్పిన స్థానాలను బట్టి, ఆ పద్యం ఏ తేదిన రాయబడిందో తెలుసుకోవచ్చు; ఆ స్థానాల్లో తేదీలు వస్తాయి అన్న మాట.

కొన్ని పద్యాలలో ముందే సూచించిన తీరుగా ఒక అక్కరం తరువాత ఒక అక్కరాన్ని (లేక రెండు అక్కరాల్ని) తీసేసి చదివితే వేరే తెల్లం (అర్థం) వచ్చేట్లు, రాశారు. రహస్యాలను చేర వేయడానికి ఈ పద్ధతి పనికి వస్తుంది.

కొన్ని పద్యాలలో పాదాలను వెనుక నుంచి ముందుకు చదివినా అంతే ఉండేట్లు రాశారు. కొంతమంది మొత్తం పద్యాన్ని వెనుక నుంచి ముందుకు చదివినా అదే పద్యం ఉండేట్లు రాశారు. వికటకవి, కలక లాంటి palindromes లాగ, మొత్తం పద్యం గాని లేక మొత్తం పద్యం లోని పాదాలన్నీ గాని ఉంటాయన్నమాట.

ఈ మధ్యన నాకు చింతా రామకృష్ణారావు అనే ఒక గొప్ప నేస్తం దొరికాడు. దాన్ని నా అదృష్టంగా అనుకొంటాను. ఆయన చిత్ర కవిత్వంలో దిట్ట. బంధ కవిత్వంలోనూ అందె వేసిన చేయి. అదీ గాక ఒక పద్యంలోనే 10 పద్యాలు రాయగల మేటి రాతరి. ఒక ఛందోబద్ధమైన సీసంలోనే కొంత ముందు భాగాన్నీ కొంత వెనుక భాగాన్నీ తీసివేస్తే మనకు నడుమ ఒక ఆటవెలది లేక తేటగీతి లేక కందమో మిగిలి ఉంటుందన్నమాట. ఒక సందర్భంలో నేను చింతా గారిని పొగుడుతుంటే, ద్వానా శాస్త్రి గారు నాకొక గొప్ప విషయాన్ని తెలియ జేసారు. 'ఎప్పుడో మన తెలుగు వాడు ఒక పద్యంలో 50 కన్న ఎక్కువ పద్యాలు ఉండేట్లు రాశాడు' అని చెప్పారు. ఇక చిత్ర, బంధ పద్యాల తీరులు కోకొల్లలు.

ఇన్ని చిత్ర విచిత్రాలను వేరే నుడుల్లో ఊహించనైనా ఊహించ లేము.

14. తెలుగు తల్లి మెడలో చతుర్వ్యర్థి కావ్యాల దండలున్నాయి.

రాఘవ పాండవీయము అను ఒక తెలుగు కావ్యాన్ని తీసుకొని ఒక పండితుడు అందులోని ప్రతి పద్యం లేక వచనములోని ప్రతి మాటకు అర్థం చెప్పుతూ రామాయణ కథను వినిపిస్తాడు. అదే పుస్తకాన్ని మరొక పండితుడు తీసుకొని అందులోని ప్రతి పద్యం లేక వచనం లోని ప్రతి మాటకు అర్థం చెప్పుతూ భారత కథను చెప్పేస్తాడు. ఒక వాక్యాన్ని రెండు అర్థాలు వచ్చేట్లు రాయడమే ఇబ్బంది అనుకొంటే ఒక కావ్యాన్ని మొత్తంగా అలా

రాయటం ఎంత గొప్పతనమో చూడండి. అటువంటి కావ్యాన్ని ద్వ్యర్థి కావ్యం అంటారు. తెలుగులో త్ర్యర్థి కావ్యాలు (మూడు అర్థాలు వచ్చే వయ్యలు) కూడ ఉన్నాయి.

ఒకసారి మధిర నుంచి భాగ్యనగరంవరకు కవితాప్రసాద్ గారితో కారులో వచ్చాను. అప్పుడు తెలుగు యొక్క ఈ గొప్పదనం గురించి నేను చెప్పుతుంటే ఆయన అన్నారు, 'తెలుగులో చతుర్వ్యర్థి (నాలుగు అర్థాలు వచ్చే వయ్య) కావ్యాలు కూడ ఉన్నాయి.'

వెంబడే నేను అన్నాను, 'ఉన్నాయి అంటున్నారు కాని ప్రతులు దొరకటం లేదు.'

ఆయన అందుకొని 'అలా ఎవరైనా అంటే నా దగ్గరకు పట్టుకొని రండి. నా దగ్గరుంది. చూపిస్తాను.' ఆ వయ్యను రాసిన కవిని గురించి కూడ కొన్ని వ్యక్తిగతమైన విషయాలను చెప్పి తెలుగులో ఆయనకున్న ఆసక్తిని, పరిజ్ఞానాన్ని చెప్పకనే చెప్పారు.

కనీసం ఒక కథను రెండు అర్థాలు వచ్చేట్లుగా మరో భాషలో ఎవరైన రాశారేమో చూడండి. అలా చూడలేరు. అదీ తెలుగు నుడి గొప్పతనం.

15. క్రీస్తుకు ముందు 2000 ఏండ్ల నాటికే మనిషి తన జీవితంలో వాడటానికి సరిపోనుగా పూర్తిగా పెరిగిన నుడి తెలుగు.

ఇప్పుడు చాల శాస్త్రాలు పెరిగాయి. మనం నాప సన్నాసులం, ఏ మాత్రం స్వాభిమానం లేని వెధవలుగా తయారు అయ్యాం గాబట్టి ఇప్పటి అవసరాలకు సరిపోను మనం తెలుగులో మాటలు పుట్టించుకోలేదు. కాని 3000 ఏండ్ల క్రింది నాటికే కుటుంబపు, సంఘపు అవసరాలకు తగ్గట్లుగా, మరే నుడి కన్న గొప్పగా తెలుగు పెరిగింది.

'నీవు నీ నాన్నకు ఎన్నవ కొడుకువు?' అనే ఈ వాక్యాన్ని హిందీ, ఇంగ్లిష్, సంస్కృతంలలో అని చూడండి. చాల దగ్గరకు వచ్చేట్లు 'What is your serial number in the list of sons maintained by your father?' అని మాత్రమె అనగలరేమో.

మేము, మనము అన్న మాటలకు తేడా ఉందిగదా. మేము ఊరికి వెళ్తున్నాము అన్నా మనం ఊరికి వెళ్తున్నాం అన్నా ఒకే తెల్లం కాదు. మీరు ఈ తేడాను హిందీ, ఇంగ్లిష్, కన్నడ నుడుల్లో పలికించలేరు. అసలు హిందీ, ఆంగ్ల, సంస్కృత నుడుల్లో అన్నకు తమ్ముడుకు తేడా లేదు. ఎల్డర్ బ్రదర్, బడా భాయ్ అనొచ్చుగా అంటే పప్పులో కాలేసినట్లే. అప్పుడు చిన్నన్నను పెద్ద తమ్ముడును ఏమంటారు? వాస్తవ పరిస్థితి ఏమిటంటే ఆ నుడుల్లో ఆ మాటలు లేవు. సంస్కృతంలో అగ్రజుడు అంటారు కాని అది ఒక విడి మాట కాదు. 'ముందు పుట్టిన వాడు' అని తెల్లం. సంస్కృతంలో అన్నకు తమ్ముడుకు

కలిపి కూడ ఒక మాట లేదు. సోదరుడు, సహోదరుడు అని అంటారు కాని అవి విడి మాటలు కావు. తోడ పుట్టిన వాడు అని చెప్పినట్లు లెక్క. తెలుగులో పిన్ని, పెద్దమ్మ (పెద నాన్న పెండ్లం), ఆమ్మ (అమ్మ అక్క) అత్త, మేనత్త, నాన్న అక్కగ ఉండే బాప్ప, ఎక్కడో దూరంగా వుండి చూసే వేలిడిసిన మేనత్త, ఇంకా దూరంగ ఉండే రెండు వేళ్ళు విడిచిన మేనత్తలు అందరినీ కలిపి గుండుగుత్తగ ఆంగ్లంలో ఆంటీ అంటారు. ఇంత చక్కని తెలుగును వదిలేసి ఆంగ్లం వెంబడి పడ్డాం కాబట్టే పిల్లలకు ఇంటి వారిపై సమగ్రమైన హార్దికమైన అనుభూతి కలగడం లేదు. మా మనవడు ఒకనాడు వాకిలి నుంచి వస్తూ 'అంకుల్ వెళ్లి పొయ్యాడు' అంటే ఎవరా అని బయటకు వచ్చి చూస్తె వెళ్లి పోతున్న బిచ్చగాడు కనపడ్డాడు. లోపలకు వచ్చాక 'పనిమనిషి ఆంటీ వచ్చింది' అని అంటున్నాడు వాడు.

వరుస చూడండి: జేజి, తాత, తండ్రి, కొడుకు, మనవడు, ముని మనవడు, అని మనవడు! ఈ చుట్టరికాల గురించి ఒక సారి మాట్లాడుతుంటే, మిత్రులు నరసయ్య గారు 'తెలుగులో చుట్టరికాలను తెలియజేయడానికి ౧౽౦ కి పైగా మాటలు ఉన్నాయి. మరే నుడిలో అన్ని లేవు పో.' అని అన్నారు.

హిందీలో నిన్న, రేపులను కూడ కల్ అనే అంటారు. సంస్కురుతంలో ఒకటి తక్కువ వంద అంటారు, తొంబై తొమ్మిది అని అనటం కుదరదు. అంకెలను వంకర టింకరగా పలుకుతారు. పదిహేను లక్షల తొంబై ఎనిమిది వేల మూడు వందల ఇరవై నాలుగు అని సంస్కురుతంలో అనగలరేమో చూడండి.

తమిళంలో తొంబైని తొన్నూర్ అని, తొమ్మిది వందలను తొలాయిరం అని అంటారు. కన్నడ, మలయాళాల్లోనూ అంతే.

ఎంగిలి, కల్లాపి, ముగ్గు, విస్తరి, నిండు చూలాలు, బాలింత లాంటి ఎంత గొప్ప మాటలు తెలుగులో ఉన్నాయో చూడండి. మొగ్గ, పువ్వు, పిందె, కాయ, మాగాయ, దోర కాయ, పండులకు సరియైన మాటలను ఆంగ్లంలో గాని, సంస్కురుతంలో గాని అని చూడటానికి ప్రయత్నించి చూస్తే, మీకు తెలుగు గొప్పదనం తెలుస్తుంది.

వ్యవధిని తెలియ జేయడానికి, వేళను తెలియ జేయడానికి సంస్కురుతంలో 'సమయం' ఆంగ్లం లో 'టైం' అంటారు. అక్కడ నుంచి ఇక్కడకు రావడానికి ఎంత 'సమయం' / 'టైం' పట్టింది అని అంటాం. అలాగె, ఇప్పుడు 'సమయం' / 'టైం' ఎంత అయింది అని అంటాం. భావాలు వేరే అయినా, ఒకే మాటను వాడటాన్ని గమనించండి. అదే తెలుగులో అయితే, మొదటి సందర్భంలో " ఎంత సేపు / తడవు అయింది" అని అంటాం. రెండో సందర్భంలో " ఎంత వేళ అయింది" అని అంటాం. అదీ తెలుగు నుడి గొప్పదనం.

16. ఒక చిన్న మాటకట్టు లేక నుడుగు (వాక్యం) తోనే ఎంతో విషయాన్ని తెలియజేయవచ్చు.

ఒక కళాశాలలో ఒకమ్మాయి ఒక అబ్బాయితో చాల చనువుగ తిరగడాన్ని చూసిన ప్రధానోపాధ్యాయుడు ఆ అమ్మాయిని తన గదికి ఎవరూ లేనప్పుడు పిలిచి అమ్మాయి నోరు తెరవనీయకుండా 10 నిమిషాలు పరుషంగా తిట్టినంత పని చేసాడు. అంతా విని ఆ అమ్మాయి కొంచెం ఎరుపెక్కిన బుగ్గలతో క్రిందికి చూసుకొంటూ ఒక కాలి ముని వేళ్ళను నేలపై పారాడిస్తూ 'వరస అవుతారు' అన్నది.

'అరే. నోరు మూసుకో. ఆయన నాకు బావ అవుతాడు. ఆయనతో కాక మరి ఎవరితో నేను ఇక్కడ మాట్లాడుతూ తిరగగలను? ఈ కళాశాలలో పిల్లలు ఎవరూ మమ్ములను తప్పు అనుకోరు. తెలిసీ తెలియక నువ్వు ఏదో వాగుతున్నావు. నువ్వు పోయి మా అమ్మ నాన్నలకు కాని మా కుటుంబీకులకు కాని చెప్పినా వారేమి పట్టించుకోరు. నాకు ఇష్టమైతే ఆయనను పెండ్లి కూడ చేసుకుంటాను. మా ఇంటి వారందరు కూడ సంతోష పడతారు. మా నాన్న వచ్చి నిన్ను ఆ పెండ్లికి కూడ పిలుస్తారు. ఇక నోరు మూసుకుని పడి వుండు. వెళ్లొస్తాను.'

'వరస అవుతారు' అనే రెండు మాటలతోనే ఆ అమ్మాయి ఇదంతా చెప్పేసింది.

17. మాటల సరదా మూటలు

రైళ్ళలో ఈ నడుమ వాడు వీడు (వాడుము, వీడుము అంటే ఒక సారి వాడిన తరువాత పారవేయండి) గ్లాసులను ఇస్తున్నారు.

ఒక సారి నేను రిక్షాను పిల్చి, 'రైల్వే స్టేషన్ కు వెళ్ళాలి ఎంతయ్యా' అంటే 'వంద' అన్నాడు. మా అమ్మాయి వస్తుంది తీసుకొని ఇంటికి కూడ తిరిగి రావాలి, పోను రాను ఎంత అంటే రెండొందలు అన్నాడు. సరే చాల ఎక్కువ చెప్తున్నాడు, మరో ఏర్పాటు చేసుకొందాము అనుకొని 'ఎక్కువ చెప్తున్నావు. పోను, రాను.' (అంటే ఇక నేను వెళ్ళను, రాను అని నా ఉద్దేశం) అని అన్నాను. 'పోను రాను' అని అంటే మాత్రం మీరు 200 ఇవ్వాల్సిందే' అంటూ వాడు వదలడే!

మొల్లను రామలింగడు 'కుక్కనిస్తావా? పెట్టనిస్తావా?' అంటే ఆ మహా తల్లి 'నీకమ్మనురా లింగా' అన్నది. కిళ్ళీ కొట్లో అరటి గెల మీద చెయ్యి వేసి కిళ్ళీ కట్టమంటే కొట్టు వాడు 'పండ్లు రాలతాయి జాగ్రత్త' అంటే సున్నం పట్టిస్తున్న కొట్టు వాడ్ని 'దవడ వాస్తుంది జాగ్రత్త' అంటాడు వాడకందారు. ఇద్దరు పెద్ద రచయితల మధ్య జరిగిన 'మీరుమాల'; 'ఔరా మాదిగ' అనే సంభాషణను కూడ, మీరు వినే ఉంటారు. రామలింగడి 'ఊతునా' కూడ అందరికి తెలిసిందే.

ఇటువంటి సరదా మాటల మూటలు తెలుగులో అనంతంగా ఉంటాయి.

18. తెలుగులో మాత్రమె ప్రశ్నోత్తరాలంకారం విరివిగా ఉన్నది.

ఒక వాక్యాన్ని రాసి చివర ప్రశ్నగుర్తును (?) వాడితే అది ఒక అడక (ప్రశ్న) కు గుర్తు. చివరి అడక గుర్తును తీసేసి చుక్క (full stop sign) గుర్తును పెడితే, ఇలా వచ్చిన వాక్యం మొదటి వాక్యానికి జవాబుగా వుంటే, ఆ ప్రక్రియను ప్రశ్నోత్తరాలంకారం అంటారు.

పంతులు గారు ప్రశ్నాపత్రంలో 'రాముని భార్య పేరేమి?' అని అడిగారు. అమ్మాయి 'రాముని భార్య పేరు మండోదరి' అని రాసింది. తండ్రికి కోపం వచ్చి కొట్టినంత పని జేసి 'ఇదేనా సమాధానం?' అన్నాడు. ఆ అమ్మాయి నెమ్మదిగా లేచి నిలబడి 'ఇదే నా సమాధానం.' అన్నది.

ఎద్దీశ్వరునకు వాహనము.

ఏది ఈశ్వరునకు వాహనము? ఎద్దు ఈశ్వరునకు వాహనము. ఈ రెండు వాక్యాలను పై వాక్యం చెపుతుండటాన్ని చూడండి.

పాల రంగు తెలుపు.

నేను ఇంజనీర్‌గా పనిచేసే రోజుల్లో మార్చ్ ౩౦ ఒక సారి ఆదివారంగ వచ్చింది. మార్చ్ 31 లోగ బిల్ పాస్ చేసి చెక్ రాయకపోతే తరువాత ౬ నెలల దాక కాంట్రాక్టర్ కు డబ్బులు రావు. ఒక కాంట్రాక్టర్ ఫోన్ చేసి 'ఆదివారం ఆఫీస్‌కు వస్తారా?' అని అడిగాడు. నేను అన్నాను; 'ఆదివారం ఆఫీస్‌కు వస్తా. రా'.

'అవినీతి మేతకా? పథకాలు?' ప్రతిపక్ష నాయకుడు అడిగాడు. ఏం జేసుకొంటావో చేసుకో పో అంటూ ముఖ్య మంత్రి అన్నాడు 'అవినీతి మేతకాపథకాలు.'

'రానా వెంట?' అని కూతురు అడిగితే తండ్రి 'రా. నా వెంట' అన్నాడు.

'ఇల్లెందులో ఉన్నది?' అంటే 'ఇల్లెందులో ఉన్నది.' ఇల్లు ఎక్కడ ఉన్నది అని అడిగితే, ఇల్లెందు అనే ఊరిలో ఉన్నదని జవాబు.

'కొవ్వును కరగదీస్తుందా వెల్లుల్లి?'

యాడికి ? అని ఒక కండక్టర్ అడిగాడు బాటసారిని. 'యాడికి.' అన్నాడా బాటసారి. అనంతపురం జిల్లాలో యాడికి అని ఒక ఊరు ఉంది.

తండ్రి తన పిల్లవాడికి చదువు వద్దంటూ 'అక్షరాలేల? క్షవరాలు' చెప్పుతాడు. పంతులు గారు నొచ్చుకొని, 'అక్షరాలే లక్ష వరాలు.' అనంటాడు.

సంస్కృతంలో కూడ ప్రశ్నోత్తరాలంకారాలు ఉన్నాయి. కాని 'క' తో పలికే ప్రశ్నార్థక పదాలతో మాత్రమె అవి ఉంటాయి. తెలుగులో లాగ ఇంత విస్తృతంగా ఇన్ని రకాల మాటలతో ఉండవు. ఆంగ్ల, హిందీ భాషల్లో అసలిలా వీలు అవుతుందేమో చూడండి. వాటిల్లో ప్రశ్న రావాలంటే ప్రశ్నను స్ఫురింపచేసే మాటలు (why, కిధర్ లాంటివి) రావాలిసిందే. ఇక అవి వచ్చాక ఆ వాక్యం ఒక జవాబుగ స్ఫురించడం కుదరదు.

19. ఉగ్రవాదానికి ఎడంగా తెలుగు

చాల దేశాల్లో ఒంటికి మందు పాతరలు కట్టుకొని పోయి కొందరు తనకు నచ్చని వారి నడుమ, తమను తాము పేల్చి వేసుకోవడాన్ని చూస్తున్నాం. చిన్నప్పటి నుంచి తెలుగులో చదువు నేర్చుకొన్నవారు బౌద్ధులైనా, హిందువులైనా, మహమ్మదీయులైనా, క్రైస్తవులైనా సరే, అలాంటి దౌర్జన్యాలకు పాల్పడలేరు.

దానికి రెండు కారణాలు:

౧. తెలుగు నుడిలో ప్రేమ, హాస్యం, భక్తి, ఎగతాళి, శృంగారం, శ్లేషార్థాలు, వేదాంతం, కరుణ, వెటకారం, ఎత్తిపొడుపు, పుల్లవిరుపు లాంటి రసాలను చాల గొప్పగా పండించవచ్చు. కాని పక్కనున్న వారిపై పగతో చేసే పెత్తనం, దౌర్జన్యం లాంటి అక్రుత్యాలను తెలుగు తల్లి సహించదు. గెట్ అవుట్, చల్ అన్న మాటలలో పలికించ గలిగిన దౌర్జన్యాన్ని, ఎదుటి వాడిపై కలిగించే నీచత్వాన్ని 'వెళ్ళు' అనే తెలుగు మాట పుట్టించ లేదు. ఏదో, ఎదుటివాడిని వెళ్ళడానికి కూడ బ్రతిమిలాడినట్లు వుంటుంది తప్ప వాడిని కించ పరిచే పెత్తందారీతనం కనిపించదు.

౨. కులాల, మతాల పేరుతో ఎదుటి వారిని చంపటానికి గాను తాను ఆత్మహత్య చేసుకోటానికి తెలుగు సమాజంలోని సంస్కృతి ఒప్పుకోదు. ఒక కులానికి సంబంధించి ఒకటి రెండు కుటుంబాలు మాత్రమె ఒక ఊరిలో నిర్భయంగా వుండటం తెలుగు నాట అన్ని చోట్ల చూస్తుంటాం. మా వూరిలోని ఒకే ఒక తురక (టర్కీ నుంచి వచ్చిన వారిని తురకలు అంటారు. మరి మా లాల్ మొహమ్మద్ ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు!) కుటుంబం కూడ నిశ్చింతగా వుంటుంది. ఏ సభ్య సమాజంలోనైన అలానే వుండాలి మరి.

తెలుగులో చదువుకొన్న వాడు, తనకు తెలియని వారిని చంపడానికి, వారి నడుమ, తనను తాను పేల్చేసుకోలేడు అని నేను పొగరుతో సూత్రీకరిస్తున్నాను.

20. అదే వాక్యాన్ని వ్యతిరేకార్థం వచ్చేలా పలుక వచ్చు.

తెలుగులో ఒక వాక్యాన్ని ఒక చోట కొంచెం సాగదీసి, మరొక చోట కొంచెం క్లుప్తంగా అనటం ద్వారా పూర్తిగ వ్యతిరేకార్థం వస్తుంది. మీ ఇంట్లో అమ్మాయి పెండ్లి అవుతుంటే నేను అనుకోకుండ వస్తే, మీరు 'దయ చేయండి' అని సాదరంగా పిలువ వచ్చు. ఒక మనిషిని ఇక సహించే పరిస్థితి లేనపుడు, 'దయ చేయండి' అనే అదే వాక్యాన్ని కొంచెం మాత్రమె మార్పుగా పలికితె, 'ఇక మీరు వెళ్ళండి' అని అర్థమే.

న్యాయమూర్తి గారు ఒక సాక్షిని ప్రమాణం చేయమన్నారు. 'అంతా నిజమే చెపుతాను. అబద్ధం చెప్పను.' అని అతను అనాలి. ఒక సాక్షి ఆ రెండు వాక్యాలలోని చివరి అక్షరమైన 'ను' ను ఒక రకంగా కొంచం సాగదీయడం ద్వారా వ్యతిరేకార్థాన్ని పలికించాడు.

వాడు ఆలోచించాడు; వాడు ఆలోచించడు. ఈ రెండు వాక్యాలు ఒక దానికొకటి వ్యతిరేకంగా ఉన్నా అవి ఎంత చిన్న మార్పుతో ఆ గుణాన్ని సంతరించుకున్నాయో చూడండి.

21. తెలుగులో ఒక క్రియా వాచక పదం నుంచి కొన్ని పదుల వేల మాటలను పుట్టించ వచ్చు.

క్రియా వాచక పదాల నుంచే కొత్త మాటలు ఎక్కువగ పుడతాయి. వేరే భాషల్లో అలా పుట్టటం పరిమితంగా వుటుంది. తెలుగులో దాదాపు అటువంటి పరిమితి ఏదీ లేదు.

ఒక 'చేయు' అనే క్రియావాచకాన్ని తీసుకొంటే ఎలా మాటలు వస్తాయో చూడండి; చేయుచున్నాను, చేయుచున్నది, చేశాను, చేసినది, చేస్తాను, చేస్తుంది, చేయను, చేయటం లేదు, చేయ లేదు, చేస్తూ ఉంటిని, చేస్తూ ఉంటాను, చేతలు, చేతబడి, చేతి పని, చేనేతలు, చేయబడుతున్నది, చేయబడుతూ ఉంటుంది, చేయబడుతూ ఉండింది, చేయలేను, చేయ కూడదు, చేతనైన, చేత కావడం, చేయడానికి, చేయబడడానికి, చేయకుండాఉండడానికి, చేయబడకుండాఉండడానికి, చేయబడుతూ ఉండలేదు, చేసీ చేయక, చేసి, చేసిన, చేయబడుతూఉండబోవు, చేయబడుతూఉండబోవని, చేయబడుతూ ఉండబడని. ఇలా కొన్ని వేలకు వేలు కాదు, పదుల వేల పదాలు ఒక మాట నుంచే తెలుగులో పుడతాయి.

అదే ఆంగ్లంలో అయితే do అనే మాట నుంచి doing, does, done, did, deed తో ఆగిపోవాలి.

22. తెలుగులో ఉన్నన్ని వ్యతిరేకార్థక పదాలు (నిర్మాణాలు)

మరే నుడి లోను లేవని తెలుగు తల్లి ఊడిగంలో తరించి పోతున్న షేక్ బడే సాహెబ్ గారు ప్రతిపాదించారు. ఆయన గారు, తెలుగు చదువ లేని పిల్లలకు, త్వరగా రాసేట్లు తెలుగును నేర్పడం ఎలా, అని పరిశోధన చేసి వారి తల్లిగారి పేరు మీదుగ 'మాఁ హసన్ బీ తెలుగు వాచకము' అని ఒక పుస్తకాన్ని రాసి తెలుగు రాయడం రాని అమెరిక తెలుగు పిల్లలకు పది రోజుల్లో రాయడం నేర్పేస్తున్నారు.

మనం 'అమ్మాయి ఉన్నదా?' అని ఒకరిని అడిగాం. 'అమ్మాయి లేదు' అని అంటాడు. హిందీలో 'లడకీ నహీ హై' అంటాడు.

మనం ఒక మనిషిని చూసి అమ్మాయా అబ్బాయా అని అనుమానం వచ్చి 'అమ్మాయేనా' అని అడుగుతాం. 'అమ్మాయి కాదు' అని అంటాడు. హిందీలో 'లడకీ నహీ హై' అనే అంటాడు. అంటే అమ్మాయి లేదు అనటానికీ, అమ్మాయి కాదు అనటానికీ 'లడకీ నహీ హై' అనే అంటారు.

'కూడు కావాలా' అని అడిగితే 'కూడు వద్దు' అని అంటాడు. హిందీలో 'ఖానా నహీ చాహియే' అని అంటాడు. లేదు, కాదు, వద్దు లకు అన్నిటికీ కలిపి నహీ మాత్రమె ఉన్నది. అలానే రాదు, కూడదు లకు కూడ 'నహీ' నే వాడతారు.

పైగా ఈ మాటలను తెలుగులో రెండు రకాలగా వాడటాన్ని చూడండి. చిల్లర లేదు, చేయ లేదు అనే రెండు వాక్యాలలో లేదు రెండు రకాలగా వాడబడినది. తమిళం రాదు, నాకు రాదు లలో కూడ రాదు రెండు రకాలగ వాడబడినది. అన్నం వద్దు, చేయ వద్దు లలో వద్దు కూడ అలాగే. 'అది మంచి పని కాదు, అలా కాదు' లలో 'కాదు' కూడ అలాగే రెండు అర్థాలలో వాడబడింది.

ఇవి గాక ఇంకా వ్యతిరేకార్థాలను ఇచ్చే ఎన్ని మాటకట్టులు తెలుగులో ఉన్నాయో చూడండి; రాను, చేయ కూడదు, చేయదు, చేయమి(చేయకపోవడం), చేయకు, చేయము, చేయబడక... ఇలా లెక్కకు మిక్కిలిగా.

23. తెలుగులో ఉన్నన్ని బూతు మాటలు మరే నుడి లోను లేవు.

ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దుకు బాగ దూరంగ ఉన్న ధార్వాడలో (కర్నాటక) మా అమ్మాయి చదివే రోజుల్లో నేనొకసారి అక్కడకు వెళ్ళాను. పగలు రోడ్ మీదకు వచ్చి అటూ ఇటూ చూస్తుంటిని. ఇద్దరు మనుష్యులు ఉన్నట్లుండి పెద్దగా అరుసుకోవడం మొదలెట్టారు. కన్నడం నాకు రాదు కాని వాళ్ళు తిట్టుకుంటున్నారు అని తెలిసి పోయింది. రెండు మూడు నిముషాల తర్వాత తెలుగులో తిట్టుకోవడం మొదలెట్టారు.

ఇక్కడ ముందుగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. కన్నడిగులు చాల మంచి వారు. మర్యాదస్తులు. కొత్త వారిని ఆదరిస్తారు. ఏ రాష్ట్రం నుంచి వచ్చిన వారైనా ఆ రాష్ట్రంలో ఉంటే సొంత రాష్ట్రంలో ఉన్నట్లే అనుకొంటారు.

నేను నెమ్మదిగ వారి దగ్గరకు వెళ్లి, 'మీకు తెలుగు వచ్చా?' అని అడిగాను.

'తెలియదు'. (గొత్తిల్ల)

'మరి తెలుగులో ఎలా తిట్టుకొంటున్నారు?'

'మాది చాల మంచి భాష. మర్యాదస్తుల భాష. ఎదుటి వారిని పరుషంగా మాటలనటం కన్నడంలో కుదరదు. బూతు మాటలు చాల తక్కువ ఉంటాయి. మేము తిట్టుకోవాలనుకుంటే రెండు మూడు నిముషాలలోనే తిట్టు మాటలు అయిపోతాయి. అందుకనే తరువాత తెలుగులో తిట్టుకోవడం మొదలెట్టాం. ఇక, ఒక పూట అయిపోయిందాక తిట్టిన తిట్టు తిట్టుకోకుండ మేము తిట్టుకోవచ్చు'

నీ మొదలార, నీ పుటమార, నీ జిమ్మడ, తిత్తి దీస్త, తస్సదియ్య, ముండ మొయ్య, నీ యేరు గూల, లాంటి మొదటి, రెండు తరగతులై పోయాక పై తరగతి మాటలు మొదలైతే ఇక వడి అందుకుంటుంది.

మామూలుగ ఇతర నుడుల్లో మనం బూతు అనుకొనే పని, లేక అవయవాన్ని తెలియ జేయడానికి, ఒక మాట ఉంటుంది, కొన్నిటికి ఉండదు కూడ. తెలుగులో రెండు మూడు మాటలకు తక్కువ గాకుండా ఉంటాయి, మరి.

24. ఆంధ్రభూమి దిన పత్రికలో 'నుడి' పేరిట వచ్చిన ఆదివారం పుటలో 'తెలుగు సొగసులు' పేరిట సుధామ గారు 12 తెలుగు గొప్పదనాలను రాశారు. చెప్పిందే చెప్పడం అవుతుందని వాటిని వదిలేసాను. కావాలనుకున్న వారు నాకు తెలియజేస్తే, నేను ఆ వ్యాసాలను పంపగలను.

25. అమ్మ అన్న మాట తెలుగు మాటే.

చిన్న పిల్లలు నేర్వడానికి, పలకటానికి తేలికైన మాటగానే కాకుండా ఒక కమ్మని పదంగా, గుండె లోతుల్లోంచి అనుభూతి కలిగించడానికి తగిన మాటగా ఇప్పుడు పొరుగు వారు కూడ అమ్మను (అమ్మ అనే మాటను) తీసుకున్నారు. సంస్కృతంలో అమ్మ ను మాత (మాత్రు) గాను, ఇంగ్లిష్ లో మదర్ గాను, తమిళం మరియు కన్నడాల్లో తాయ్ గాను పలుకుతారు. అమ్మ అన్న కమ్మని పదం మాత్రం తెలుగు కుదుళ్ళ లోనుంచి వచ్చిందే.

26. ఆడవారికి తెలుగు నుడి చాల గొప్ప గౌరవాన్నిచ్చింది.

ఇంతకు ముందే మనం చూశాం: **అసలైన తెలుగు సారస్వతంలో ఆడవారిని చాల గొప్పగ చూశారు, గౌరవించారు. నిజానికి దేవతలంటే ఆడవారే.** పోలేరమ్మ, మాంచాలమ్మ, మైసమ్మ, మరిడెమ్మ, తిరపతమ్మ, మావుళ్ళమ్మ, మచేనమ్మ, సమ్మక్క, ఎల్లమ్మ, గంగానమ్మ, మద్దిరావమ్మ, జోగులమ్మ, సారక్క, అంకమ్మ, తలుపులమ్మ, సోమాలమ్మ, మోద కొండమ్మ, పోచమ్మ, జంకారి, ముకమ, నూకాలమ్మ, మాచారమ్మ, మారమ్మ, సుంకులమ్మ, ముత్యాలమ్మ, ఉప్పలమ్మ, ఎల్లారమ్మ, గంగానమ్మ, మెరిటాలమ్మ, నాంచారమ్మ, ఊర్లమ్మ, పెద్దమ్మ, బాలమ్మ, పైడితల్లి, పెద్దింట్లమ్మ – ఇలా ఏ వేలుపును చూసినా అంతే. ఒక మగ దేవత పేరు చెప్పండి! తెలుగు సంస్కురుతిలో మగవాడు వేలుపుగ ఉండటాన్నే ఊహించకూడదు. మహా అయితే చేత తాళ్ళను పట్టుకొని, చిన్న లాగు మాత్రమే తొడుక్కొని, వీపు మీద బాదుకొంటు వేలుపుకు కాపలా ఉండే 'పోత రాజు' స్థాయి వరకు మాత్రమె మగ వారికి చోటు ఇచ్చారు.

క్రీ. పూ. 2300 నాటి, తెలుగు సంస్కురుతి చాల పై స్థాయికి చేరిన హరప్పా నాగరికత కాలంలో దేవత పేరు 'అమ్మ తల్లి'. తొలి వేద నాగరికత నాటికి కూడ గొడ్లను పెంచడం వృత్తి అయితే, సింధు నాగరికతలో సాగు పెద్ద వృత్తిగ ఉండటాన్ని చూడండి. అప్పటికే వారు పశ్చిమాసియా, ఈజిప్ట్ లతో బేరాలు చేసేవారు.

తెలుగువారు తిరిగిన ప్రాంతంలో, అంటే వింధ్య కొండల నుంచి కన్యా కుమారి వరకు మరియు తూర్పు తీరం నుంచి పడమటి తీరం వరకు, స్త్రీ స్వామ్యమే ఉండేదని తిరుగు లేని మచ్చులతో డా. విజయ భారతి గారు రుజువు జేశారు. గౌతమీపుత్ర శాతకర్ణి అన్న పేరులో తల్లి పేరును పరికించండి. ఈ నేలలోకి సంస్కురుత ప్రభావం వచ్చినాకనే పిత్రుస్వామ్య వ్యవస్థ వచ్చినదని వారు తేల్చేశారు. అర్జునిని కాలంలో ప్రమీల రాజ్యమేలేదని తెలిసినదే.

తెలుగుపైన సంస్కురుతం పెత్తనం వచ్చాక మగ దేవతలు కూడ తెలుగు లోకి వచ్చారు. అయినా మొదట్లో తమ పిల్లలకు దేవతల పేర్లు పెట్టుకొనేప్పుడు తెలుగు వారు స్త్రీకే ప్రాధాన్యతను ఇచ్చారు. ఇందుకు సీతారామయ్య, పార్వతీశ్వర రావు, జానకి రామయ్య, లక్ష్మీనారాయణ, గౌరీ శంకర్ లాంటి పేరులను గమనించండి. ఆంగ్లం మరియు అరబిక్ భాషల పరిచయం కూడ కలిగాక మాత్రం వేలుపుల్లో మగ వారి పెత్తనం తిరుగు లేకుండ అయినది.

తెలుగు జానపదులు మాత్రం తమకు తోచిన రీతిలో వేలుపుగ ఆడువారినే తిరిగి తీసుక రావటానికి తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నడుమ కూడ, కృష్ణ జిల్లా లోని పెనుగంచిపోలులో ఒక మంచి మనిషి 'తిరుపతమ్మ' చనిపోతే ఆమె పేరు

మీద ఒక గుడి కట్టి తిరుపతమ్మ తల్లి మీద తమదైన తెలుగులో పాటలు కట్టి పాడుతుంటే ఓర్చుకోలేని తెలుగు ద్రోహులు ఆమెను పార్వతి స్వరూపమని, (అంటే ఆమె కన్న గొప్ప వాడైన శంకరుడు ఉన్నాడని చెప్పక చెప్పే ప్రయత్నం) తిరుపతాంబ అని (తెలుగు పేరు, తిరుపతమ్మ ను కించపరిచే పని), ప్రచారం చేస్తున్నారు. ఆమె భర్తగ గోపయ్య పేరును తీసేసి శంకరుడే అన్నంతగ విషయాన్ని మార్చేశారు. జానపదుల పాటలకు మారుగ ఆమెపై దండకాలు, సంస్కృత మాటలతో నిండిన పాటలను ముందుకు తెస్తున్నారు. తెలుగు మాట గిట్టని వారు పైడమ్మను పైడిమాంబ అని పిలుస్తున్నారు.

లింగాలపాటి లక్ష్మమ్మ పైన సినిమా కూడ వచ్చింది. ఆమెను జానపదులు వేలుపుగ కొలుస్తున్నారు.

27. తెలుగులో ఉన్నన్ని క్రియా పదాలు ఎక్కడా లేవు.

ఇంతకు ముందే చెప్పుకొన్నాము క్రియా పదాల నుంచే కొత్త మాటలు ఎక్కువగా వస్తాయని. మారేమండ గారొక్కరే ౧౭౦౦ కు పైగ తెలుగు క్రియా పదాలను సేకరించారు. తమిళంలో 8౦౦ చిల్లర క్రియలున్నాయి. ఇంగ్లిష్ లో ౧౪౦౦కు పైగ వుంటే సంస్కృతంలో ౧౭౦౦కు పైగా ఉన్నాయి.

28. తెలుగులో చదువుకున్నవారు మంచి నాయకులౌతారు.

రాజు ఎంత నిర్దాక్షిణ్యంగా, కపటంగా ఉండాలో చాణుక్యుడు సంస్కృతంలో అంటాడు. అసలు అవినీతి అనేది ప్రభుత్వ ఉద్యోగుల్లో తప్పక ఉంటుందని, దానిని రాజకీయ వ్యవస్థలో ఒక విడదీయరాని భాగమని ఆ రోజుల్లోనే సూత్రీకరించాడు. పాశ్చాత్య ఆలోచనా విధానంలో కూడ అదే ధోరణి ఉంది. ఆంగ్లంలో 'ప్రిన్స్' అనే పుస్తకంలో మాకియవెలి (దీనిని ఈయన అసలు ఇటాలియన్ నుడిలో రాశాడు.) రాజు ఎంత మోసపూరితంగ ఉండాలో, ఎన్ని కుట్రలు చేయాలో వివరించాడు. సాధారణంగా మనం రాజు ఎలా ఉండకూడదు అని అనుకుంటామో అలానే ఉండాలని నిర్దేశించాడు.

కాని తెలుగులో అటువంటి పెడ ధోరణులు కనపడవు. సరిగదా, మంచి రాజు ఎలా ఉండాలో ఎన్నోసార్లు ఎంతోమంది చాల వివరంగ చెప్పారు. కాకతీయ చక్రవర్తి మొదటి ప్రతాప రుద్రుని 'నీతి సారం', సింగన 'నీతి తారావళి', భద్రభూపాలుని 'నీతి సార ముక్తావళి', అప్పన మంత్రి 'చారు చర్య', సివదేవయ్య 'పురుషార్థ సారం', క్షేమేంద్రుని 'ముద్రామాత్యం', లాంటి తెలుగు పుస్తకాల్లో రాజు ఎలా న్యాయ పరిపాలన చేయాలో చాల వివరంగ చెప్పారు. రాజు, ప్రజలు ఇద్దరు చెడు పనులు చేయకుండ, చెడి పోకుండ ఉండాలని చెప్పే సంస్కృతి మనది. బద్దెన పద్యాన్ని చూడండి:

మండలము సెడిన బతి సెడు,
మండలమును బతియు జెడ్డ మాత్రెనె చెడు,న

మ్మండలము బతియు గావడి
కుండలవలె నుండవలయు గొమరుగ భీమా.

శివ దేవయ్య ప్రజల బాగోగులను ఎలా చూసుకోవాలో చెప్పిన పద్ధతిని చూడండి;

గురులను కులవృద్ధుల భూ
సురుల ననాధులను బుధుల జుట్టంబుల నా
తరులను దీనుల గరుణ
పరుడై రక్షింప వలయు బార్థివు డర్థిన్.

29. తెలుగులో వున్నన్ని మాటలు మరే భాషలో లేవు.

అందరు ఇంగ్లిష్ లో ఉన్నన్ని మాటలు మరే నుడిలో లేవని అంటారు. అవి పది లక్షలకు పైగా ఉన్నాయి. తరువాత ౯౦,౦౦౦ మాటలతో ఫ్రెంచ్ నుడి రెండో వరుసలో వుంటుంది. ఇదంతా పాశ్చాత్యుల దృక్పథమే. తెలుగులో రెండున్నర లక్షలకు పైగ పదాలున్నాయని రామ మనోహర్ లోహియా చెప్పారు.

తెలుగులో ఎక్కువ మాటలు ఉండటానికి ఒక కారణముంది. తెలుగు చాల ఎక్కువ ప్రాంతంలో వ్యాపించి ఉంది. ఎప్పుడూ ఒకే రాజ్యంగా లేదు. అందుకని వేరు ప్రాంతాలలో ఉన్న వారు ఒకే విషయాన్ని వేరు మాటలలో చెప్పుతారు. కాబట్టి మరే భాషలో ఉండటానికి వీలు లేనన్ని మాటలు తెలుగులో ఉన్నాయి.

అదే సమయంలో తెలుగు చాలకాలం నుంచి ఉన్న భాష కాబట్టి వేరు వేరు అభివృద్ధి దశలలో మానవుని అవసరాల కోసం ఎన్నో కొత్త మాటలు తెలుగులో పుట్టాయి.

ఇంతకు ముందు మనం చూసిన 'చేయు' అనే ఒక్క మాట నుంచే వచ్చే వేల మాటలతో కూడ కలుపుకుంటే ఇక తెలుగు వాగమి (vocabulary) కి తిరుగే లేదు.

వ్యంగ్యం అన్న ఒక్క మాటకు తెలుగులో నాకు తెలిసిన మాటలనే చూడండి: ఎత్తిపొడుపు, ఎగతాళి, ఎద్దేవా, దెప్పుళ్ళు, గేలి, వెటకారం, హేళన, విడంబరం.

30. తెలుగు ఎప్పుడూ రాజులను, మతాలను మోయలేదు.

సంస్కురుతం వైదిక మతాన్ని మోసింది. ప్రాక్రుతం జైన మతాన్ని మోసింది. పాళీ నుడి బౌద్ధాన్ని మోసింది. తమిళం దాదాపుగ వైష్ణవాన్ని మోసింది. కన్నడం అలానే శైవాన్ని మోసింది. తెలుగు మాత్రం మతాలకు దూరంగ మనుగడను సాధించింది.

ఇతర భాషలు ఒక రాచరికాన్ని మోయటం చూస్తాము. తెలుగు దానికి దూరంగ ఉంది. పోతనలాంటి వారు కావాలనే రాజులకు దూరం అవటాన్ని మనం ఇక్కడ చూడాలి.

31. తెలుగే దైవ భాష.

దేవుడు మనుష్యుల భాషల్లో మాటలాడినట్లు కొన్ని ఉదంతాలున్నాయి. యేసు హీబ్రూభాషలో మాటలాడినట్లుగా తెలుసు. బైబుల్, టెన్ కమాండ్ మెంట్స్ ఆ నుడిలో ముందుగ వచ్చాయి. మహమ్మద్ తో వేలుపు అరబిక్ నుడిలో మాటలాడినాడు. నాలుగు వేదాలను దేవుడు సంస్కురుతంలో పలికితె, విని తరువాత తరాలకు శృతులుగా అందజేశారు. ఆ భాషలను దేవ భాషలనడం కద్దు. కాని వాటిలో ఒక సందర్భంలో మాత్రమె వేలుపు మాటలాడినట్లుగా ఉంటుంది.

బెజవాడలో subcollector గా పని చేసిన గొప్ప తెలుగు లెంక రహమతుల్లా గారు 'తెలుగు దైవభాషె' అని ఒక పుస్తకమే రాశారు. తెలుగులో ఒకసారి కాక ఎన్నోసార్లు దేవుడు మాటలాడినట్లు, తిరుగులేని ఆధారాలను వారు ఆ వయ్యలో చూపించారు.

32. తెలుగులో అచ్చు ఈడుపు (vowel harmony) ఉన్నది.

ఒక మాటలోని చివరి అచ్చు, లోపలి అక్కరాల అచ్చులను తనగా మార్చుకోవటం అనే ప్రక్రియను అచ్చు ఈడుపు అని అంటారు. 'తిరుగును' అన్న మాటలో చివరి అచ్చు ఉ లోపలి రు, గు అక్కరాల అచ్చులను తనకు వీలుగ మార్చుకొన్నది. 'తిరిగింది' అన్న మాట లోని చివరి అక్కరం ది లో ఉన్న అచ్చు ఇ, లోపలి రి, గిం అక్కరాలలోని అచ్చులను తన వైపు మార్చుకోవడాన్ని చూడండి.

అలాగె ఈ క్రింది మాటల జంటలను చూడండి:

జరుగును	జరిగింది	పిల్లి	పిల్లులు
తండ్రి	తండ్రులు	మరిది	మరుదులు
అడివిని	అడువులు	కదులును	కదిలింది
మూలుగులు	మూలిగింది	కులుకులు	కులికింది

సరే, దీని వల్ల కలిసొచ్చేదేమిటి? అచ్చు ఈడుపు వల్ల మాటలు పలకడానికి తేలికగ, వినడానికి ఇంపుగ, పాడటానికి సొంపుగ ఉంటాయి. అజంత భాష వల్ల వచ్చే అందాల కొనసాగింపే ఇది.

పశ్చిమాఫ్రికా లోని మండింగ్ నుడిలో ఈ నైజం ఉన్నది.

అన్ని భాషలకన్న మనభాషకు దగ్గరగ ఉన్న కన్నడంలో కూడ ఈ గుణం లేదు. కర్ణాటక రాజధానిని ఇప్పుడు బెంగళూరు అని కన్నడంలో పిలుస్తున్నారు. అదే తెలుగులో ఐతే బెంగుళూరు అని అనేవాళ్ళం. మంగళూరును మనం మంగుళూరు అని అంటాము.

ఇవీ నేను సేకరించిన తెలుగు గొప్పదనాలు. తెలుగు పండితులు తలచుకుంటే ఇంకా వీటికి అదనంగ ఎన్నో జోడించగలరని నా నమ్మకం.

ఈ ప్రత్యేకతలలో కొన్ని ఇతర భాషలలో కూడ ఉండవచ్చు. కాని ఇందులో సగం ప్రత్యేకతలనైనా కలిగిన మరో నుడిని మనం చూడలేము. అందుకే మనం తెలుగే గొప్ప భాష అని అంటున్నాం. ఏ భాష వాడిని పట్టుకొని వచ్చినా, ఒక అర గంటలో తెలుగే గొప్ప భాష అని అతనితోనే చెప్పించగలం.

అందుకని తెలుగులో చదవడం, మాటలాడడం, రాయడం, వినడం గొప్పదనంగా భావించండి. తెలుగు వాడిగ పుట్టినందుకు తలెత్తుకొని గర్వంగ తిరగండి.

తెలుగు తల్లినుడి కాని వారిని కూడ ఇంత గొప్ప భాష అయిన తెలుగును నేర్చుకొని తరించమని కోరుతున్నాను. ఇంత గొప్ప భాషను చావనియ్యడం నేల మీది ఏ మనిషి కూడ సహించకూడదు. జీవ వైవిధ్యం లాగే భాష వైవిధ్యం కొనసాగాలి.

తెలుగు వారి ఆత్మన్యూనత భావం

తెలుగు వారు తమ భాషను, సంస్కృతిని, కళలను, తమను నీచంగా చూసుకుంటున్నారు.

నేను అమేరిక వెళ్ళినప్పుడు మనవరాలితో కలిసి ఈత కొలనుకు వెళ్లాను. మేము కొంచెము లోతులో ఈత కొడుతుండగ, ఇద్దరు పిల్లలు (4 ఏండ్లు, 6 ఏండ్లు వయసు అనుకుంటా) లోతు తక్కువ ఉన్న దగ్గర తచ్చట్లాడటం చూశాను. ఎందుకో తెలుగు పిల్లలే అనిపించింది. వారి దగ్గరకు వెళ్లి 'అమ్మా, మీకు ఈత వచ్చా?' అని అడిగాను. ఒకరి మొకాలు ఒకరు చూసుకొని 'వుయ్ డోంట్ నో తెలుగు అంకుల్' అన్నారు. మరి నేను మాట్లాడినది తెలుగు అని వారికి ఎలా తెలిసింది? అంటే వారికి ఆ మాత్రం తెలుగు పరిజ్ఞానం ఉన్నదన్నమాట. నేను ఈ ఆలోచనలలో ఉంటే కొంచం ఎడంగా ఉన్న వారి అమ్మ దబదబా వచ్చి 'మా పిల్లలకు తెలుగు రాదు అంకుల్'' అన్నది. తల ఎత్తి ఆమె వైపు చూసి విస్తుపోయాను. ఆమె మొకంలో పట్టరాని సంతోషం ఉన్నది. పిల్లలు పాపపు పనులు చేయకుండ ఎంతో జాగ్రత్తగా మంచి విలువలతో పెంచుతున్నాను అనే గర్వం తొణికిసలాడింది. నాకు తల తిరిగినంత పనయింది.

అమేరికలో అంతకు ముందు Aldie, Chicago, Ashburn. Brambleton, Detroit, Washington లాంటి చోట్ల,40 నుంచి 1,000 మంది దాక తెలుగు వారు సమావేశము అయిన దగ్గర తెలుగును నేర్చుకోవాలని, తెలుగు కళలను మరచిపోవద్దని చెప్పాను. ఈ అనుభవం తర్వాత పదిలంగ గమనిస్తే ఒకే ఇంట్లోని తెలుగు పిల్లలు తెలుగులో మాట్లాడుకొనటం లేదు. తల్లులు వారితో తెలుగులో మాట్లాడటం లేదు. అసలు తెలుగు నేర్చుకోవటం లేదు. తెలుగు జోదు కూచిభొట్ల ఆనంద్ గారి ప్రయత్నం కొంచెం ఆశాజనకంగానే ఉన్నా ఇంకా చాల చేయాల్సి ఉన్నది. ఉత్సుకత పెరిగి ఇంకొంత పరిశీలన చేద్దామని మా మనవరాలితో తన బడికి పోవటం మొదలు పెట్టాను. జపనీస్

పిల్లలు అదే కుటుంబం వారే కాక ఇతర పిల్లలతోను జపనీస్ నుడిలో మాట్లాడుతున్నారు. కొరియా పిల్లలు పక్క పిల్లల తల్లులతో కూడ కొరియా భాషలోనే మాట్లాడుతున్నారు. చైనా పిల్లలు అందరికి మాండరిన్ భాష రాయడం చదవడం వచ్చు. అందులో శాస్త్రాలను కూడ చదువుతారు.

తరువాత ఒక భారతీయుల నాట్య కార్యక్రమానికి వెళ్లాను. జోడింపును చూడండి. మొత్తం 18 నాట్యాలను ప్రదర్శించారు. చూసేవారిలో, చేసేవారిలో తెలుగు వారే గణనీయంగా కన్పించారు. కాని తెలుగు రాష్ట్రాల నాట్యం ఒక్కటి కూడ లేదు. తమిళనాడువి 3, మహారాష్ట్రవి 3, పంజాబువి 2, కేరళవి 2, ఇలా. ఒరిస్సా, మిజోరాం, త్రిపుర లాంటి చిన్న రాష్ట్రాల నాట్యాలు కూడా ఉన్నాయి. కోలాటం నాట్యాన్ని తమిళనాడు నాట్యంగా చూపించి మాత్రమే వేశారు. అంటే తెలుగు భాషను మనవారే దూరంగ ఉండాల్సిన భాషగా చూస్తున్నప్పుడు తెలుగు సంస్కృతి, కళలను ఇతరులు ఎవరు గౌరవంగ చూస్తారు?

ఈ నేపధ్యంలో మన దేశానికి తిరిగి వచ్చాక ఈ విషయాలపై ఇంకా నిశితంగా చూడటం మొదలు పెట్టాను. బస్తీలోని ఒక రిక్షా కార్మికుడి పిల్ల దగ్గర నుంచి, పల్లెటూరి బడుగు వర్గాల పిల్లల వరకు ఇంటికి వచ్చాక, వచ్చీ రాని ఆంగ్లంలో మాట్లాడుతూ

తెలుగుకు దూరంగా ఉండాలని ఇక్కడి తల్లులు కోరుకుంటున్నారు.

ఈ సందర్భంలో స. వెం. రమేశ్ గారు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. "తెలుగు వారికి ఆత్మాభిమానం లేదు. తమ భాషను మరచిపోతారు. తమ కళలకు సంస్కురుతికి దూరంగ ఉంటారు." ఇక్కడ స. వెం. గారి గురించి నాలుగు మాటలు: "ఆయన తమిళనాడులో పుట్టిన తెలుగువాడు. అక్కడ తమిళం, ఆంగ్లం తప్ప వేరే భాషలను నేర్పరు, చదవనివ్వరు, కనపడనివ్వరు. తను ఎం. ఏ. (అంత్రొపోలజీ) లో బంగారు పతకం సంపాదించాక ఉద్యోగంలో చేరే ముందు ఒక సారి వెనుతిరిగి చూసుకుంటే అంతరించిపోతున్న తెలుగు జాతి కనపడింది. ఇక ముందు వెనుక చూడకుండా భాషోద్యమంలోకి దూకాడు. పెండ్లి చేసుకుంటే– పెండ్లానికి పట్టు చీరెలు, పిల్లకు పరికిణీలు పావడాలు, పిల్లగాడికి పాఠశాల ఫీజుల పాట్లకై పక్కదారి పట్టవలసి వస్తుందని– పలువురు పట్టుపట్టినా– తను మాత్రం పెండ్లిని శాశ్వతంగా పక్కకు పెట్టేసాడు. తన ఇతర సుఖాలను వదిలేసి– నిండు జీవితాన్ని, ఆరోగ్యాన్ని, యవ్వనాన్ని తెలుగు కోసం మాత్రమే అర్పిస్తూ ఉద్యమిస్తున్న మనిషి ఈ నేలమీద స. వెం. ఒక్కడే. ఎన్నో రాష్ట్రాలు, దేశాలు తిరిగి తెలుగు మూలాల మీద చాల పరిశోధనలు చేశాడు. అక్కడి భాషల్లో తెలుగు నేర్పటానికి పుస్తకాలు రాశాడు. అతని కృషి వల్లనే తెలుగు తిరిగి జీవం పోసుకుంటుంది అనే ఆశ కలుగుతున్నది."



తెలుగు వారికి ఇతర భాషలు గొప్పవిగా కనపడతాయి, తెలుగు తక్కువ భాషగ కనపడుతుంది. తెలుగు కళలను కూడ మనం తక్కువగా చూస్తున్నాము.

తమిళనాట తమిళం మాత్రమే ఉంటుంది. చిన్న భాషలను వదిలి వేయండి, తెలుగు లాంటి భాషనే మటుమాయం చేశారు. మనం మాత్రం తెలుగు తల్లి ఒంట్లోకి ఇతర భాషల కాన్సర్ కణుతులను ఆగకుండ ఎక్కిస్తూనే ఉంటాం. పాత రోజులలోనే కాకుండ ఇప్పుడు కూడ ఈ ప్రక్రియ నిరంతరంగా జరుగుతూ ఉన్నది. సవరలు తెలుగు సంస్కురుతిలో కలిసిపోతుంటే వారి కోసం ఒక లిపిని కనిపెట్టి, పుస్తకాలను గిడుగు గారు రాశారు. వారు దానిని అటువంటి అన్ని చిన్న జాతులకోసం, అన్ని రాష్ట్రాలలో ఉన్న వారి కోసం చేయలేదు, ఇతరులను చేయమని అడుగలేదు. గోండుల కోసం కూడ ఈ నడుమ అటువంటి ఉద్యమమే నడుస్తున్నది. వారి కోసం పాత గుర్తులను సేకరించి కొత్త లిపిని కనిపెట్టి అందులో పుస్తకాలను రాసి ఆ భాషను ఐ.టి.డి.ఎ. లాంటి ప్రభుత్వ యంత్రాంగాల ద్వారా నేర్పుతున్నారు. మన దగ్గర గోండులు కొద్ది లక్షల మంది మాత్రమే కాని అటువంటి వారు ఇతర రాష్ట్రాల్లో కోట్ల మంది ఉన్నారు. అక్కడ మాత్రం ఈ ఉద్యమం ఉండదు. మహబూబునగర్ జిల్లాలో పని చేయటానికి వచ్చిన కొద్ది మంది ఒరియా వారికి వారి రాష్ట్రం నుంచి పంతుళ్ళను తెప్పించి వారి మాత్రుభాషను పని కట్టుకొని నేర్పుతున్నారు. మన దగ్గర ఉన్న 35% చదువు రాని వారికి తెలుగు నేర్పరు. కేరళలో అలా వచ్చిన ఒరియా వారికి – మాత్రు భాష, సంస్కురుతుల మీద –అభిమానము ఉన్న అక్కడి ప్రభుత్వము పట్టుబట్టి – మలయాళము నేర్పుతున్నది.

నాకు లంబాడీలు అంటే ఎంతో గౌరవం. వారిని చూసి అయినా మన వారికి బుద్ధి రాదు ఏమిటిరా అనుకుంటున్నాను. బృందంగా వారు నాట్యం చేస్తున్నప్పుడు చేతులెత్తి దండం పెడతాను. ఎన్నో వందల ఏండ్ల కింద ఇక్కడకు వచ్చినా వారు తమ మాటను, పాటను, ఆటను, దుస్తులను, ఆభరణాలను ఏ మాత్రం మరువలేదు. ప్రతి వారికి నాట్యం వచ్చు, పాడటం వచ్చు. కాని వారు గిరిజనులు కారు. కొండల మీద ఉంటూ పోడు వ్యయసాయం చేస్తూ బ్రతకరు. బాగ కష్టపడతారు. వారిని వెనుకబడిన వారిగా పరిగణించవచ్చు. ఇతర రాష్ట్రాలలో వారిని అలా పరిగణిస్తారు. కాని మనం వారిని గిరిజనులగా గుర్తించే సరికి పక్క రాష్ట్రాల నుంచి వారు వరద లాగ వచ్చి పడుతున్నారు. ఇక్కడ తెలుగు మాట్లాడుతున్న గిరిజనుల కన్న వారు తెలివైన వారు కాబట్టి సహజంగానే ప్రభుత్వం ఇచ్చే అన్ని సదుపాయాలను వారే కొట్టేస్తున్నారని ఇక్కడి వారు ఇప్పుడు పెద్ద ఉద్యమమే నడుపుతున్నారు.

పశ్చిమ చాళుక్యుల కాలానివే అయిన బాదామి, పద్దదకల్ గుడులకు యునెస్కో గుర్తింపు దొరికింది. మహాబలిపురం, తంజావూరు, కోణార్క్, ఖజురహో లాంటి సాంస్కృతిక చోటులకు ఏ మాత్రం తీసిపోనిది ఆలంపురం. తమ గడ్డ మీద ఏ మాత్రం

చారిత్రక ప్రశస్తి ఉన్న చోట్లున్నా, అవి ఎంత మారు మూలనున్నా, చిత్తశుద్ధితో వాటిని కాపాడుకొంటాయి ఇతర జాతులు. పైగా వాటిని గూర్చి గొప్పగా ప్రచారం చేస్తూ, పర్యాటకులను ఆకట్టుకొంటాయి. ఆలంపురంలో ఏ రాయిని, ఏ స్తంభాన్ని, ఏ గోడను తాకినా, కనీసం వెయ్యేండ్ల క్రింది కతలను వినిపిస్తాయి. అంతటి గొప్పదనాన్ని ఇంకెంతగా చెప్పుకోవాలి మనం?

ప్రాక్రుత, పాళీ భాషలపై మోజు

మొదటి నుంచి తెలుగు రాజులకు కూడ పరాయి భాషలే గొప్పగా కనపడేవి. తెలుగుపై ఏవగింపు ఉండేది. ఇప్పటివరకు దాదాపు అన్ని ప్రభుత్వాలు (నందమూరి తారక రామారావు, నరసింహారావు లాంటి వారి కొద్ది కాలం మినహాయిస్తే) ఇదే ధోరణిని శ్రద్ధగా పాటిస్తూ వచ్చాయి. కొన్ని వేల ఏండ్ల కింద జైన మతం ప్రాబల్యంలో ఉన్నప్పుడు తెలుగు రాజులు ప్రాక్రుతాన్ని పోషించారు. ఆ భాషలోనే రాతి పలకలను వేశారు. పరిపాలన చేశారు. పుస్తకాలు రాశారు. బౌద్ధ మతం ప్రాబల్యంలో ఉన్నప్పుడు పాళీ భాషను పోషించారు. అందులోనే రాతి పలకలు, పరిపాలన, పుస్తకాలు ఉండేట్లు చూశారు. ఏతావాతా తెలుగును ఎక్కడ కనపడకుండ చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని ఏండ్ల తరువాత కూడ రాజధాని హైదరాబాదులో వాడుక భాషగ తెలుగు చోటును సంపాదించుకోలేకపోయింది. ఏ రాష్ట్రంలో కూడ ఇంత రోత లేదు.

ఆంగ్లంపై మోజు

ఆంగ్లేయులు అధికారంలో ఉండగా తెలుగును తక్కువగ చూడలేదు. బదులలో నేర్చారు. ఎక్కువ మంది, చాల ఎక్కువ ప్రాంతంలో మాట్లాడే భాషగ గుర్తించారు. వారు వెళ్ళాక మనం మాత్రం ఆంగ్లం మీద అపరిమితమైన మోజు పెంచుకున్నాము. తెలుగు నేర్చుకొనకూడదు, ఒక్క ఆంగ్లం నేర్చుకుంటే చాలు అనుకుంటున్నాము. ఇతర భాషల వారికి లేని ఈ వేలంవెర్రి మనకు తగులుకొన్నది. సరే, ఇంత జేస్తే, మనం ఆంగ్లంలో ఏమైనా పట్టు సంపాదించామా? ఒక్క మంచి ఆంగ్ల రచయితగా తెలుగు వాడిని చూడగలమా? మా చిన్నతనంలో రాజారావు గారిని గొప్ప ఆంగ్ల రాతరిగా చూశాము. హిందు పత్రికలో జి. ఎన్. రెడ్డి గారి వ్యాసాల కోసం ఎదురు చూసేవారం. నేను కలకత్తా లోని Statesman పత్రిక గురించి మాట్లాడటం లేదు; డిల్లీ నుంచి వచ్చే Hindustan times గురించి మాట్లాడటం లేదు; బొంబాయి Times of India కాదు; విశాఖ నుంచి వెలువడే Hindu మరియు New Indian Express గురించి మాట్లాడుతున్నాను. శని, ఆదివారాల్లో వాటిలో ఎప్పుడూ రాసే కాలమిస్టులలో ఒక్క తెలుగు వాడు కనపడడే! (కాలమిస్టు అంటే మీకు తెలుసు– ప్రతి వారం ఒక విషయం మీద తన అభిప్రాయాలను– వార్తలను కాదు– రాసే బయటి వాడు). మీకు తమిళులు

కనబడతారు, బెంగాలీలు కనబడతారు లేక హిందీవారు కనబడతారు. ఎందుకంటే వారు తమ మాతృభాషలోనే చదువుతారు. అందుకని ఆంగ్లం మీద కూడ పట్టు వస్తుంది.

పత్రికలను వదలి వేయండి. అసలు ఒక మంచి ఆంగ్ల రచయితగా పేరొందిన తెలుగువాడిని చూడగలమా? ఇన్ని ఏండ్ల తరువాత పరిస్థితి ఎక్కడకు వచ్చింది? గొప్పగ అమ్ముడుపోయే ఆంగ్ల నవలలను రాసే తెలుగువాడు కనపడతాడా? భారత దేశపు – అమృత ప్రీతం, విక్రం సేథ్, ఆర్.కె.నారాయణ్, జుంప లాహిరి, అమితవ్ ఘోష్, ముల్కరాజ్ ఆనంద్, రస్కిన్ బాండ్, నిరద్ సి చౌదరి, కిరణ్ దేశాయ్, సంజీవ సన్యాల్, ప్రతిభ రే, దేవదత్ పట్నాయక్, అశ్విన్ సింఘి, వినీద్ బాజపెయీ, ఇందు సుందరేశన్, అమిష్ త్రిపాఠీ, ఆనంద్ నీలకంటన్, చిత్రా బనర్జీ, దివకరుణి, కృష్ణ ఉదయశంకర్, ప్రీతీ షెనాయ్, రవీందర్ సింగ్, దుర్జోయ్ దత్తా, సందీప్ నాగర్కర్, చేతన్ భగత్, విక్రం చంద్ర, రవి సుబ్రమణియన్, నవనీత్ చక్రవర్తి, భాస్కర చటోపాధ్యాయ్, సలీల్ దేశాయ్, మధుమతి భట్టాచార్య, అనితా నాయర్, సమిత బసు, ఇంద్ర దాస్, సుకన్య వెంకట రాఘవన్, శ్వేత తనేజ, విక్రం బాలగోపాల్, రాబిన్ శర్మ, శివ ఖేరా, సద్గురు, రాధాకృష్ణ పిళ్ళై, ప్రకాష్ అయ్యర్, ఓం స్వామి– లాంటి ఆంగ్ల రచయితలలో తెలుగు పేరు ఎక్కడ? ఇందులో కొంత మంది ఒక పుస్తకానికే లక్షల రూపాయలు సంపాదించే వారున్నారు.

ఆంగ్లాన్ని మనం ద్వేషించాల్సిన పని లేదు. దాన్ని మనం అందరం ఒక భాషగ నేర్చుకోవాలి కూడ.

చైనా, కొరియా, జపాన్, జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ లాంటి దేశాలు తమ పిల్లలకు మనం నేర్పినట్లుగా ఆంగ్లాన్ని నేర్పవు. తమ మాత్రు భాషలోనే అక్కడ పై చదువులు కూడ పూర్తి చేస్తారు. శాస్త్రాల్లో కొత్త విషయాలను తమ భాష ద్వారానే కనిపెడతారు. ప్రపంచం మొత్తంలోనే గొప్ప సూపర్ కంప్యూటర్ ను కనిపెట్టిన చైనా శాస్త్రజ్ఞులు ఆంగ్లం రాని వారే.

ఉమ్మ నాడే అమ్మ నుడి. కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లి మాటలను, సంస్కురుతిని పిండం నేర్చుకుంటుంది అన్న విషయం తేలిపోయింది. బయటి లోకంలో తెలిసిన భాష నుంచి పిల్లలు తెలియని భాషలను, విషయాలను తెలుసుకొంటారు. ప్రక్రుతి సహజమైన ఈ జ్ఞాన సేకరణ పద్ధతిని వదిలేసి శిశువుకు బలవంతంగ ఆంగ్లాన్ని రుద్ది వాడు తిరిగి కోలుకోలేకుండా చేస్తున్నాము.

Oxford విశ్వవిద్యాలయం వారు రెండు తెలుగు రాష్ట్రాలలోని 230 బడులలో మూడు ఏండ్లు పరిశోధన చేసి తెలుగును చదువుతున్న పిల్లలకే ఆంగ్లం కూడ బాగా వస్తున్నది అని తేల్చి వేశారు.

పాత రోజుల్లో తెలుగులో చదివిన వారే తరువాత ఆంగ్లాన్ని చదివి అందులో కూడ అందె వేసిన చేయి అనిపించుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, రాజ గోపాలాచారి అటువంటి వారే.

అంతర్జాతీయంగా విద్యాబోధన చేసేవారు అందరూ ఏకగ్రీవంగా ఒక విషయాన్ని విభేదాలు లేకుండా నిశ్చయంగా తేల్చేశారు. అమ్మ నుడిలో చదువుకున్న వాళ్ళే చివరకు రాణిస్తారు. వారికే ఇతర భాషలు సరిగా వస్తాయి. భాషేతర విషయాల్లో, శాస్త్రాల్లో వారే రాణిస్తారు.

ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయం వారు కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్పారు, 'మీ భాష నేర్చుకోకపోతే మా భాష మీకు ఎన్నటికీ రాదు.'

తెలుగు వారు ఇక్కడ విజ్ఞానాన్ని తెలుగులో తెలుసుకున్నాక వారు పోదల్చుకున్న దేశపు భాషను అయిదారు నెలలు ముందుగ నేర్చుకొంటే సరిపోతుంది. జర్మనీ వెళ్ళాల్సి వస్తే జర్మన్ భాషను, చైనా వెళ్ళాల్సి వస్తే మాండరిన్ ను నేర్చుకొంటే సరిపోతుంది. ఇతర దేశాల్లో కూడ అలానే చేస్తారు.

మన దగ్గర ఏదో జీతగాండ్లగా మన పిల్లలు తయారు అవుతున్నారు గాని భాషలో, ఏదైనా శాస్త్రంలో ఉన్నత స్థానానికి ఎదిగిన వాండ్లు మచ్చుకైనా కనరారు.

'ఉద్యోగాల కోసం ఆంగ్లం నేర్పిస్తున్నాము' అని అంటాం మనం. ఇంగ్లిష్ చదువుకొని విదేశాలకు వెళ్ళే మనవారు సంవత్సరానికి నాలుగైదు వేలకు మించరు. అమేరికలో 50 ఏండ్ల నుంచి పోయిన తెలుగువారు అన్ని రంగాలలో కలిపి రెండు లక్షల మంది వుంటారేమో. కుటుంబ సభ్యులతో కలుపుకొని 4 లక్షల మంది ఉంటారు.

తెలుగు రాష్ట్రాల్లో చదువుకొనే విద్యార్థులు 2 కోట్లకు పైగా ఉంటారు. కొద్ది వేల మంది ఉద్యోగాల కోసం కోట్ల మంది చదువును చేతులార చెడగొడుతున్నాము. సగటు తెలుగు విద్యార్థి ప్రతిభ అతి ఘోరంగా ఉంటున్నది అన్న విషయం అందరికి తెలిసిందే.

మాత్రుభాషను మరిచిపోయిన సమాజం సృజనాత్మతకు సుదూరంగా ఉండి పోతుంది. – కలాం.

మాతృభాషలో చదువుకుంటున్నపుడు, మెదడులోని, నియోకోర్టేక్స్ విశేషంగా స్పందిస్తుంది. ఫలితంగా చిన్నారుల్లో సూక్ష్మబుద్ధి, కొత్త ఆలోచనలను వ్యక్తీకరించగల సామర్థ్యం వృద్ధి చెందుతాయి.–Dr. Asok Pangaria, former president, Indian academy of neurology.

నా వరకు మాత్రం దైవ స్మరణ చేయడం, తెలుగులో మాట్లాడటం ఒకటే.– సుద్దాల అశోక తేజ.

సంస్కృతంపై మోజు

మన వారు సంస్కృతాన్ని మతభాషగానే కాక చాల గొప్ప భాషగా భావిస్తారు. ఆ మాటలను వాడటం, ఆ శ్లోకాలను చదవటం వాటి అర్థాలను చెప్పటం –సందర్భం ఏదైనా – ఒక పండితుని లక్షణంగా అనుకుంటారు. వామపక్ష యోధుడు పువ్వాడ

నాగేశ్వర రావు గారు రాసుకున్న స్వీయ చరిత్ర " నా స్మృతులు – అనుభవాలు" పొత్తానికి ముందు మాట రాస్తూ ఒకే పుటలో 1. పథికుడిగా (బాటసారిగా) 2. పున: (తిరిగి) అని సి. రాఘవాచారి గారు పద ప్రయోగాలను రాశారు. దీని ద్వారా వారు చెప్పతలుచుకొన్నది: నాకు సంస్కృతం వచ్చు, అది గొప్పతనం. అందరికీ తెలిసిన తెలుగు మాటలకు బదులు సంస్కృతపు మాటలు వాడటం గొప్పతనం. సంస్కృతం తెలియని సన్నాసులకు వీలైనప్పుడల్లా కొన్ని సంస్కృతపు మాటలు నేర్పితే గొప్పతనం.

ఇక్కడ రాఘవాచారిగారు ప్రజాసేవకు అంకితమైన విషయాన్ని, పీడిత జనం పక్షాన పోరాటానికి ఆయన జీవితాన్ని వెచ్చించిన విషయాన్ని మరువరాదు. అటువంటి పోరాట యోధుడిని కూడ అందరి లాగే ఈ సంస్కృతం మోజు ఎలా పట్టుకున్నదో గమనించటానికే ఈ విషయం మనం చెప్పుకున్నాము. ప్రజలకోసం పోరాడుతున్నాం అని చెప్పుకునే పార్టీల వ్యాసాల్లో కూడ వారు సంస్కృత మాటల కోసం ఎగబడటం కనిపిస్తుంది.

పరాయి భాషలపై మోజు

ఇతర రాష్ట్రాలకు లేక దేశాలకు వెళ్ళిన తెలుగువాడు ఒక తరం తరువాత తెలుగుకు దూరం అవుతాడు. 200 ఏండ్ల కింద 3 లక్షల మంది తెలుగువారు మారిషస్ కు వెళ్ళారు. వారు అందరు దాదాపు తెలుగుకు దూరమయ్యారు. సంజీవ నరసింహ అప్పుడు లాంటి కొద్ది మంది గట్టిగా పాటుబడుతున్నా పెద్ద మార్పు రావటం లేదు. అప్పుడే అంతకన్న తక్కువ మంది తమిళులు అక్కడకు వెళ్ళారు. వారు తల్లినుడిని సంస్కృతిని వదులుకోలేదు. ఇప్పుడు అక్కడ తమిళం అధికార భాష. సింగపూరు, మలేషియా లాంటి దేశాల్లో కూడ అదే పరిస్థితి.

తమిళనాడు రాష్ట్రం ఏర్పడినప్పుడు తమిళుల కన్న తెలుగు వారే ఆ రాష్ట్రంలో ఎక్కువ. ఇప్పుడు దాదాపు తెలుగు కనపడని పరిస్థితి దాపురించింది. కర్ణాటకలో కూడ అదే పరిస్థితి. మిగిలిన రాష్ట్రాల్లో తెలుగు వారు కూడ ఇందుకు భిన్నంగా లేరు.

ఒక తమిళ అమ్మాయి, తెలుగు అబ్బాయి పెండ్లి చేసుకుంటే పిల్లలు తమిళం మాట్లాడుతారు. తమిళ అబ్బాయి, తెలుగు అమ్మాయి పెండ్లి చేసుకున్నా పిల్లలు తమిళమే మాట్లాడుతారు. మా భవనంలో ఉంటున్న ఒక తెలుగు అబ్బాయి హిందీ అమ్మాయిని చేసుకున్నాడు. పిల్లలు హిందీలో మాట్లాడుతున్నారు. మా ఎదురింటిలో బెంగాలు అబ్బాయి హిందీ అమ్మాయిని చేసుకున్నాడు. పిల్లలు బెంగాలి భాషలో మాట్లాడుతున్నారు. మా ఇంటి కింది ఇంట్లో తెలుగు అబ్బాయి బెంగాలీ అమ్మాయిని చేసుకున్నాడు. పిల్లవాడు బెంగాలు భాష నేర్చుకున్నాడు. అమేరికలోని చాల ఎక్కువ తెలుగు తల్లులు తమ పిల్లలతో ఆంగ్లంలోనే మాట్లాడుతారు.

కణుపు ౧౧

మత భాషలు – తెలుగు

తెలుగు – మహమ్మదీయులు

మా ఊర్లో మా చిన్నతనంలో, ఇంట్లో కూడ తెలుగు మాట్లాడే, మహమ్మదీయులు ఉండే వారు. వారిని దూదేకుల సాయిబులు అని అనేవాళ్ళం. (మేము కూడ మొహర్రం రోజుల్లో పీరీలను పట్టుకొని ఎగిరే వాళ్ళం. అన్ని పండుగలలాగే అదీ ఒక పండుగ అని అనుకొనే వాళ్ళం.) కాని, తరువాత నెమ్మదిగ వారు కూడ ఉర్దూలోకి వెళ్ళిపోయారు. మనమే తీసి పడేస్తున్న నుడిని వారు మాత్రం ఎంత కాలం మోస్తారు!

మహమ్మదీయుల తల్లి నుడి ఉర్దూ అనే అభిప్రాయం చాల మందికి ఉన్నది. 150 కోట్ల మహమ్మదీయులలో ఉర్దూ మాట్లాడేవారు 20 కోట్ల లోపే. ఏ ప్రాంతంలో ఉన్న వారు ఆ ప్రాంతపు భాషనే మాట్లాడతారు. మహమ్మదీయులు కేరళలో మలయాళం, తమిళనాడులో తమిళం, మలేసియాలో మలయా, ఇండొనేషియాలో బాష, బంగ్లాదేశ్ లో బెంగాలీ మాట్లాడతారు. ఈ సూత్రం, ఇంతకు ముందు అనుకున్న కారణాల వల్ల, తెలుగు ప్రాంతంలో మాత్రం వర్తించదు.

ఆ ప్రాంతపు జనభాష మాట్లాడుతున్న ఇండొనేషియా, మలేసియా ముస్లిములే నిజంగా ఇప్పుడు మంచివారు అన్న విషయాన్ని అందరు గుర్తించారు. మలేసియాలో చాల ఎక్కువ శాతం మంది మహమ్మదీయులే. ఆ దేశం మన కన్న కొద్ది కాలంలోనే చాల ముందుకు పోయింది. అశాంతి లేదు. తనకు తెలియని వారి నడుమకు, ఒంటికి బాంబులు పెట్టుకొని వెళ్లి, తనను పేల్చేసుకొని, ఎదుటి వాళ్ళను కూడ చంపుదాం అనుకొనే వాడు అక్కడ ఒక్కడు కూడ లేడు. మత ఉగ్రవాదులకు వ్యతిరేకంగ మిగిలిన దేశాల కన్న గట్టి చట్టాన్ని తెచ్చి ఆ దేశం పకడ్బందిగా అమలు చేస్తున్నది.

ఈ విషయాన్ని ఇప్పుడు మన దేశపు మహమ్మదీయులు కూడ గమనిస్తున్నారు. 'మన ప్రాంత సంస్కురుతి, భాషలకు దూరమైతే మన పిల్లలు పొరుగు వారి నుంచి దూరమౌతారు, వైషమ్యాలు పెరుగుతాయి' అన్న విషయాన్ని తెలుసుకొన్నారు. ప్రభుత్వం ఎలాగూ తెలుగును చంపే ప్రభుత్వమే కాబట్టి దానిని నమ్మికొంటే లాభం లేదు అని తామే స్వయంగా పిల్లలకు తెలుగును నేర్పుతున్నారు. హైదరాబాద్ పాత ఊరులో ఆదాబ్ పేరిట చాల పెద్ద ఎత్తున తెలుగును నేర్పుతున్నారు. ఈ క్రింది ఊసును కూడ చూడండి.

తెలుగు మాట్లాడటంలో ఉచిత శిక్షణ

నూర్‌ఖాన్ బజార్: మదర్సాలో చదివే ఉలమాలకు, ఖురాన్ పండితులకు తెలుగు భాష మాట్లాడటంలో రెండు నెలలపాటు మాదన్నపేటలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అల్‌మహదుల్ మదర్సా నిర్వాహకులు మౌలానా అతీఖుర్ రహ్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9959078641 నంబరులో సంప్రదించాలన్నారు.

తెలుగు – క్రైస్తవులు

దేవుని వాక్యాన్ని తెలుగులోనే చేరవేయవలసిన అవసరాన్ని క్రైస్తవులు చాల ముందుగ గుర్తించారు. 1804 లోనే బైబిలును తెలుగులోనికి మార్చడం మొదలెట్టి, 1812 నాటికి దాదాపు పూర్తి చేశారు. ముందుగ వచ్చిన తెలుగు పుస్తకం దాదాపు అదే.

1880 లోనే బెజవాడ నుంచి వేల్పుల జార్జి గారు 'తెలుగు బాప్టిస్టు' అనే మాస పత్రికను తెచ్చి మా భాష తెలుగే అని చెప్పకనే చెప్పారు. దేవుని సువార్తను తెలుగులోనే చెప్పవలసిన అవసరాన్ని గుర్తించారు. సిలువ గుడులలో తెలుగులోనే ప్రార్థిస్తారు, బోధిస్తారు.

డా. ఎన్. జయకుమార్ రావు గారు 'క్రైస్తవులు – తెలుగు భాష' అనే పుస్తకాన్ని వ్రాసి, మందికి ఇంకా దగ్గరగ ఉండే తెలుగులో ఎలా 'సువార్త'ను తెలియజేయాలో చాల

వివరంగా చెప్పారు. హల్లెలూయ లాంటి పరభాషా పదాలను అర్థం లేకుండా వాడుతున్నారు అని అన్నారు. "శిష్ట వ్యావహారిక భాష విద్యాధికులకూ, వచన కవులకూ ఎంతో బాగుంటుంది. సామాన్య చదువులు చదివిన క్రైస్తవేతరులకు అర్థం కాదు. ఆ మాటకొస్తే సామాన్య చదువులున్న క్రైస్తవులకూ అర్థం కాదు. గనుక సాధారణ వాడుక భాషను క్రైస్తవేతరులకు అర్థమయ్యే రీతిలో అందించగలిగితే ప్రసంగీకులకు ఆత్మల పంట సమృద్ధిగా లభిస్తుంది." అని రాశారు.

ఈ క్రింది వార్తను చూడండి:

తెలుగులో 'గాస్పెల్ రేడియో' ప్రసారాలు

వాషింగ్టన్: అమెరికాకు చెందిన 'గాస్పెల్ రేడియో' తన కార్యక్రమాలను భారతదేశంలో విస్తరించనుంది. ఈ మేరకు తెలుగులో ఆయా కార్యక్రమాలను ప్రసారం చేసేందుకు అనువుగా చర్యలు చేపట్టినట్లు ప్రకటించింది. జీసస్‌ను ప్రజలు వారి మాతృభాషలోనే ఆరాధిస్తారని, ప్రస్తుతం భారతదేశంలో సంతాలి, ఒడియా, హిందీ, బెంగాలి సహా 7 భాషల్లో కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నామని, 2015లో తెలుగులో ప్రసారం చేస్తామని 'ట్రైడ్ గ్లోబల్ రేడియో మినిస్ట్రీ' తెలిపింది.

వారు ఏసు నా కాపరి అని పలుకుతారు, రిక్షా బండ్ల మీద రాస్తారు. కాపరి అనే తెలుగు పదం దేవునికి వాడటానికి పనికి రాని రోత పదముగ కనపడుతున్నది హిందువులకు. రక్షకుడు అనే సంస్కురుత పదమే దీనికి సరిఅయినది అనుకుంటారు వీరు.

తెలుగు – హిందువులు

హిందువులు పూజను సంస్కురుతంలోనే చేస్తారు. తెలుగు చెత్త భాష, పూజకు పనికి రాదు అని అందరి మనసులలో గాఢమైన, చెరిగిపోని ముద్రను వేశారు. దేవుడికి తెలుగు తెలియదు అని అందరు నమ్మేట్లు చేయగలిగారు.

సంస్కురుతం ప్రభావం తెలుగునాట పడక మునుపు ఉన్న దేవుని మంత్రాలు, పాటలు, కీర్తనలు అన్ని మరచిపోయాము. వేయి ఏండ్ల క్రిందనే శైవులు తెలుగులో తయారు చేసిన పద్యాలు, పాటలు, తత్వాలు, దండకాలు, ద్విపదలు పనికిరాని వాటిగా పరిగణించేట్లు విజయవంతంగా చేయగలిగారు. తెలుగు తల్లికి నిజమైన బిడ్డ ఆదిభట్ల

వారు దేవుని పూజకు కావలసిన అన్ని రకాల తెలుగు మంత్రాలను చేసినా తెలివిగా తొక్కేశారు. సంస్కృతపు విష్ణు సహస్ర నామాన్ని చదువవచ్చు కాని ఆదిభట్ల వారి తెలుగులో మాత్రం దానిని చదువకూడదు. తమిళం తిరుప్పావైను గుడిలో చదవవచ్చు, కాని తెలుగు తిరుప్పావై పనికి రాదు.

నేను పదవి విరమణ చేశాక మా ఊరు తీరికగా వెళ్లి చూస్తే మా ఇంటి ముందున్న రామాలయం కూలిపోయింది. మా చిన్నప్పుడు అది కళకళలాడేది. పాటలన్నీ అయ్యాక పంచే ఫలహారం కోసం పిల్లలు ఎదురు చూసేవారు. పందొమ్మిది వందల పదుల్లో పుట్టిన మా అమ్మ, నాన్న ఇద్దరూ చదువుకున్నవారే. ఇద్దరూ పాటలు బాగా పాడేవారు. మా నాన్న చిరతల భజన కూడ చేసేవాడు. నాకు అంతగా పూజ, క్రతువులు తెలియవు. అయినా మా తల్లిదండ్రుల గురుతు కోసమైనా ఏమైనా చేయాలనుకున్నాను. మీకు తెలిసిన వారిలో ఎంత మంది గుడులను కట్టించారో తలపోయండి. పది మంది కలిసి కట్టించి ఉంటారు, లేక ఒక ట్రస్ట్ తరఫున కట్టించి ఉంటారు. మా వూరిలో మాత్రం నేను ఒక్కడిగానే గుడి కట్టించాను. ప్రహరీ గోడ పెట్టించాను. నీళ్ళ మోటార్, కరెంటు బిల్లు, అయ్యవారి నెలవారీ పారితోషికం కూడ నేనే భరిస్తున్నాను.

మా అమ్మ చనిపోయినప్పుడు పురోహితుడిని పిలిచాం. ఆయన మా అమ్మ గురించి మాకు తెలియని భాషలో దేవుడికి ఏదో చెప్పాడు. చిన్న దినం నాడు పిలిచాము. ఈ సారీ మేము ప్రేక్షకుల లాగనే ఉండిపొయ్యాము. పెద్ద దినం నాడూ క్రతువు మాకు తెలియని భాషలో జరిగింది. ఆ రోజు పగలు ఊరి అందరికీ భోజనాలు పెట్టాము. తిని వెళ్తూ మా ఊరిలోని ఒక సిలువ గుడి పెద్ద (ఫాదర్) నన్ను, నా తమ్ముడిని రెండు నిముషాల కోసం పక్కకు పిలిచాడు. మాకు తెలిసిన మాటల్లో చాల ఆవేశంగా " పరలోకమందున్న ఓ దేవా, తండ్రీ, నాయనా..." అంటూ మా అమ్మ కోసం ప్రార్థిస్తుంటే ఒడలు జలదరించింది. మొదటిసారిగా మా అమ్మ కోసం దేవుడిని వేడ్కొనటాన్ని అనుభవించాము.

మా చిన్నతనంలో ఇంతకు ముందు చెప్పినట్లు ఇంటి ముందు రామాలయం ఉండేది. ఆదివారం నాడు ఏదో ఊరి నుంచి ఒక ఫాదర్ వచ్చి ఒక పూరింట్లో మాత్రం యేసుని గురించి చెప్పేవాడు. పదవీ విరమణ తరువాత నేను ఊరిలో తీరికగ చూస్తె 5 సిలువ గుడులు వచ్చాయి. రామాలయం కూలింది. కొద్దిమంది హరిజనులకే పరిమితమైన క్రైస్తవం వెనుకబడిన కులాల, పెద్ద కులాలలోని కొంతమందిని కూడ ఆకర్షించింది. అప్పుడు నాకు కనువిప్పు అయినది. మనం భక్తులకు తెలుగును ఎంత దూరంగ ఉంచుదామా అని నిత్యం అలోచిస్తుంటాం. పూజారి తెలుగుకు దూరంగా ఉండటం వల్లనే ఇలా జరిగినదని తేలిపోయినది. అయ్యగారు జనానికి ఎడంగా ఉండిపోయారు. మనుషుల హృదయాలలోనికి జొరబడేట్లు మాట్లాడలేక పోతున్నారు.

పెండ్లిలో మధ్యన పురోహితుడికి ఏదైనా సంభావన ఇస్తారు. దానిని ఆయన వెనుక పెట్టుకొంటే జనం కొట్టేస్తున్నారు. నా పురోహితుడు ఒక హాస్యగాడిగ పరిగణించబడుతున్నాడు. పిలకను ఊపుకొంటున్న బఫూన్‌గానే సినిమాలో కూడ చూపబడుతున్నాడు. ఒక ఫాదర్‌నో, మౌల్వీనో అలా సినిమాలో చూడగలమా? సంస్కృతం మీది ప్రేమతో, తెలుగును చంపాలనే కసితో తద్వారా తమకు తెలియకుండానే హిందూ మతాన్ని అంతమొందించేవారు కాస్త ఆలోచిస్తే మంచిదని మనసార ప్రార్థిస్తున్నాను. హిందూ మతం ప్రచారం చేసి కొత్త వారిని చేర్చుకునే మతం కాదు. ప్రపంచం లోని 200 దేశాల్లో హిందూమతం ఉన్నదే రెండు దేశాల్లో. అక్కడ కూడ చాల వేగంగా తగ్గిపోవడాన్ని గమనించమని వేడుకుంటున్నాను. నా మతం చచ్చేదాక నా తెలుగు తల్లిపై సంస్కృత దాడిని ఆపలేమా?

నేను మా అమ్మ కడుపులో పడినప్పుడు, మా అమ్మకు సీమంతం చేసినప్పుడు, నేను పుట్టినప్పుడు, నాకు జంధ్యం వేసినప్పుడు, నాకు పెండ్లి అయినప్పుడు, గుడికి పోయి దేవుడిని ప్రార్థించినప్పుడు, నేను చనిపోయినప్పుడు, నాకు శ్రాద్ధం పెట్టేటప్పుడు దేవునికి విన్నవించటానికి నా మాతృభాష తెలుగు పనికి రాదు అని తెలుగు వాడు అనుకోవటాన్ని భరించలేకున్నాను.

ఎదురు తిరిగిన తమిళులు

అమ్మ నుడి మీద అభిమానమున్న తమిళులు ఈ సంస్కృత పెత్తందారీతనానికి ఎదురు తిరిగారు. దేవుని పూజించటానికి తమిళం సరిపోతుంది అని తమిళులు పొగరుగా అనుకుంటారు. ప్రతి మంత్రాన్ని తమిళంలోకి మార్చారు. వైష్ణవులు తిరుప్పావై చదువుతారు; శైవులు తిరువెంబావై చదువుతారు. నాలాయిరం వారసత్వం ఎలాగూ ఉండనే ఉన్నది. అసలు మొదటి నుంచి తమిళంలో మాత్రమే ఉన్న మంత్రాలూ కొనసాగుతున్నవి. తిరుపతి వెంకన్న మేలుకొలుపు పాట “ కౌసల్యా సుప్రజా రామ...”ను కూడ తమిళంలోకి మార్చారు. వారు ఇప్పుడు దానినే పాడుతున్నారు అన్ని చోట్ల. విశాఖపట్నం, హైదరాబాద్, ఉయ్యూరులలో కూడ పెరుమాళ్ల పూజలు, మంత్రాలు తమిళంలో కొంత చేస్తున్నారు.

తెలుగుపై ఇతర భాషల దాడులు

ప్రాకృత, పాళీ భాషలు

౩౦తకు మునుపు మనము చూసినట్లుగానే, జైన బౌద్ధ మతాల రోజులలో ఈ భాషలు పెత్తనం చేశాయి. అధికార భాషలుగ, పుస్తకాల భాషలుగ చలామణీ అయ్యాయి. తెలుగు వారు కూడ తమ సాహిత్యమంతా ఆ భాషల్లోనే ఉండేట్లు చూశారు. అందువల్ల ఆ భాషల మాటలు కొన్ని తెలుగులోకి వచ్చాయి. అయితే ఈ మాటలను మనం వాడుకలో కొనసాగించవచ్చు. ఆ భాషలు ఇప్పుడు మృత భాషలయ్యాయి. ఇక వాటి నుంచి మనకు కొత్తగా వచ్చే ప్రమాదం లేదు. ఆ భాషలు మరియు తెలుగు మధ్య వైరుధ్యం లేదు.

ఉర్దూ, అరబ్బీ, పర్షియన్ భాషలు

నాలుగు వందల ఏండ్లు, ప్రత్యేకించి పూర్వ తెలంగాణ ప్రాంతంలో తెలుగుపై ఉర్దూ పెత్తనం ఎదురు లేకుండ సాగింది. చదువు ఆ భాషలో ఉండేది. అలా చదువుకున్నవారికే కొలువులు. జనంతో సంబంధాల కోసం ప్రభుత్వం ఉర్దూనే వాడేది. అందుకని తాసీల్దారు, జిల్లా, ఖరీఫ్, కిటికీ, కౌల్దారు, కుర్చీ, కలము, దస్తీ, దావత్, పహణీ లాంటి మాటలు తెలుగులోకి వచ్చి స్థిరపడిపోయాయి. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొత్త మాటల కోసం ఇప్పుడు ఎవరూ ఉర్దూ వైపు చూడటం లేదు. అందువల్ల ఆ మాటలను మనం కొనసాగించవచ్చు. ఇప్పుడు తెలుగు, ఉర్దూల మధ్య శత్రువైరుధ్యం లేదు. అంతకు ముందు నుంచీ కొన్ని అరబ్బీ, పర్షియన్ పదాలు తెలుగులోకి వచ్చాయి. కాని ఆ భాషలు ఇప్పుడు తెలుగు మీద పెత్తనం చేయటం లేదు.

కాకపోతే మంది భాషగ (lingua franca) మనం తెలుగును వరంగల్లు, హైదరాబాద్ లాంటి చోట్ల తేవటానికి చాల గట్టి ప్రయత్నమే చేయాలి. తెలుగులో

మాట్లాడటం నామోషీ అనుకునే స్థాయి నుంచి బయటకు రావాలి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక కొంతమంది తెలిసీ తెలియక ఉర్దూ మాటలు వాడితేనే మాది తెలంగాణ భాష అని పొరబడుతున్నారు. ఇప్పటికే తెలుగులో ఉన్న ఉర్దూ మాటలను వాడవచ్చు కాని ఇంకా కొత్తగా మాటలను తేవటం మాత్రం తెలుగు అంటే ఏహ్యతనే సూచిస్తుంది.

తనకు కొలువు కావాలని జాబు రాసిన తన చిన్నప్పటి పంతులుకి, ఔరంగజేబు రాసిన జాబు ఇలా సాగింది:

'నేను అరేబియన్ భాషను పూర్తిగ పట్టించుకోవాలని మీరనుకొన్నారు. పది పన్నెండు ఏండ్లు శ్రమిస్తే గాని ఆ భాషలో పరిపూర్ణత సాధించగలం. దాన్ని నేర్పడానికి మీరు నా సమయాన్ని శక్తి సామర్థ్యాలను వృధా చేశారు. ఒక రాకుమారుడు గొప్ప భాషావేత్త, మంచి వ్యాకరణవేత్త అవడం చాల గొప్పని మీరనుకొన్నారు. మాతృభాషను తన ప్రజల భాషను నేర్వకుండా ఇతర భాషల మీద పట్టు సాధించడం గౌరవప్రదం అవుతుందా? అరబ్బీ భాషను నేర్పడంలో నా విలువైన సమయాన్ని వృధా జేశారు. నా బాల్య జీవితంలో ఇదొక విషాదకర ఘట్టం. చట్టాలు, శాస్త్రాలు, ప్రార్థనలు అరబిక్ లో గాక మాతృభాషలో నేర్పకూడదా?' (ఆంధ్ర ప్రదేశ్ మార్చ్ 16)

దీని నుంచి మనం అమ్మ నుడి మీద అభిమానాన్ని తెలుసుకోవాలి.

యు హవ్ టు కల్టివేట్ టాకింగ్ ఇన్ తెలుగు, థింక్ ఇన్ తెలుగు.
అసలే మన భాష డయింగ్ అయ్యా!!

ఆంగ్లం

ఇంతకు ముందు ఇతర భాషల దాడి జరిగినా అది కొన్ని రంగాల వరకే పరిమితమై ఉండేది. సంస్కృతం ప్రమేయం సాహిత్యం, గుడుల వరకే. ఉర్దూ ప్రమేయం పాలన వరకే. నిత్యజీవితంలో తెలుగుకు తిరుగు ఉండేది కాదు. కట్టు బొట్టు, దుస్తులు, పండుగలలో తెలుగు వినపడేది, కనపడేది. తిండిలో తెలుగుతనం ఉండేది. వ్యవసాయంలో వృత్తి పనులలో వ్యాపారంలో సంగీతంలో నాటకాలలో ఇతర కళలలో పల్లెటూరి జీవితంలో తెలుగుకు తిరుగు లేకుండ ఉండటం వలన, తెలుగు మనుగడ సాగింది. కాని ఆంగ్లం ప్రమేయం అన్ని రంగాలలోకి వచ్చేసింది. బడిలో మొత్తంగా తెలుగును తొలిగించింది. చట్ట సభల్లో, న్యాయస్థానాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు మాట్లాడితే చిన్నతనంగా చూస్తున్నారు. అన్ని వృత్తి పనులలో, కట్టుబొట్టులో, దుస్తుల్లో, వ్యాపారంలో, తిండిలో తెలుగుతనం లేకుండ పోయింది. చదువురాని వాడి నుంచి కూడ, తెలుగును, సెల్ ఫోన్ తరిమేసింది. పల్లెటూరివాడు మాట్లాడినా వాక్యంలో సగం మాటలు ఆంగ్లపువే ఉంటున్నాయి. ప్రతి రోజు కొత్త మాటలు ఆంగ్లం నుంచి వస్తున్నాయి. రైలు, బస్సు లాంటి మాటలు తెలుగువై పోయాయి, వాటి కోసం ప్రత్యామ్నాయాలను చూడటం వెర్రితనం అని కొంత మంది అనే వరకు వచ్చింది పరిస్థితి. పైకి వారు ఆచరణవాదులుగ కనపడతారు కాని నిజానికి వారు తెలుగు ద్రోహులు. వారి మాటలలో నిజాయితీ ఉంటే, ఇక కొత్తగ ఆంగ్లం మాటలను రానీయకుండ వారు కృషి చేయాలి. ఆ ఆలోచనే ఉండదు వారికి.

ఇటువంటి పరిస్థితే ఫ్రెంచ్, జపనీస్, తమిళం భాషలకు కూడ ఎదురైంది. వారికి తల్లి నుడి మీద ప్రేమ ఉన్నది కాబట్టి పట్టుబట్టి ఆంగ్లం దెయ్యాన్ని దగ్గరకు రాకుండ తరుముతున్నారు. అందుకే ఆ భాషల మనుగడకు ముప్పు లేదు.

ఇప్పుడు నేరుగా తెలుగు మీద దాడి చేసే శత్రువు ఆంగ్లం. అందుకని తెలుగు, ఆంగ్లముల మధ్య శత్రు వైరుధ్యమే ఉన్నది. పట్టుబట్టి ప్రతి పదం దగ్గర పోరాడాల్సిందే. పాత ఆంగ్లం మాటలను సాగనంపాలి, కొత్త అవసరాలకు నిత్యం మాటలను కనిపెట్టే సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం మీద గట్టి ఒత్తిడి తేవాలి.

కన్నడ, ఒరియా, మరాఠీ వంటి పొరుగు భాషలు

కర్నాటక, ఒరిస్సా, మహారాష్ట్రలలో మొదట నుంచి ఉన్న తెలుగు వారు దాదాపు చనిపోయారు. వారు తెలుగును వదిలేసి ఆయా భాషలను పట్టుకున్నారు. ఈ నడుమ ఉద్యోగాలు చేయటానికి పోయిన తెలుగు వారి గురించి నేను మాట్లాడటం లేదు. వేల ఏండ్ల నుంచి అక్కడ ఉన్న తెలుగు వారు ఇప్పుడు తెలుగు వారుగ లేరు. దీనికి మొదటి కారణం – తెలుగు చెత్త భాష అనుకునే మన తత్వం; రెండవ కారణం – మన ప్రభుత్వాలు అక్కడి తెలుగు వారిని గురించి పట్టించుకోకపోవటం. శ్రీకాకుళం జిల్లాలోని ఒరియా

బడులలో పంతులు లేకపోతే ఒరిస్సా ముఖ్యమంత్రి గారు ఆరా తీస్తారు. మహారాష్ట్రలోని తమిళం బడులలో పంతులు లేకపోతే, పంతులును వేసే దాక కరుణానిధి ఊరుకునేవాడు కాడు. మూడవ కారణం – అక్కడి ప్రభుత్వాలకు తమ భాషల మీద ఉన్న గౌరవం, ఇతర భాషలను నెమ్మదిగా పంపించివేసే పనితనం. 4 ఏండ్ల క్రింద " కోలారు జిల్లాలో చివరి తెలుగు బడిని విజయవంతంగా మూసివేసాను." అని విద్యాశాఖ మంత్రి కర్నాటక శాసనసభలో సభ్యుల చప్పట్ల మధ్య ప్రకటించాడు.

ఏదేమైనా ఈ మూడు భాషలు ఇప్పుడు తెలుగు భాష మీద వేరే ఏ విష ప్రభావాన్ని చూపటం లేదు కాబట్టి వీటికి తెలుగుకు మధ్య శత్రు వైరుధ్యం లేదు అని మనం భావించాలి.

సంస్కురుతం

ఇది కొంచెం భావోద్వేగానికి సంబంధించిన విషయం. సంస్కృతాన్ని ఏ మాత్రం విమర్శించినా మనవారు తట్టుకోలేరు. అందుకని కొంచెం విపులంగానే ఉద్వేగాలకు అతీతంగా పరిశీలించాల్సిన విషయం ఇది.

మనం సంస్కురుతాన్ని ద్వేషించాల్సిన అవసరం ఉన్నదా?

మనం ఎట్టి పరిస్థితిలోను సంస్కురుతాన్ని ద్వేషించం, ద్వేషించ వలసిన అవసరం కూడ లేదు. సంస్కురుతం తప్పకుండ చాల మంచి భాష. మన దేశపు సంస్కురుతి, కళలు, చేరిన సాహిత్యపుటంచులు, వేలుపులను మొక్కే సంగతులు, వేదాంతం, నాట్యశాస్త్రం, ఆయుర్వేదం, వ్యాకరణం, హిందూమతపు ఆచారాలు అందులో పుష్కలంగ ఉన్నాయి. సంస్కురుతం లేకుండ భారతీయ సంస్కురుతినే ఊహించలేము. మనం దానిని నేర్చుకోవలిసిన అవసరం ఉన్నది. ఆ మాటలను కూడ అవసరమైనప్పుడు తెలుగు లోనికి తెచ్చుకోవడానికి వెనుకాడ వలసిన పని లేదు. సంస్కురుతం చాల ప్రమాణీకరించబడిన భాష. 5,000 ఏండ్ల క్రింద ఒక మాటను సంస్కురుతంలో ఎలా పలికారో ఇప్పుడూ అలానే పలుకుతారు. మిగిలిన ఏ భాషకూ ఆ పరిస్థితి లేదు. కాశ్మీరులో ఎలా పలుకుతారో కన్యాకుమారిలో కూడ అలానే పలుకుతారు. ఆదిలాబాదు తెలుగుకు మహబూబ్ నగర్ తెలుగుకు ఎంత తేడా ఉంటుందో మనకు తెలుసు. సంస్కురుతానికి ఈ లక్షణం ఉండబట్టే ఆ భాష మంత్రాలకు పనికి వస్తుంది.

బ్రిటిష్ మహారాణి మన పట్టణానికి వచ్చింది. ముఖంలో వర్చస్సు ఉన్నది, తెల్లగా ఉన్నది, తెలివితో ఉన్నది, ఆరోగ్యంగా ఉన్నది, అందంగా ఉన్నది. మంచి గుడ్డలు వేసుకొని వుంది. ఎన్నో విషయాలలో ఎంతో పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నది. మాటల చతురత వుంది. అదే సమయంలో ఇతరులకు ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇస్తున్నది వారి దగ్గర నుంచి అంత కన్న ఎక్కువ గౌరవాన్ని పొందుతున్నది. మీ అమ్మ అంత అందంగా ఉండదు,

ఆరోగ్యంగా లేదు, తెల్లగా లేదు, అంత విషయ పరిజ్ఞానం లేదు. కాని మీ కోసం తన ఆరోగ్యాన్ని, జీవితాన్ని, ప్రాణాన్ని సైతం పణంగా పెడుతుంది. అయినా మీరు మహారాణి కాళ్ళను పట్టుకొని దండం పెట్టి, ఇంటికి పోయి తల్లిని మీ కాలితో తంతారా?

సంస్కురుతం ఒక గొప్ప భాషే. కాని అది నా అమ్మ నుడి తెలుగును చంపుతూ ఉంటే చూస్తూ ఊరుకొనే సంస్కారం నాకు లేదు.

ఈ సందర్భంలో ఇంతకు ముందు చెప్పిన కొన్ని సంగతులను మళ్ళీ చెప్తున్నాను.

కష్టం అనే మాటకు తెలుగు మాటను చెప్పమంటే బాధ, ఆటంకం అనే ఇతర సంస్కురుతపు మాటలే గుర్తుకు వస్తాయి కాని తెలుగు మాటలు మనకు తెలిసినవే అయినా తట్టవు. ఈ నేల మీద ఇంకే భాషలో లేనన్ని మాటలు (కష్టమునకు సరి అయినవి) తెలుగులో ఉన్నాయి, అయినా తెలుగు తల్లి మనుగడ కష్టాల్లో పడింది. నాకు అంతగా తెలుగు పరిజ్ఞానం లేదు. అయినా నేను చూసినవే ఎన్ని మాటలు ఉన్నాయో చూడండి; ఇడుములు, ఇక్కట్లు, ఇబ్బందులు, పాట్లు, కడగండ్లు, తిప్పలు, తంటాలు, అగచాట్లు, అరిది, బిరుసు, ఎవ్వ, గొడదు, ఇమ్ముదప్పు, జటిలం, కరకరి, కసాలా, కస్తి, కటువు, కొడిమె, నిగ్గడి, పీడ, గడ్డు, కక్కస, బెడద, పోటు, కవుకులు, కడివి, ఎడరు, అలుగులము, అలజడి, అంకిలి, అంగద, అందెబిందెలు, కీడు, గండం, చిక్కు, చేటు, తెక్కలి, పాటు, (ప్రాణ)గొడ్డము, సేగి, దావంతము. ఇవి కాక కన్యాకుమారి నుంచి వింధ్య పర్వతాల దాక ఉన్న పల్లెల్లోకి వెళ్లి సేకరిస్తే ఇంకా చాల మాటలు దొరుకుతాయి. పాత పుస్తకాలలో కవులు రాసినవి, ఇప్పుడు వాడనివి ఇంకా ఎన్ని ఉన్నాయో పరిశోధకులు బయటకు తీస్తే తెలుగు ఎంత సుసంపన్నమైన భాషో అందరికి తెలిసి వస్తుంది.

అంటే కష్టం అనే పెర మాట వచ్చి ఎన్ని తెలుగు మాటలను చంపిందో చూడండి.

నా చిన్నతనంలో మా ఊర్లో ఇంద్రధనస్సును సింగిడి అనేవారు. కాని ఇప్పుడు ఆ మాట అక్కడ ఎవరికీ తెలియదు. వరద గుడి కూడ చచ్చిపోయింది.

నమస్కారం, నమస్తే అంటాం. కాని మన తెలుగు మాటను (దండం) వాడితే ఎదుటివాడు అసహ్యించుకొంటాడు. నమస్కారం వచ్చి ఎన్ని తెలుగు మాటలను విజయవంతంగా చంపేసిందో చూడండి: దండాలు, ఏటికోళ్ళు, మంగిడీలు, కైమోడ్పులు, జోదిళ్ళు, డింగిళ్ళు, నేరేడల్లులు, హణిగలు, జోబిళ్ళు, గిడిగిళ్ళు, తొంగలిపాట్లు, ఎరగుడు, ఒరిగ, కేలుమొగ్గ, కైచాల్పు, కొణిగె, కొలుపు, చాగిలింత, కేచాపు, చేమొగుపు, చేమోడ్పు, వెన్నెలకోలు, చేవిప్పు, చిన్ని వెన్నెల, మొక్కు, కొలుపు, బేడిస, మొకుడు, కోళిగి, నతులు.

కొంత మంది ఇతర భాషల నుంచి మాటలను తెచ్చుకుంటే తప్పేముంది అంటారు. ఆంగ్లం తెచ్చుకోలేదా అని కూడ అంటారు. సంస్కురుతం ఇతర భాషల నుంచి మాటలను తెచ్చుకుంటున్నదా? తన దగ్గర మాటలు ఉన్నప్పుడు ఇతర భాషల నుంచి మాటలను

తెచ్చుకొని తన మాటలను ఇంత భారీ ఎత్తున ఆంగ్లం చంపుకున్న ఉదాహరణలను ఇవ్వమంటే మొకం తేలేస్తారు. మనది పెదవాదం, పిడివాదం అంటూ నెమ్మదిగా తప్పుకుంటారు.

ఇలా కొన్ని పదుల వేల తెలుగు మాటలను సంస్కృతం మాటలు చంపేస్తున్నాయి.

తెలుగు మాటలు వాడితే లేకితనం, సంస్కృతం మాటలు వాడితే గొప్పతనం అనుకుంటున్నాము. పక్షి అంటే పెద్దది, పిట్ట అంటే చిన్నది. రెండు మాటలు ప తోనే మొదలు అవుతాయి, ముందు గురువు తరువాత లఘువు తోనే ఉంటాయి. పక్షి అన్న మాట ఉన్నచోటల్లా పిట్టను పెట్టవచ్చు. కాని మనం ఆ ఊహనే భరించలేము. పర్వతం అంటే గొప్ప; కొండ, మిట్ట, గుట్ట అంటే లోకువ. అందుకని వింధ్య కొండ అనకూడదు, మీ ఊర్లో ఉన్న గుట్టను పర్వతం అనకూడదు. గంగ ఏరు, గోదావరి వాగు, కృష్ణ వంక అనకూడదు. వైరా నది, కట్టెల నది అనకూడదు.

తెలుగునాట ప్రతి నిముషం తెలుగును పాతరేయటానికి ఆగని ప్రయత్నం కొనసాగుతూనే ఉంది.

పొద్దున్నే అన్ని తెలుగు టి. వి. లలో మతం పేరిట తెలుగు మీద దాడి మొదలౌతుంది. ప్రతి స్వామి నేరుగ విషయాన్ని తెలుగులో చెప్పడు. నిజంగ ఆయన ధ్యేయం మంచి విషయాన్ని చెప్పటమే అయితే దాన్నే తెలుగులో చెప్పవచ్చు, ఏ పుస్తకం నుంచి ఏ పాత్ర అలా చెప్పిందో చెప్పవచ్చు. కాని ఆయన మతంలోని మంచి విషయాలు చెప్పటానికి కాదు వచ్చింది. ఆ అవకాశం తీసుకొని తెలుగును తొక్కి వేయటమే ఆయన ధ్యేయం.

అందుకనే ముందు ఒక సంస్కృత శ్లోకంతో మొదలు పెడతాడు. అంతటితో వదిలి పెట్టడు. ప్రతి సంస్కృత మాటకు తెలుగు అర్థం చెప్పుతాడు. ఆయన ధ్యేయం మతం ముసుగులో సంస్కృతం నేర్పటం. నిజంగ ఆయనకు మతం మీద ప్రేమ ఉంటే, మతానికి సంబంధించిన విషయాలే అందరికి తెలిసిన తెలుగులో చెప్పాలి, లేదా మొత్తంగ సంస్కృతంలో చెప్పినా మనకు పేచీ లేదు. సంస్కృతంలో మొదలు పెట్టితేనే గొప్పతనం అని ఆయన చెప్పదలుచుకున్నాడు. మతం విషయాలను మాట్లాడటానికి, మొదలు పెట్టటానికి మరీను, తెలుగు పనికి రాని భాష అనే సంప్రదాయాన్ని సృష్టించారు.

అయితే ఈ మహానుభావులే వైదిక దేవుళ్ళను గురించి మాట్లాడుతూ ఆంగ్లం మాటలు, వాక్యాలను విపరీతంగ వాడుతున్నారు. వీరు చెప్పదలుచుకున్నదానిని మొత్తంగా తెలుగులో కాని సంస్కృతంలో కాని రెంటిల్లో కాని చెప్పలేము అని తేల్చేసుకున్నారు. తమకు ఆంగ్లం వచ్చు అని చెప్పటానికి కూడ 'ఈ అవకాశాన్ని వాడుకోవాలి' అనే దుర్బుద్ధి కూడ ఇందులో కొంత ఉన్నది. అయితే దాదాపు ఈ

స్వాములు అందరు ఎంత చెత్తగా ఆంగ్లాన్ని మాట్లాడుతారు అంటే వినటానికి చాల రోతగా ఉంటుంది.

మొత్తం మీద తెలుగు ప్రజలకు ప్రభుత్వాలు, పెద్దలు, పండితులు, పూజారులు, పురోహితులు చాల స్పష్టమైన సందేశం ఇచ్చారు: తెలుగు దేనికీ పనికి రాని భాష; అందులో మాట్లాడటం, చదవటం, రాయటం దండుగ.

అందుకని తెలుగువారు తెలుగులో మాట్లాడరు. తెలుగు సంస్కురుతికి దూరంగ ఉంటారు. 'మేము పందులము. మా భాష పందుల భాష. మా సంస్కురుతి పందుల సంస్కురుతి. మేము మురికి కాల్వలలో, పెంటలలో ఉండాల్సిన వారము.' అని తేల్చేసుకొని అలానే ప్రవర్తిస్తున్నారు. అందుకని వారికి ఇతరులు ఎవరూ గౌరవం ఇవ్వరు. ఈ ధోరణితో ఉన్నవారు, ఇంత న్యూనతభావం ఉన్నవారు నిజంగ ఉన్నత స్థాయికి పెరగ లేరు.

తమిళులకు నొబేల్ బహుమతులొచ్చాయి. బెంగాలీలకు వచ్చాయి. తెలుగు వారికి రాలేదు. వస్తాయి అనుకొంటున్నారా? 2000 ఏండ్ల తరువాత తమ దేశానికి తిరిగి వచ్చిన ఇస్రయేలీలు తమ భాషను పునరుద్ధరించుకొని అందులోనే చదువుకొంటూ, కొత్త మాటల అవసరం వచ్చినప్పుడు తమ అమ్మ నుడి నుంచే పుట్టించుకొంటూ ఎన్నో శాస్త్రాల్లో వింతలు సృష్టిస్తున్నారు. 700 కోట్ల ప్రపంచ జనాభాలో 70 లక్షలగా కూడ లేని యూదు మతస్తులు ప్రతి ఐదో నొబేల్ బహుమతిని పట్టేస్తున్నారు. వారికి స్వాభిమానం ఉంది, అమ్మ నుడి మీద అంతు లేని అభిమానం ఉంది కాబట్టే ఇది సాధ్యమౌతున్నది.

ప్రపంచ స్థాయి దాకా ఎందుకు? మన దేశంలో ఇచ్చే అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ఒక్క తెలుగువాడికైనా వచ్చిందా? ఎవరైనా మిమ్మల్ని సన్మానించాలని రోడ్ మీద వస్తుంటే 'మేము పందులం గదా' అని పెంట కాల్వలలోకి వెళ్ళి పందుల పక్కన పెంటల్లో పొర్లుతుంటే ఇక మీ దగ్గరకు వచ్చి దండలు వేసి పురస్కారాలు ఇస్తారా? అందుకనే ఒక్క తెలుగువారికి కూడ ఇవ్వలేదు. బెంగాల్ వారికి వచ్చింది. మహారాష్ట్ర వారికి వచ్చింది. కొంత అరాచకంగా ఉంటాయనుకొనే రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, బీహార్ వారలకు వచ్చింది. తమిళులకు 8 వచ్చాయి. కర్నాటక వారికి వచ్చాయి. అస్సాం, ఒరిస్సా లాంటి రాష్ట్రాలకు కూడ వచ్చాయి. మొత్తం మీద 48 మందికి ఇచ్చారు ఇప్పటి వరకు.

ఈ నేలమీద ఎక్కడా, సంస్కురుతం మీది మోజుతో, బడుల్లో సైతం తెలుగు నేర్పటం లేదు, ఇంత వరకు ఎప్పుడూ నేర్పలేదు.

అవును. మీరు ఏదైన తెలుగు వాచకం, ఏ తరగతిదైన, తీసి చూడండి. దానిలో ప్రతి పాఠం చివర ఆ పాఠంలో వచ్చిన సంస్కురుతం మాటలకు తెలుగు అర్థాలు ఉంటాయి.

ఒకటో తరగతి నుంచి తెలుగు పిల్లలకు సంస్కృతం నేర్పుతునే ఉంటారు. అమ్మ దగ్గర, వీధిలో, పొలాల్లో నేర్చుకొన్న తెలుగు మాటలే కాని కొత్తగ ఒక్క తెలుగు మాట కూడ బడిలో నేర్పకుండ జాగ్రత్త పడతారు. ఆ పొత్తాల కూర్పే తెలుగు నేర్పటానికి తయారు చేసినట్లుగ ఉండదు. సరి కదా, తెలుగును లేకుండ చేయటానికి పట్టుబట్టి రాసినట్లుంటుంది.

ఒక తరగతిలో కూడ మాట వరసకైన ఒక తెలుగు పుస్తకాన్నైన కనీసం ఉప వాచకంగానైన ఉంచరు. ఒక పాఠం కూడ తెలుగులో ఉండదు. ఎక్కడ పిల్లలు తెలుగు మాటలు నేర్చుకొంటారో, తెలుగులో ఇప్పటికే చచ్చిపోయిన మాటలు ఎక్కడ తిరిగి లేచి వస్తాయేమోనని ఈ పాఠ్య పుస్తకాల రచయితలకు బెంగ. తెలుగు పుస్తకాలు లేవా అంటే ఉన్నాయ్. నీతి పుస్తకాలు, కథల పుస్తకాలు, పాటలు, నాటకాలు, హరికథలు, శతకాలు, మంత్రాలు, గజళ్ళు, భక్తి కథలు... ఇలా పూర్తి వైవిధ్యంతో ఎన్నో పుస్తకాలు ఉన్నాయి. కాని వాటిని కావాలని అణగ దొక్కుతారు. నా చూపులో బడ్డ తెలుగు పుస్తకాలే ఎన్ని ఉన్నాయో చూడండి:

తెలుగు పొత్తములు

1. యయాతి చరిత్ర –పొన్నకంటి తెలగన
2. కవి జనరంజనము – ఆడిదము సూర కవి.
3. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణము – మరింగంటి సింగరాచార్యులు.
4. అచ్చ తెలుగు రామాయణం – కూచిమంచి తిమ్మ కవి.
5. శుద్ధాంధ్రోత్తర రామాయణం – కందుకూరి వీరేశలింగం పంతులు.
6. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన కుశ చరిత్రము – మచ్చ వెంకట కవి.
7. శుద్ధాంధ్ర నిర్వచన శతకంత రామాయణము – రాళ్ళబండి నాగభూషణం, వెంకటప్పయ్య.
8. శుద్ధాంధ్ర రామాయణ సంగ్రహం – నల్లంతిఘల్ తంయాల లక్ష్మీ నరసింహాచార్యులు.
9. అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య దాశరథి చరిత్రము – అబ్బరాజు హనుమంతరాయ శర్మ.
10. అభిజ్ఞాన శాకుంతలం అనువాదం – దాసు శ్రీరాములు.
11. రామ కత – నారు నాగానార్యుడు.

12. చిలువపడిగె రాణేని చరితము – మరింగంటి వెంకట నృసింహాచార్యులు.
13. అచ్చ తెలుగు భారవి – తిరుమామిడి రామస్వామి.
14. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం – కందుకూరి వీరేశలింగం పంతులు.
15. రసిక జన మనోరంజనము – కందుకూరి వీరేశలింగం పంతులు.
16. శుద్ధాంధ్ర భారత సంగ్రహం – కందుకూరి వీరేశలింగం పంతులు.
17. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిరూష్మ నిర్వచనైకాదశాక్షరి శాకుంతలం – శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి.
18. శృంగార శాకుంతలం – కేసిరాజు సీతారామయ్య.
19. శకుంతల – నారునాగానార్యుడు.
20. శుద్ధాంధ్ర మేఘ సందేశం – అడవి సాంబశివ రావు.
21. అచ్చాంధ్ర నిర్గద్య నిరోష్ఠ్య సారంగధర చరిత్రము – దేవులపల్లి నృసింహ శాస్త్రి.
22. సుమతి – గోపిశెట్టి రామచంద్ర నాయుడు.
23. శుద్ధాంధ్రనిర్వచన చంద్రహాస చరిత్రము –శలపాక వెంకట సూర్యప్రకాశ ప్రధాని.
24. శుద్ధాంధ్ర ఋతు సంహారము – ఆకుండి వ్యాస మూర్తి శాస్త్రి.
25. ఎరకువ మరకువ – పోతాప్రగడ కృష్ణమూర్తి.
26. కళావతీ పరిణయము – జయంతి భావనారాయణ.
27. అచ్చ తెలుగు ఋతు సంహారము – చింతపల్లి రామకృష్ణ శాస్త్రి.
28. నవరస తరంగిణి – ఆదిభట్ల నారాయణ దాసు.
29. ఉమరు కైయాము రుబాయతు – ఆదిభట్ల నారాయణ దాసు.
30. వెన్నెల పెండ్లి – నాగునాగనార్యుడు.
31. నీలాసుందరీ పరిణయము – కూచిమంచి తిమ్మకవి.
32. సర్వ మధురము – ములుగు పాపయారాధ్యుడు.
33. శుద్ధాంధ్రనిర్వచన రుక్మిణీ పరిణయము– వైఖరి సుందర రామయ్య.
34. శుద్ధాంధ్ర హరిశ్చంద్ర చరిత్రము – రాయవరపు గవర్రాజు.
35. సత్య విజయము – అయ్యనకోట పార్థసారథి శెట్టి.

36. శుద్ధాంధ్రనిర్వచన సత్యావివాహము – అష్టావధాని జంగా హనుమయ్య చౌదరి.
37. ఆనందోదయము – కవి సార్వభౌమ శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి.
38. అచ్చ తెలుగు కుబ్జా కృష్ణ విలాసము – నల్లంతిఘళ చక్రవర్తుల ఠంయాల లక్ష్మీ నృసింహాచార్యులు.
39. శుద్ధాంధ్రనిర్గద్య నిరోష్ఠ్య కేకయ రాజనందన చరిత్రము – నల్లంతిఘళ చక్రవర్తుల ఠంయాల లక్ష్మీ నృసింహాచార్యులు.
40. అచ్చ తెలుగు పార్వతీ పరిణయము – గురజాడ పూర్ణచంద్ర కవి.
41. నిరోష్ఠ్య నిర్వచన శుద్ధాంధ్ర హరిశ్చంద్రోపాఖ్యానము – పోతూరి కాశీపత్యావధాని.
42. అచ్చ తెలుగు మెచ్చుల పచ్చ్రముచ్చిలి – నారు నాగనార్యుడు.
43. మనువు పుట్టువు – నారు నాగనార్యుడు.
44. వన్నెల వాక – పోతాప్రగ్గడ కృష్ణమూర్తి.
45. నారాయణ స్వామి ఖండ కావ్యాలు – తి. ప. నారాయణ స్వామి.
46. తెలుగు పొలుపు – నిడుదవోలు వెంకట్రావు.
47. వేల్పు మాట – ఆదిభట్ల నారాయణ దాసు.
48. అచ్చ తెలుగు పలుకుబడి – ఆదిభట్ల నారాయణ దాసు.
49. మద్దు కత – మంగిపూడి వెంకట శర్మ.
50. భళిర కవి వేల్పు శతకము – వైదరసు అప్పయ కవి.
51. త్రిశిర గిరీశ శతకము – తి. శు. మురుగేశన్ పిళ్ళై.
52. చక్కట్ల దండ – దాసు శ్రీరాములు పంతులు.
53. జేజేల మేలువాని మేటి యింపునిట్ట – పోతాప్రగడ్డ కృష్ణమూర్తి.
54. వెన్నుని వేయి పేర్ల వినకరి – ఆదిభట్ల నారాయణ దాసు.
55. తల్లి విన్కి – ఆదిభట్ల నారాయణ దాసు.
56. వేల్పు వంద – ఆదిభట్ల నారాయణ దాసు.
57. మొక్కుబడి – ఆదిభట్ల నారాయణ దాసు.
58. నూరుగంటి – ఆదిభట్ల నారాయణ దాసు.
59. వ్యాస పీఠము – ఆదిభట్ల నారాయణ దాసు.

60. ప్రాదెనుగుకమ్మ – గిడుగు రామమూర్తి పంతులు.

61. అచ్చ తెలుగు అభిజ్ఞాన శాకుంతలము – దాసు శ్రీరాములు పంతులు.

62. గౌరమ్మ పెండ్లి – ఆదిభట్ల నారాయణ దాసు.

63. చౌడప్ప సీసములు – కవి చౌడప్ప.

64. శ్రీ వెంకటేశ్వరాంధ్రము – గణపవరపు వెంకట కవి.

65. ఆంధ్రనామ సంగ్రహము – పైడిపాటి లక్ష్మణ కవి.

66. ఆంధ్ర నామ శేషము – అడిదం సూర కవి.

67. ఆంధ్ర భాషార్ణవము – కోటి వెంకనార్యుడు.

68. దేశ్య నామార్థ కోశము – రామాయణం కృష్ణయమంత్రి

69. ఆంధ్ర పద పారిజాతము – ఓగిరాల జగన్నాథ కవి.

70. లక్ష్మీ నారాయణీయము – కొట్ర లక్ష్మీ నారాయణ శాస్త్రి.

71. మేల్ నుడి కడలి – మారేపల్లి రామచంద్ర శాస్త్రి.

72. సాంబ నిఘంటువు – కస్తూరి రంగ కవి.

73. దేశిపద నిఘంటువు – రాతరి పేరు తెలియదు.

74. వైకృత దీపిక – బహుజనపల్లి సీతారామాచార్యులు.

75. నన్నయ్య నుడులు – మారేపల్లి రామచంద్ర శాస్త్రి.

76. ఆంధ్ర పద నిదానము – తూము రామదాస కవి.

77. సీమ పలుకు వహి – ఆదిభట్ల నారాయణ దాసు.

78. ఆంధ్ర నామ సర్వస్వము – ముసునూరి వెంకట శాస్త్రి.

79. సీమ పలుకు వహి – ఆదిభట్ల నారాయణ దాసు. (నిఘంటువు)

80. కుమారసంభవం – ఆత్రేయపురపు పాండురంగ విఠలప్రసాద్.

81. అన్న శతకం — గురు సహస్రావధాని, డా. కడిమిళ్ళ వరప్రసాద్.

ఇవి నా దృష్టికి వచ్చినవే. ఈ తెలుగు పొత్తాలలో చాల వైవిధ్యం ఉంది. వీటిలో ఖండ కావ్యాలు, శతకాలు, వ్యాసాలు, కథలు, నిఘంటువులు, నాటకాలు, శృంగార కావ్యాలు, రుబాయిలు, సహస్రనామాలు వెలువడ్డాయి. చాల తేలిక పుస్తకాల నుంచి గొట్టు పుస్తకాల వరకు ఉన్నాయి.

ఆదిభట్ల నారాయణ దాసు గారు తమ రచనలతో తెలుగుకు వైదిక భాషాత్వాన్ని కలుగజేశారు. ఆయనను ప్రోత్సహించి ఆయన దృష్టికి తెచ్చి ఉంటే పూర్తిగ తెలుగు మంత్రాలు కూడ చేసి ఉండేవారు.

తెలుగు పొత్తాలపై సరైన అభిప్రాయం లేకపోవడానికి కారణం " పటన పాటనాల్లో లేక పోవటం" అంటారు డా. కె. వి. సుందరాచార్యులు గారు.

ఎవరిని అయినా మాట్లాడమంటే ఒక సంస్కురుత శ్లోకంతో మొదలు పెడతారు. టి.వి.లలో మీరు పొద్దున్నే వచ్చే భక్తి కార్యక్రమాలను కూడ చూడండి. వారు మొత్తంగా సంస్కురుతంలో మాట్లాడినా తప్పు లేదు. కాని తెలుగులో మాట్లాడుతూ వేరే భాషను ఎందుకు వాడాలి? తమకు సంస్కురుతం వచ్చు అనే గొప్పతనం చాటుకోవటానికి అలా చేస్తారు. అంతటితో ఊరుకొంటారా? శ్లోకం లోని ఒక్కొక్క మాటకు తెలుగులో అర్థం చెప్పుతూ, వినే చవటలకు సంస్కురుతాన్ని నేర్పే అవకాశం వచ్చినందుకు పొంగిపోతుంటారు.

'సువర్ణ భూమి' అనే సంస్థ ఇండ్ల చోట్లు అమ్ముకొని బతుకుతుంది. తన టి.వి. ప్రకటనలకు బాలసుబ్రహ్మణ్యం గారిని ఎన్నుకొన్నది. అక్కడ కూడ తెలుగును తొక్కేయటం ఒక కార్యక్రమంగ పెట్టుకొంది. మా చోట్లు మంచివి అని తెలుగులో అమ్ముకోవచ్చు, సంస్కురుతంలో అమ్ముకోవచ్చు, లేక వారికి తోచిన భాషలో అమ్ముకోవచ్చు. కాని అలా చేయరు. తెలుగులో ప్రకటన ఇస్తూ, ఒక సంస్కురుత శ్లోకంతో మొదలుపెడతారు. అంతటితో ఆగరు. అందులోని ప్రతి మాటకు తెలుగు అర్థం చెప్పి సంస్కురుతం నేర్పటానికి పాటు పడతారు. నేరుగ చెప్పేదేదో, అందరికి తెలిసే తెలుగులో చెప్పి మిడక వచ్చు కద.

గొప్ప తెలుగు ప్రేమికుడు కీ. శే. కొండేపూడి సుబ్బారావు గారు తెలుగు భాషలోని వివిధ ప్రక్రియలలో నిష్ణాతులు. సొంతగా ప్రసన్న భారతి అని ఒక పత్రికను 26 ఏండ్ల క్రింద స్థాపించి తెలుగు సేవలో పునీతులయ్యారు. వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న వారి కొడుకు శ్రీ సర్వేశ్వర ప్రసాద్ గారు అదే సంప్రదాయాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. తెలుగుతల్లి సేవలో ఏక వీరుడిలా విశాఖపట్నంలో పనిచేస్తూ ప్రతి సంవత్సరం ఎన్నో సాహిత్య ప్రక్రియలలో పోటీలు పెట్టి లక్షల రూపాయలలో ఖర్చు చేస్తుంటారు. ఈ నేల మీద పూర్తి కాలం తెలుగు కోసం పని చేస్తున్న ఒకే ఒక మనిషి స. వెం. రమేశ్ అభిప్రాయాల మీద వీరు మంచి మెచ్చుకోలు వ్యాసం కూడ రాసారు. వారి పత్రిక ముఖ చిత్రాన్ని ప్రక్క పుటలో చూడండి. అందులో ఒక్క తెలుగు మాటైనా ఉందా? బజారులో నిలబడి, వెళ్తున్న 100 మందిని అడిగితే ఇద్దరు అయినా ఆ సంస్కురుత వాక్యానికి అర్థం చెప్పగలరా? మరి ఎవరి కోసం ఆ ముఖ చిత్రం? తెలుగుకు సేవ

చేస్తున్నాము అనుకుంటూనే దాదాపు ప్రతి తెలుగువాడు సంస్కురుతం సేవ చేసే మాయలో పడ్డాడు.

'బాలమిత్ర' మాస పత్రికను తీసుకొని చూడండి. నిజానికి అది పిల్లల కోసం తీసుకవస్తున్న పత్రిక. అక్కడ కూడ సంస్కురుతం నేర్పటానికి గట్టి ప్రయత్నం జరుగుతున్నది. అందులో కూడ ఒక్క కొత్త తెలుగు మాటను సైతం నేర్పరు, కనీసం వాడరు. కాని తప్పకుండ సంస్కురుత శ్లోకాలను ఇస్తారు, ప్రతిపదార్థాన్ని ఇస్తారు. కొన్ని అయినా పెర మాటలను బలవంతంగ నేర్పటానికి పాటు పడతారు. అదే ధోరణి ఇతర పిల్లల, పెద్దల పత్రికలలో కూడ కనపడుతుంది.

వెయ్యి ఏండ్ల నుంచి తెలుగులో రాస్తున్నట్లు, మాట్లాడుతున్నట్లు నటించి, సంస్కురుతం భాష ద్వార తెలుగును లేకుండ చేయటానికే పాటు పడ్డారు తప్ప తెలుగును నేర్పడానికి, పెంపుదల చేయడానికి ఏ బడి, ఏ పండితుడు, ఏ పంతులు పాటు పడలేదు.

ఇంత జేసి, ఏమైన సంస్కృతం నుడినైన ఎవరికైన నేర్ప గలిగారా అంటే, అదీ లేదు. తమదైన జీవితంలో, ఉన్నత పాఠ్యాంశాల్లో పనికొచ్చే సంస్కురుతం వచ్చా అంటే అదీ లేదు. ఏ న్యూక్లియర్ ఫిజిక్సో, రాకెట్ సైన్సో కాదు, ఏ సంస్కృతం పండితుడు అయినా తన ఆలి దగ్గరకు వెళ్లి, 'ఇవ్వాళ నాకు చింత చిగురు కూర, బెండ కాయ వేపుదు, వంకాయ ఇగురు, పచ్చి పులుసు చేసి పెట్టు' అని సంస్కురుతంలో చెప్పగలిగితే నేను లక్ష రూపాయల కానుకను ఇస్తాను.

సంస్కురుతంలో క్రియలకు లింగభేదం లేదు. వదతి= చెబుతున్నాడు/న్నది. మిలతి= కలియుచున్నాడు/న్నది.



తెలుగును సంస్కురుతంతో చంపే పథకంలో భాగంగ ఇంటర్మీడియట్‌లో తెలుగు బదులు సంస్కురుతాన్ని ఒక భాషగ తీసుకోవటాన్ని ప్రోత్సహిస్తున్నారు. రెండేండ్ల చదువు తరువాత కనీసం ఒక వాక్యాన్ని సరిగా రాయలేకపోయినా 99% మార్కులను వేస్తారు. **ఈ నీచమైన కుట్ర ఇంత బహిరంగంగ జరుగుతున్నా ఒక్క తెలుగు రచయిత కూడ దీని మీద నిరసన చెప్పడు.**

పెద్ద పత్రికలలో కూడ కొత్త ఆంగ్లం మాటలకు తెలుగు మాటలు కనిపెట్టాం అనుకుంటూ రాసే మాటలను చూడండి– అవి కూడ తెలుగు మాటలు కావు. సంస్కురుతం కొత్తగా ముస్తాబై మనకు కనపడుతుంది. ఆ భాగ్యానికి ఆంగ్లం మాటలను వాడితేనే పోలా? తరువాత పై చదువులలోనైనా పనికి వస్తాయి.

బాలల తెలుగు మాసపత్రికల్లో కూడ ముందుగా ఒక పుటలో రెండు మూడు శ్లోకాలను ఇచ్చి ఒక్కొక్క మాటకు తెలుగు అర్థాలను ఇవ్వటం ఎంత అన్యాయం! దీనికంతటికీ మూల కారణం: తెలుగు చెత్త భాష, అందులో కొత్త మాటలను తయారు చేయకూడదు, అరువు తెచ్చుకోవాల్సిందే అని మన నరనరాల్లో జీర్ణించుకొనిపోయిన తెలుగు వ్యతిరేకత. తెలుగుకు సంస్కురుతానికి మధ్య ఉన్నది శత్రు వైరుధ్యమే అని సంస్క్రుతాన్ని ప్రేమించే వారు అనుకుంటున్నారు.

ఇదంతా చదివి నేను సంస్కురుత ద్వేషిని అనుకుంటే పొరపాటే. నేను సంస్కురుతం కొంత నేర్చుకొంటున్నాను. ఆ భాష లేకుండ, మన భారతీయ సంస్కురుతి, సాహిత్యం, కళలు, నాట్యం, యోగ, ఆయుర్వేదం మొదలైన వాటిని ఊహించలేము అని మరోసారి చెప్పుతున్నాను. అది ఒక గొప్ప భాష కూడ. ఆ మేరకు సంస్క్రుతాన్ని అందరూ గౌరవిస్తారు, గౌరవించాలి కూడ.

1936 మార్చ్ 7న కృష్ణా పత్రికలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి తెలుగు భాష కోసం తపించి పోయే మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు ఓ జాబు రాస్తూ "... మొదట కొన్ని వేల సంవత్సరములు సంస్కృతం తెలుగు నెత్తి మీద కూర్చుని తన యాధిపత్యమును సాగించింది" అని అన్నారు.

తిక్కన సోమయాజి, పాల్కురికి సోమనాథుడు, ఆదిభట్ల నారాయణ దాసు, పొన్నగంటి తెలగానార్యుడు, మారేపల్లి రామచంద్ర శాస్త్రి గారలు మనకు దారి చూపే గురువులు.

మనం సంస్కురుతాన్ని ద్వేషించం. ఆ అవసరం మనకు లేదు. తప్పనిసరి అయినప్పుడు ఆ నుడి మాటలను కూడ మనం తీసుకుంటాము; ఇప్పటికే ఉన్నవాటిని కొన్ని చోట్ల వాడతాము. కాని సంస్కురుతం మాటలు వాడితేనే గొప్పతనం అనే సంస్కురుతిని వ్యతిరేకిస్తాము.

తెలుగు మాటలు చచ్చిపోతున్నాయి. తెలిసినా మాట్లాడటం మోటు అయిపోయింది. సంస్కృత పద భూయిష్టం కాని తెలుగును మాట్లాడితే దద్దమ్మ అని అనుకొనే రోజులొచ్చాయి. తనకు తాను గౌరవంగా చూసుకోని జాతిని బయటి వారు ఎందుకు గౌరవిస్తారు? మనం ఎలాగు పనికి రాము అన్నట్లుగ ఈ నడుమ తెలుగు మేధావులమనుకొనే వారు కొంత మంది ౨౦౦ ఏండ్ల క్రింది ఒక మహారాష్ట్రీయుడికి భారత రత్న ఇవ్వమని కోరారు. ఇంత ఆత్మ న్యూనత భావం గల జనం తెలుగు వారిలో ఉన్నారు! తెలుగు వారికి ఇవ్వాలని అందరు కలిసి ఎప్పుడైనా అడిగారా?

"తెలుగును సంస్కృతం నుండి విడదీయవలసినదని, ఈనాడు తెలుగు వారు పట్టుదలతో కోరుచున్నారు. కోరదగిన, కోరవలసిన కోరిక అది. కాని తెనుగు జాడదప్పిన తన పదముల పాటును వడిగా చక్కదీసికొని ఒంటి మెయి నిలువజాలిన గాని సంస్కృతం చుట్టరికము నుండి విడివడజాలదు. ఈ గుట్టును మనమున బెట్టుకొని నేటి కవి కుమారులు వెంకట శర్మ కవి వలెనే తెనుగుదనముతో నొప్పులొలుకు తెలుగు పుస్తకములు రచియించి తెలుగు తల్లి నలంకరించి ఆమె బానిసతనమును రూపుమాపవలెను'' – గన్నవరపు సుబ్బరామయ్య (1933 లో)

తమిళం

1920ల్లో ద్రవిడ కజగం, కన్యాకుమారి దగ్గర ఉన్న మూడు జిల్లాలతో, తమకు తమిళనాడు కావాలని కోరింది. లేకపోతే తెలుగు పెత్తనం కింద తమిళం నలిగిపోతుంది అని భయపడింది. మద్రాసు రాష్ట్రం 1920ల్లో మొదలైనప్పటి నుంచి తెలుగు వారే ప్రధాన మంత్రులుగా (ఒక్కరు మినహాయించి) అయ్యారు. (వారిని ప్రధాన మంత్రులు అనే వారు.) వ్యవసాయంలో, పరిశ్రమల్లో, సంగీతంలో తెలుగే వెలిగేది. కొన్ని స్వార్థ కారణాల వల్ల కొంత మంది "ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలి" అని ఆంధ్రులకు తీరని అన్యాయం చేశారు. 42%గా ఉన్న తెలుగు వారిని 36%గా ఉన్న తమిళ తోడేళ్ళకు వదిలేసి వచ్చారు. వెంబడే వారు రంగం లోనికి దిగి ఇది తమిళ నాడు, వేరే భారతీయ భాషలు ఉండటానికే వీలు లేదని తెలుగును వినపడకుండ, కనపడకుండ చేయగలిగారు. బాగ దక్షిణాన ఉన్న కోయంబత్తూరులో 1953లో మన వారు ఇంట బయట కూడ తెలుగే మాట్లాడే వారు. తమిళులు కూడ వీధిలోకి వస్తే తెలుగే మాట్లాడేవారు. 30 ఏండ్ల క్రితం ఇంట్లో తెలుగు, బయట తమిళంగా పరిస్థితి మారింది. ఇప్పుడు తెలుగు వారి ఇంట్లో, బయటా తమిళమే వినబడుతున్నది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అక్కడి తెలుగు వారి కోసం ఏమీ చేయలేదు. తెలుగు కోసం ఏర్పడింది అన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూడ తెలుగు కోసం ఏమీ చేయకపోగా తెలుగును అంతమొందించటానికి కావలసిన

అన్ని చర్యలను తీసుకున్నారు.

2016 సెప్టెంబర్ భవన్స్ జర్నల్ (ఆంగ్ల పక్ష పత్రిక) లోని పుటలు 12, 19, 22, 35, 73 లలో తిరుక్కురళ్ లోని మేలి మాటలను తమిళంలో ఉదహరించారు. అలా మనం వేమన లేక ఇతరుల తెలుగు మేలి మాటలను ఆ పత్రికలో ఎన్నటికైన చూడగలమా?

తమిళనాడులో తెలుగు ఊర్ల పేర్లను పట్టుబట్టి మార్చారు. జనాభా లెక్కలలో తెలుగు వారు ఇంటిపేరును చెప్పినా రాయరు. తమిళులకు, కన్నడిగులకు ఇంటి పేర్లు ఉండవు. ఇంటి పేరు ఉంటే తెలుగు వారుగ కొనసాగుతారని వారు గమనించారు. పేరు, తండ్రి పేరు, ఇంటి పేరు చెప్పితే మీ అమ్మకు ఇద్దరు మొగుళ్లా! అని గేలి చేసేవారు. తెలుగు వారిని గురించి ఉన్న చరిత్ర పాఠాలను తుడిచివేసారు. కట్టబ్రహ్మన పేరు వినపడనివ్వరు. తమిళనాడు లోని అధికసంఖ్యాకులుగా ఉన్న తెలుగు వారిని మొత్తంగా మట్టుపెట్టిన తమిళ తోడేళ్ళు ఎంత తేలికగ తమిళాన్ని పెంచుకోవచ్చో రుచి మరిగాయి. రెట్టించిన ఉత్సాహంతో విదేశాలలో ఉన్న తెలుగు వారిపై పడ్డారు.

తమిళనాడులోని తెలుగు ఉద్యమకారుడు వసంత్, అమేరికలో ఉన్న తన అన్నతో ఈ విషయమై చర్చించాడు. అతడు అమేరిక లోని తన తోటి తెలుగు ఇంజనీరుతో ఈ విషయమై తెలుగులో మాట్లాడాడు. పక్కనే ఉన్న తమిళుడు మీరు అమేరికలో తెలుగులో మాట్లాడకూడదు అని గట్టిగా మందలించాడు. అసలు అక్కడ ఉన్న తమిళనాటి ఇంజనీర్లలో తెలుగు వారే ఎక్కువ. కాని మన తెలుగువారు కూడ వారితో తెలుగులో మాట్లాడరు. సరి కదా, వారి తెలుగును హీనంగా చూస్తారు. దానికి కారణం: తమిళనాటి తెలుగు వారు తెలుగులో మాట్లాడతారు, మన వారు సంకర తెలుగులో మాత్రమే మాట్లాడగలరు.

సింహళంలోని భాష శాస్త్రజ్ఞులే అక్కడి మూడు ఆదిమ మానవ జాతుల్లో తెలుగు జాతులే రెండు అని తేల్చారు. వారు ఇప్పటికీ తెలుగు మాట్లాడుతున్నారు. స వెం రమేశ్ గారు అక్కడికి వెళ్లి వారిని తెలుగులో పలకరించినప్పుడు వారు చాల సంబరపడ్డారు. మనకొక రాష్ట్రమున్నదా అని విస్తుపోయారు. ఒక సారి చూపించమని వేడుకున్నారు. తమకు తెలుగు నేర్పకుండ తమిళులు పన్నిన పన్నాగాల గురించి చెప్పారు. తరువాత వచ్చిన వారిలో కూడ తెలుగు వారే ఎక్కువగా వచ్చినా (తెలుగు ప్రాంతం నుంచి వచ్చిన వారే కాక ఇప్పటి తమిళనాటి ప్రాంతం నుంచి కూడ ఎక్కువ మంది తెలుగు వారే వెళ్ళారు.) తమిళులు తప్ప తెలుగు వారు ఎవ్వరూ లేరని ప్రభుత్వానికి హెచ్చరిక ఇచ్చారు. అక్కడొక రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడుతూ మీ ఇంటి పేరేమిటి అంటే ఆయన అప్రయత్నంగా చెప్పేసి, తను నోరు జారిన సంగతిని గమనించి రమేశ్ గారిని ఈ సంగతి ఎవరికీ చెప్పవద్దు అని ఆయన బ్రతిమిలాడాడు. తను తెలుగు వాడిగా బయటపడితే ఇక

రాజకీయ జీవితమే కాక, వ్యాపార సాంఘిక కార్యక్రమాల్లో తనను వెలివేస్తారు మరి. ఉత్తర సింహళం లోని ఒక స్టేషన్ మాస్టరును రైలు ఎన్నింటికి అని తెలుగు, సింహళం, ఆంగ్ల భాషలలో రమేశ్ గారు అడిగితే అతను నోరే విప్పడే. తమిళంలో అడిగితే గాని బయటపడలేదు. ఇప్పుడు తమిళులు అక్కడ తమిళ దేశమే కావాలని పోరాడుతున్నారు.

రమేశ్ గారు సింహళాన్ని నేర్చుకొని తెలుగును నేర్పడానికి ఆ భాషలో పుస్తకం రాసారు. అక్కడ పంచారు. మొదటి విడతగా 20 మందిని ఇక్కడకు తెప్పించి తెలుగు నేర్పటానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మలేసియాలోని తెలుగు వారిని కూడ అక్కడి తమిళులు తుడిచిపెట్టుతున్నారు. ప్రభుత్వానికి తెలుగు వారే లేరని నమ్మబలుకుతున్నారు, బడులు లేకుండ చేశారు. తమిళ అమ్మాయి కాని అబ్బాయి కాని తెలుగు మనిషిని పెండ్లాడితే ఇంట్లో పిల్లలు తమిళమే మాట్లాడేట్లు జాగ్రత్త పడతారు. ఈ విషయాలను మలేసియా శ్రీరాములు గారు దాదాపు ఏడ్చుకుంటూ చెప్పారు.

ఆంగ్లేయులు మనలను పాలించిన రోజులలో మారిషస్‌లోని తోటలలో పని చేయటానికి తమిళుల కన్న తెలుగు వారే ఎక్కువ మంది పోయారు. తెలుగు వారు తెలుగుకు దూరమయ్యారు. తమిళులు తమ తల్లి నుడిని నిలబెట్టుకొన్నారు. ఇప్పుడు మలేసియా, సింగపూర్, మారిషస్ లాంటి దేశాల్లో తమిళం అధికార భాష అయినది, తెలుగు తుడిచిపెట్టుకపోతున్నది.

తమ భాషను చెత్త భాష అని తెలుగు వారు అనుకుంటున్నారు కాబట్టి తెలుగు అంతరించిపోతున్నది అని తెలుసుకున్న తమిళులు తెలుగు రాష్ట్రాలను కూడ తమిళ రాష్ట్రాలగా మార్చటానికి ఉద్యమించారు. ముందుగ తమిళాన్ని ఇక్కడి గుడి భాషగా చేయటానికి నిశ్చయించుకున్నారు. దానికి వారు ఏజెంట్లను నియమించుకున్నారు. ముందుగా తమిళ పాశురాలను ఆదిలాబాదు నుంచి నెల్లూరు దాక అందరు స్త్రీలు పాడేట్లు చేస్తున్నారు. షంషాబాదు దగ్గరిలోని ఒక పెద్ద వైష్ణవ గుడికి ఒక సారి వెళ్లాను. రోజుకొకటి చొప్పున గోదాదేవి పాడిన పాటను గంటల కొద్దీ నేర్పుతున్నారు. ముందుగా పాటను పాడిస్తారు. తరువాత ఒక్కొక్క మాటను వివరంగా చెప్పుతూ తమిళాన్ని నేర్పుతున్నారు. అక్కడికి తమిళులు వస్తే తమిళంలో చెప్పటంలో తప్పు లేదు. తెలుగు వారు వచ్చినప్పుడు తెలుగు పాశురాలను వినిపించాలి వారిలో నిజంగా భక్తిని మాత్రమే బోధించాలి అని వారు అనుకొంటే. కాని ఇక్కడ తమిళం నేర్పటమే ముఖ్యం కాబట్టి వారు తమిళం పాశురాలనే పాడించి, తమిళం నేర్పుతున్నారు.

తిరుపతిలో కూడ తమిళమే రాజ్యం ఏలుతున్నది. బ్రహ్మోత్సవాలలో, వేద పండితులు నాలాయిరం (ఆళ్వారులు తమిళంలో రాసిన వైష్ణవ మంత్రాలు) చదువుతూ

ఊరేగింపులో పాల్గొంటారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం లాంటి వేడుకలు చేస్తుంటారు. ప్రతి చోట మనకు తెలియని తమిళం మాటలను తెలుగులో రాస్తారు. అన్ని పలకల్లో తమిళం తప్పకుండ ఉంటుంది. తమిళనాడులోని ఒక్క గుడిలో కూడ పొరపాటున కూడ తెలుగు కనపడదు.

తెలుగు వారికి మురుగన్ దేవుడు కాడు. వారు మన కోసం పేరు మార్చి సుబ్రహ్మణ్యస్వామి అని పెట్టి ఇక్కడ విజయవంతంగా గుడులను పెట్టారు. బెజవాడ ఇంద్ర కీలాద్రి మీదున్న కనకదుర్గ ప్రాభవాన్ని తగ్గించాలని కిందనే శ్రీ వల్లీ దేవయాని (తెలుగువారికి ఎవరికైనా ఈ దేవతలు తెలుసా?) సమేత సుబ్రహ్మణ్య స్వామిని ప్రతిష్ఠించారు. ఇక అక్కడ చేసే వేడుకలు చూడండి: స్కంధషష్ఠి, దేవయాని కల్యాణం, ఫన్గుణి ఉత్తిరమ్, పడి ఉత్సవం, ధాయిపూసం, కావడి. హైదరాబాద్ గుడులలో చేసే పండుగలు ఇవి అని కరపత్రాలలో కూడ ఇలా కొట్టిస్తారు: కొత్త సంవత్సరం — నాయగనాయ్, గోదా దర్శనం– ఉన్దుమదగళ్ఇత్త, నేత్ర దర్శనం — అంగళ్ మాన్, తొండరడిప్పొడి యాళ్వార్ తిరు, దీపోత్సవం– అను ఇవ్వులగం, పాయసోత్సవం– కూడారై.

విశాఖలో ఒక తమిళ అధికారి తిరువళ్ళువర్ ఇసుక బొమ్మను కడలి అంచున పెట్టిస్తాడు. తమిళనాట నన్నయ లేక పాల్కురికి బొమ్మను అలా ఊహించగలమా?

వేలుపులను పొగడుతూ తమిళంలో కొంత మంది పాటలను రాశారు. వారిని ఆళ్వారులు అంటారు. తెలుగునాట వీరి విగ్రహాలను కూడ గుడులలో పెట్టి దేవతలకు చేసే పూజలనే వీరికి కూడ చేయిస్తున్నారు. అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగరాజులు మాత్రం కనపడరు. హైదరాబాదులో, విశాఖపట్నంలో, ఉయ్యూరు గుడులలో తమిళంలో దేవుడిని కొలవటం నేను చూశాను. బర్మాలోని తెలుగు వారి పెండ్లిలో తమిళం మంత్రాలు చదువుతారు. ఇక్కడి రాష్ట్రాలు కాక 18 ఇతర దేశాల్లో తమిళం కోసం తమిళనాటి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయి.

వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలలో మా చిన్నప్పుడు 'గుట్టకు వెళ్లి వచ్చాము' అంటే యాదగిరి గుట్టలోని దేవుడి దగ్గరకు వెళ్లి వచ్చాము అని అర్థం. అక్కడ గుట్ట అని తెలుగు మాట కనపడటం వీరికి ఏవగింపుగా ఉన్నది. అందుకని దానిని యాదాద్రిగ మార్పించారు.

యాత్రికులు అని మనం అంటే యాత్రిగళ్ అని తమిళంలో అంటారు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అన్ని రైల్వే స్టేషన్లలో యాత్రిగళ్ అనే అంటున్నారు. అందుకని తమిళానికి, తెలుగుకు మధ్య శత్రువైరుధ్యమే అని అనుకోవాలి.

హిందీ

కేంద్ర ప్రభుత్వం కావాలని హిందీని బలవంతంగా రుద్దుతున్నది. ప్రతి బ్యాంకులో, కేంద్ర కార్యాలయంలో రోజుకు రెండు కొత్త హిందీ మాటలు నేర్పుతుంటారు. పరాయి రాష్ట్రాలలోని సైన్య విభాగంలో చేరినా, కేంద్ర కార్యాలయాలలో చేరినా తెలుగు వాడు అంతటితో తెలుగు తల్లికి దూరమౌతాడు. అతని పిల్లలు హిందీ పిల్లలు అవుతారు. తమిళులు అటువంటి పరిస్థితులలో కూడ తమ తల్లికి ద్రోహం చేయరు. నాకు తెలిసిన పరాయి రాష్ట్రంలో ఉద్యోగం చేసిన పెద్దమనిషికి ఒక కొడుకు ఉన్నాడు. అతడు తెలుగు అమ్మాయినే చేసుకున్నాడు. తను అమేరిక వెళ్ళాక కొడుకు పుడితే పిల్లాడికి హిందీ నేర్పిస్తున్నాడు పట్టుబట్టి. నేను అడిగితే, “ తెలుగు దండుగమారి భాష అంకుల్” అని అన్నాడు.

స్వాతంత్రం రాక ముందు నుంచి కూడ మన వారిలో హిందీ మోజు ఉన్నది. దక్షిణ భారత హిందీ ప్రచార సభ ద్వారా హిందీ నేర్చుకునే వారిలో తెలుగు వారే అత్యధికం. హిందీ సినిమాలు చూడటం గొప్ప. హైదరాబాద్‌లో హిందీ సినిమాలే ఎక్కువ వసూళ్ళు చేస్తాయి. ఉత్తరాదిన హిందీ వారు తెలుగు సినిమాలనే చూడరు. మనకు హిందీ పాటలు పాడటం, వినటం గొప్ప. మన వేడుకలలో ఆ పాటలు ప్రముఖంగా ఉంటాయి.

త్రిభాష సూత్రం ప్రకారం మనం ఇక్కడి బడిలో తెలుగును తప్పనిసరి చేయము కాని హిందీని తప్పనిసరిగా నేర్పుతాము. మనకు దక్షిణాన తమిళనాడులో త్రిభాష సూత్రం లేదు; ఉత్తరాన మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో లేదు. కాని మధ్యనున్న మన వెర్రి మొగాలకు మాత్రం అది శిరోధార్యం. హిందీ వారు తమ భాషకు, తెలుగుకు మధ్య శత్రు వైరుధ్యం ఉన్నదని భావిస్తారు. తెలుగు కనుమరుగు అయ్యే భాష కాబట్టి దాని స్థానాన్ని ఆక్రమించాలని పట్టుదలతో ఉన్నారు.

ఇప్పుడేం జెయ్యాలి?

గుడి, బడి, ఏలుబడి, రాబడి, పలుకుబడి రంగాల్లో తెలుగు రాణించాలి, పనికిరావాలి.

గుడిలో తెలుగు పనికి రాదు అంటే తెలుగును హీనంగ చూడమని అందరికి చాటింపు చేస్తున్నట్లు లెక్క.

బడి నుంచి తెలుగును దూరం చేస్తే అమ్మ నుడి మనుగడ ఎక్కువ కాలం ఉండదు.

చట్టసభల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, న్యాయస్థానాల్లో ఏలుబడి భాషగా తెలుగు కనపడకపోతే ప్రజలు సహజంగానే ఆంగ్లం వైపు పడిపోతారు.

కొలువు కోసం, సొంత వృత్తుల కోసం తెలుగు పనికి వస్తుంది అని రుజువు చేయాలి. రాబడి కోసం తెలుగు అన్న విషయం మన ధ్యేయమై ఉండాలి.

వరంగల్, హైదరాబాద్ లాంటి నగరాల్లో ప్రజలు తెలుగులో గర్వంగా మాట్లాడే పరిస్థితి రావాలి. పలుకుబడి భాషగా తెలుగు పరిఢవిల్లాలి.

మునుచేర్పులు, వెనుచేర్పులు

కొత్త మాటల అవసరం ప్రతి రోజు వస్తున్నది. మునుచేర్పులు, వెనుచేర్పులు ఉన్న భాషలే ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనగలవు. తెలుగులో ఇవి దాదాపుగ లేవు అని చేకూరి రామారావు గారు అభిప్రాయపడ్డారు. తెలుగులో ఉన్న మునుచేర్పులను (prefix), వెనుచేర్పులను (suffix) అందరు తెలుసుకొనేట్లు చూడాలి అని స వెం రమేశ్ గారు ఇప్పుడు నడుంకట్టారు. వాటిని సేకరిస్తున్నారు.

మనం ఊహించనన్ని మును, వెను చేర్పులు తెలుగులో ఉన్నాయి. మనవారికి వాటినుంచి మాటలను పుట్టించే అలవాటు చేయాలి.

కొత్త మాటల పుట్టింపు

కొత్త మాటలను తెలుగు కుదురు మాటల నుంచి పుట్టించుకోవాలి.

కొత్త మాటల అక్కర వచ్చినప్పుడల్లా ఇతర భాషల వైపు చూస్తుంటే, తెలుగు పనికి రాని భాష అని చెప్పకనే చెప్పుతున్నట్లు లెక్క. అటువంటి భాష కాలగర్భంలో కలసి పోతుంది.

తేట తెలుగునుంచి పుట్టించిన మాటలే పిల్లలకు గుర్తుంటాయి, కొత్త మాటలను పుట్టించటానికి అందరికి దారి చూపుతాయి, మొదటి సారి చూసిన వారికి కూడ ఆ మాట తెల్లం (అర్థం) తేలికగ తెలుస్తుంది.

కొన్ని వెనుచేర్పులను ఇప్పుడు చూద్దాం:

'ఎన' వెనుచేర్పును కనపడే వస్తువుల మాటలను తయారు చేయటానికి వాడతారు.

దువ్వు + ఎన= దువ్వెన

ఈర్పు + ఎన= ఈర్పు (పేలు తీసేది; ఆ అమ్మాయి ఈర్పించుకొన్నది)

నిచ్చెన, ఉప్పెన, బొక్కెన, కందెనలాంటి మాటలు అలా వచ్చినవే.

ఈ మధ్యనే తెలుగు నేర్చుకున్న తమిళనాట పుట్టిన తెలుగు వాడు, ఓట్ర పురుసోత్తం ఈ విషయమై కొంత ప్రయత్నం చేశాడు. ఆ ప్రేరణతో పంతులమ్మగ పని చేస్తుండిన శౌరీలు గారు ఈ సంగతిని చెప్పి, 'మీరు రోజువారీ వాడుతున్న ఆంగ్ల మాటలకు మారు తేట తెలుగు మాటలు తయారు జేయండి' అని అంటే చిన్న పిల్లలు ఎన్ని మాటలను పుట్టించారో మీరు చూడండి:

రుబ్బు+ ఎన= రుబ్బెన (grinder)

కాగు+ ఎన= కాగెన (heater)

తోము+ ఎన= తోమెన (brush)

పలు తోమెన = tooth brush

గీకు+ ఎన= గీకెన, తొక్క తీసేది (tongue cleaner)

గోకు+ ఎన= గోకెన, వీపు గీరుకొనేది

ఊరేగటం అనే మాటను మనం చాల సార్లు విన్నాము. అందరికి కనపడేట్లు ఆ ఊరు ఈ వూరు తిరగటం అనే భావాన్ని తెలపటానికి ఆ మాటను వాడతారు. తెలుగును కాపాడుకొంటున్న కొన్ని ప్రాంతాల్లో బస్‌కు మారుగ ఊరేగి అని వాడతారు. ఈ విషయాన్ని శౌరీలుగారు చెప్పితే మనం చూసే ఇతర బండ్లకు ఎన్ని అర్థవంతమైన మాటలను బడి పిల్లలు తయారు చేశారో చూడండి:

గూడు+ ఏగి= గూడేగి (టెంపో)

తాను+ ఏగి= తానేగి (auto, తానుగ వచ్చేది)

జల్ల తానేగి = truck auto

అద్దె + ఏగి = అద్దేగి (టాక్సీ)

తొట్టి+ ఏగి= తొట్టేగి (టాంకర్)
నలత+ ఏగి = నలతేగి, నొగులేగి (ambulance)
పాడె+ ఏగి = పాడేగి (mortuary van)
పట్టా (రైలు పట్టా)+ ఏగి= పట్టేగి (train)
గాలి+ ఏగి= గాలేగి, విమానం
చదును+ ఏగి= చదునేగి (bull dozer)
వడి గాలేగి = జెట్ ప్లేన్
మిన్ను+ ఏగి = మిన్నేగి (rocket) (మిన్ను లోకి దూసుకు పోయేది)
కోత+ ఏగి= కోతేగి (harvester)
నాటు+ ఏగి= నాటేగి (నాట్లు వేసేది)
దున్ను+ ఏగి= దున్నేగి (tractor)

మనం ఏలికలను ఏమి అడగాలి?

మన ఉద్యమం ఒక ఎత్తు; ప్రభుత్వ ప్రమేయం ఒక ఎత్తు. కొన్ని పనులు ప్రభుత్వం మాత్రమే చేయాల్సి వుంటుంది. ప్రభుత్వ సహకారం లేకుండ మన భాష, సంస్కురుతి, కళలు వన్నెకెక్కవు. అందుకని అన్ని రంగాల నుంచి ప్రభుత్వం మీదకు ఒత్తిడి తేవాలి.

1. అధికారంలో ఉన్న ప్రతి పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో తెలుగు భాష, సంస్కురుతుల కోసం చేయబోయే కార్యక్రమాలను ప్రకటిస్తుంది. దాని ప్రతులను మన దగ్గర ఉంచుకోవాలి. మంత్రులను, శాసన సభ్యులను కలిసినప్పుడల్లా వారికి ఒక ప్రతిని ఇవ్వాలి. ముందు డబ్బులు అవసరమే లేని పనులనైనా ఎందుకు చేయలేదని అడగాలి. ప్రజలు మీ మీద విశ్వాసాన్ని కోల్పోతున్నారని తెలియజేయాలి.
2. స్నాతక దశ రెండవ ఏటి వరకు తెలుగును ఒక విషయంగా నేర్పాలి. వైద్యుడు రాసినది తెలియక మందులు తప్పుగా వేసుకొని రోగి చనిపోయాడని అతని చుట్టాలు విశాఖలోని ఆ వైద్యుడిని చంపినంత పని చేశారు. ఒకసారి భాషోద్యమ సభలో మాట్లాడుతూ బి. వి. రాఘవులు గారు చైనాలో రైతులు ఆత్మహత్య చేసుకొనక పోవటానికి కారణం అక్కడ శాస్త్ర పరిశోధనలలో మంది నుడి ఉండటమే కారణం అన్నారు. మన దగ్గర నేలలు, పంటలు, బలం మందులు, పురుగు మందుల మీద పరిశోధనలు తెలుగులో జరగవు, వెలువడవు. అవి రైతుల దగ్గరికి చేరేసరికి పనికి రాని పాత పరిశోధనలు అవుతాయి.
3. కేంద్రీయ పాఠశాలలైనా సరే తప్పక ఒక విషయంగ తెలుగును నేర్పాలి అని

2003 లో ఇచ్చిన ప్రభుత్వ ఆదేశం సం. 86 స్పష్టం చేస్తున్నది. దాన్ని ఆచరించి తమ నిజాయితీని నిరూపించుకోమనాలి.

4. తెలుగు ప్రాధికార సంస్థను వెంబడే ఏర్పాటు చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన సంస్థలో వెంబడే తగు సభ్యులను నియమించాలి. ఈ సంస్థ లేకపోవటం వలన మనం వెళ్లి ఎవరితో మన సమస్యలను చెప్పుకోవాలో, తరువాత వెంబడపడాలో తెలియటం లేదు.
5. ప్రభుత్వ మరియు ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల నియామక పరీక్షలలో తెలుగును ఒక తప్పనిసరి విషయంగా పెట్టాలి. క్లీనర్, హెల్పర్ పరీక్షలకు పదవ తరగతి కనీస అర్హత అయితే పదవ తరగతి వరకు తెలుగును విడువక చదివితేనే పాస్ అయ్యేటట్లు పరీక్ష పత్రం ఉండాలి. డి. ఎస్. పి. పదవికి గ్రాడ్యుఏషన్ కనీస అర్హత అయితే అంత వరకు తెలుగును విడువక చదివితేనే దాటేట్లు పరీక్ష స్థాయి ఉండాలి. కొంతమంది తెలియక తెలుగు మాధ్యమం వారికి 10% అదనపు మార్కులు ఉండాలని అడుగుతారు. ఇంతకు ముందు అటువంటి నియమం న్యాయస్థానంలో కొట్టివేయబడింది. కొంత మంది తెలుగు మాధ్యమం వారికి 20% రిజర్వేషన్ ఉండాలి అని అడుగుతారు. అది కూడ న్యాయస్థానంలో కొట్టివేయబడుతుంది. పైగా ఏ మాత్రం తెలుగు రానివారికి 80% రిజర్వేషన్ ఇచ్చినట్లు అవుతుంది. అందువల్ల తెలుగు పరిస్థితి ఇంకా చెడిపోతుంది.
6. తెలుగును అధికార, శాసన, న్యాయస్థాన భాషగ వాడాలని పట్టుబట్టాలి.
7. అన్ని బడులలో (ఏలిన వారివి, ఇతరులవి) తప్పక తెలుగు శిక్షణ పొందిన తెలుగు పంతుళ్ళను నియమించాలి.
8. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న పనిని ఇక్కడ కూడ చేయాలి: మన భాషను ఇప్పటి శాస్త్ర, వైద్య, సాంకేతిక అవసరాలను తీర్చగల భాషగ తీర్చి దిద్దాలి.
9. బడి మాధ్యమ భాషగ తెలుగు ఉండాలి.
10. పేరు పలకల మీద తెలుగు వాడకంపై అధికారుల నుంచి నెలలవారీ రిపోర్టులు తెప్పించాలి.
11. బయటి రాష్ట్రాలలో, దేశాలలో తెలుగును నేర్పటానికి ఏర్పాట్లు కావాలి. అక్కడ రెండవ అధికార భాషగా తెలుగు కోసం పట్టుబట్టాలి. 9% మహమ్మదీయులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూను అధికార భాషగ గుర్తించాం. 3% మంది తమిళులు ఉన్న సింగపూరులో తమిళం అధికార భాషగా గుర్తింపు పొందింది. 40% మందిగా తెలుగువారు ఉన్నా తమిళనాట తెలుగుకు అధికార భాష హోదా లేదు.
12. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో ఉన్న తెలుగు పురావస్తు సామగ్రిని సేకరించాలి. ముందుగ అక్కడ ఉన్నప్పుడే డిజిటలైజ్ చేయాలి. తమిళనాడులో అటువంటి

సామగ్రిని నాశనం చేస్తున్నారు. అడిగితే మీరు తీసుకొని పొందిి అని అంటున్నారు. ఈ పనిని యుద్ధ ప్రాతిపదికన చేయాలి. ఇంకే మాత్రం జాగుచేయరాదు. బుద్ధప్రసాద్ గారు ఇచ్చిన రిపోర్టు మీద వెంబడే చర్య తీసుకోవాలి.

13. అలాగే తెలుగు సంస్కురుతి, జానపద కళలు, ఆటల వివరాలను సేకరించాలి. డిజిటలైజ్ చేయాలి.
14. తెలుగు పరిశోధక విద్యార్థులను అంతటా తిప్పి మారుమూలల్లో మామూలు మనుషులు వాడుతున్న తెలుగు మాటలను సేకరించాలి. తెలుగు పాఠ్య పుస్తకాలలో వాటిని వాడాలి. అన్నమయ్య వాడిన మాటలు తెలియని పరిస్థితి ఏర్పడుతున్నదని రవ్వా శ్రీహరి గారు వాపోతున్నారు.
15. కొత్త మాటల అవసరం ప్రతి రోజూ వస్తూనే ఉంటుంది. తమిళనాడులో ఉన్నట్లుగ దీనికి ఒక ఏర్పాటు ఉండాలి. తెలుగు మూలాల నుంచి మనం మాటలను పుట్టించుకోకపోతే తెలుగు పనికి రాని భాష అని మనం అనుకుంటున్నట్లు భావించాల్సి వస్తుంది.
16. తెలుగు వాచకాలలో తెలుగు మాటలను నేర్పాలి. తెలుగు పాఠాలను కొంతగానైన ఉంచాలి. ఇప్పుడు ఇల్లు, బజారు, పొలం దగ్గర మాత్రమే పిల్లలు తెలుగు నేర్చుకుంటున్నారు. బడిలో సంస్కురుతం మాటలు మాత్రమే నేర్పుతున్నారు.
17. కంప్యూటర్, ఫోన్, అంతర్జాల భాషగ తెలుగును పెంపొందించాలి. ఇతర రాష్ట్రాల్లో అక్కడి భాషే వినపడుతుంది ఫోన్లలో. తెలుగు పుస్తకాలు ఇంకా అను రాజోక (ఫాంట్) లోనే అచ్చు అవుతున్నాయి. అందువల్ల వీటిని కంప్యూటర్లలో సెర్చ్ ఇంజన్ పట్టుకోలేదు. కాబట్టి తరువాతి తరాలకు ఈ పొత్తాలు కనపడవు. ఇతర భాషలకు ఈ ఇబ్బంది లేదు. అందుకని తెలుగులో మంచి రాజోకలను, పేజిమేకర్‌ను ప్రభుత్వం చేయించాలి.
18. బ్యాంకులు, అటువంటి ఇతర సంస్థలలో తెలుగు వాడకానికి పట్టుబట్టాలి.
19. వలగూడులో (ఇంటర్నెట్) నిరంతరం పెంచుతున్న వాగమిని (dictionary) ప్రభుత్వం చేపట్టాలి. అది అందరికి అందుబాటులో వుండాలి. మంది ఇస్తున్న సూచనలను ఒక సంఘం పరికిస్తూ సరిఅయిన మార్పులను చేస్తుండాలి.
20. అంగన్ వాడి నుంచే పనికి రాని భాష తెలుగు అని ప్రభుత్వం చెప్పటం మాని వేయాలి.
21. అన్ని పత్రికలు, పుస్తకాలు దొరికే, దాచే వలగూడు ఉండాలి. కూచిభొట్ల ఆనంద్ గారు దీనికి కొంత ప్రయత్నం చేస్తున్నారు కాని ఈ పనిని ప్రభుత్వం చేయాలి.

తెలుగు ఉద్యమకారులు తాముగా ఏమి చేయాలి?

ఒక తెలుగు నవల రాస్తే– పద్యం, గేయం, కవిత, నాటకం, శతకం రాస్తే తెలుగు

సేవ చేసినట్లేనని ఎక్కువ మంది అనుకుంటున్నారు. అటువంటి వారిని గుర్తించి సన్మానిస్తే చాలు అనే అభిప్రాయం ఉంది. మనకు పట్టిన జబ్బు ఆ స్థాయిని దాటిపోయింది. సాహిత్య సేవ వద్దు అనం గాని అది ఏ మాత్రం చాలదు అని అందరి దృష్టికి ఉద్యమ కారులు తీసుకు రావాలి. ఒక విధంగా సాహిత్య కార్యక్రమాలు తెలుగు ప్రేమికులకు నల్ల మందుగ పనిజేసి అసలు పనిలోకి దిగకుండ అడ్డుకుంటున్నాయి అని కూడ మనలో కొంతమంది అంటున్నారు.

అమ్మ నుడి విషయమై మనం పెద్ద ఎత్తున కదలకపోతే రాజకీయ నాయకులు, మంత్రులు ఈ సంగతిని పట్టించుకోరు. అనంతపురం జిల్లా వాసి, డా. శైలజానాథ్ బడిమంత్రిగా ఉన్నప్పుడు మేము ఒక నలుగురము ఆయన దగ్గరకు వెళ్ళాము. తెలుగు కోసం వారు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరాం. దారిలో కొట్ల పేరు పలకలలో తెలుగే లేని సంగతిని ఆయన దృష్టికి తెచ్చాము. అంతట మమ్మల్ని ఆయన ఎగాదిగా చూసి "మీరు ఏమి అనుకుంటున్నారు? మేము రాజకీయ నాయకులం. జనం పెద్దగా కదిలి, కోరిన దానిని గురించే పట్టించుకుంటాము. ముగ్గురు నలుగురుగా ఉన్న మీరు మా పరిగణనలోకే రారు. రేపు ఒక 60 మంది రండి. నేనే మీ ముందుండి, ఇనుప చువ్వ తీసుకొని ఆ కొట్టు పేరు పలక అద్దాన్ని, ట్యూబ్ లైట్ ను పగులకొట్టి అవసరమైతే కేసునైనా ఎదుర్కుంటాను." నాకు మాత్రం జ్ఞానోదయం అయినట్లు కనిపించింది. ఇప్పటి దాక ఉద్యమకారులము సమావేశాలు పెట్టుకొని, చలువ గదుల్లో కూర్చొని ప్రభుత్వాలు ఈ పని చేయాలి, ఆ సంఘాన్ని వేయాలి అని తీర్మానాలు చేస్తే సరిపోతుంది అనే భ్రమల్లో ఉన్నాం.

ఈ మధ్య జరిగిన మరో సంఘటన కూడ మనకు కనువిప్పుగ పనిజేయాలి. అత్యున్నత న్యాయస్థానం గొడ్ల మీద ప్రేమతో 'జల్లికట్టులో ఎడ్లతో ఆడటాన్ని నిషేధిస్తున్నాము' అని తీర్పు ఇచ్చింది. లక్షల మంది తమిళులు బజారున పడి 'మేము జల్లికట్టు ఆడుతాము. మీరు ఏమి చేసుకొంటారో చేసుకోండి' అంటే ఆ న్యాయస్థానం మిన్నకుండి పోయింది. మంది తలుచుకుంటే మన సంస్కృతి నిలబడుతుంది అనటానికి ఇంత కన్న మంచి ఉదాహరణ ఇంకా ఏమి కావాలి? ఇప్పటికీ మనం కదలకపోతే తెలుగు తల్లి మీద మనకు నిజంగ అభిమానం లేనట్లే.

మీ ఊళ్ళో మీరు ఒక్కరిగానో, ఇద్దరిగానో ఉంటే ఇంకొంత మందిని తెలుగు తల్లి సేవకు ముందుకు వచ్చేట్లు ఒప్పించాలి. ముగ్గురు అవగానే తెలుగు కూటమిని ఏర్పరచాలి. మీ పరిస్థితులను పట్టి వేరే పేరు పెట్టుకున్నా ఫరవా లేదు.

1. తెలుగు దండు ప్రతి నెల మొదటి ప్రభుత్వ సెలవు నాడో, చివరి శనివారం లేక మొదటి ఆదివారం అనో ఒక ముందే నిర్ణయించుకున్న దినాన తప్పక కలవాలి. జరిగిన పని మీద సమీక్ష ఉండాలి. కొత్త పనులకు ప్రణాళిక వేయాలి. ప్రతి సభ్యుడు ప్రతి నెల ముఖ్యమంత్రి/తెలుగు భాష మంత్రికి తెలుగు కోసం

చేయాల్సిన పనులను వక్కాణిస్తూ పోస్ట్ కార్డును రాయాలి. ఇమెయిల్, change.org, ముఖ్యమంత్రి డాష్ బోర్డు లను కూడ ఇందుకు వాడాలి.

2. తల్లిదండ్రులు తమ పిల్లలు ఆంగ్లం మాధ్యమంలో చదవాలి అని కోరుకుంటున్నారు. అందుకని మేము కూడ ఆంగ్ల మాధ్యమం బడులను పెట్టవలసి వస్తున్నది అని ప్రభుత్వం అంటున్నది. అందుకని మనం వీలైనంత మంది తల్లిదండ్రులను కలవాలి. తెలుగులో చదివితేనే పిల్లలు రాణిస్తారు అన్న విషయాన్ని వారికి తెలిసేట్లు చెప్పాలి. బడులలో పెట్టే తల్లుల సమావేశాలకు మనము వెళ్ళాలి. డా. మిత్ర గారు ౧౦ పుటలలో చిన్న పొత్తాన్ని రాస్తామన్నారు ఈ విషయమై తల్లులకు సరిగా నచ్చచెప్పటానికి. అటువంటి ఇంకొన్ని పుస్తకాలను తేవాలి.

3. అన్ని పేరు పలకలలో తెలుగు ప్రముఖంగా ఉండాలని రెండు ప్రభుత్వాలు స్పష్టమైన ఉత్తర్వులను ఇచ్చాయి. అలా లేని చోట మనము అంగడి యజమానిని కలిసి చెప్పాలి. మన సంస్కురుతిని చంపాలి అనుకునే ఆ కొట్టును బహిష్కరించమని వాడకందారులను కోరాలి. తెలుగు లేని పేరు పలక ఫోటోను తీసి సంబంధించిన అధికారికి ఫిర్యాదును ఇచ్చి రసీదు తీసుకోవాలి. అతను చర్య తీసుకోకుంటే పై అధికారికి, అవినీతి నిరోధక శాఖకు అతనిపై ఫిర్యాదును ఇవ్వాలి.

4. ఆంధ్ర బ్యాంకు శాఖకు వెళ్ళాలి. శాఖాధికారికి చెప్పాలి, "మీ లక్నో శాఖలోఖాతా తెరిచే కాగితాలను హిందీలో ఇస్తారు. మంగుళూరులో డబ్బులు జమ చేసే కాగితాలను కన్నడంలో ఇస్తారు. (కర్ణాటకలో రైలు టికెట్లు కూడ కన్నడ భాషలో ఉండేట్లు వారు విజయవంతమైన ఉద్యమాన్ని నడిపారు.) మదురైలో డి.డి. అప్లికేషను కాగితాన్ని తమిళంలో ఇవ్వకపోతే మీ శాఖాధికారిని పట్టుపట్టి పదుగురు పరికిస్తుండగానే పట్టుకొని పట్టపగలే పయిన పెట్రోలు పోసి పుల్ల గీసి పైకి పంపి పండుగగా పరితపించిపోతారు, పరవశించిపోతారు, పులకరించిపోతారు. నీకేం రోగం వచ్చింది? ఆంధ్ర బ్యాంకు అని పేరు పెట్టుకొని విజయవాడలో ఉండి తెలుగులో ఒక్క కాగితం కూడ ఇవ్వటం లేదేమి? వారం రోజుల్లో కాగితాలు తెలుగులో ఉండకపోతే గేటుకు అడ్డంగా నిలబడి ఆంధ్ర ద్రోహపు ఆంధ్ర బాంక్‌కు మీరు దూరంగా ఉండమని వాడుకరులను అడిగి నీ శాఖ మూతబడేట్లు చేస్తాం". ఇలా పది చోట్ల జనం కదిలితే పరిస్థితిలో మార్పు రాదా? అలానే మిగిలిన బ్యాంకులు కూడ.

5. రోడ్ రవాణా సంస్థ, విద్యుత్ కార్యాలయాలకు వెళ్ళాలి. ప్రభుత్వ ఆదేశం 218 తే. 22-3-1990 మేరకు మీ రాతపోతలన్నీ తెలుగులోనే ఉండాలి. పెద్దగా చదువు రాని డ్రైవర్ కు, హెల్పర్‌కు, మీరు ట్రాన్సఫర్ లేక పని ఆదేశాలను

ఆంగ్లంలో ఎందుకు ఇస్తున్నారు? అని అడగాలి. చట్టరీత్యా ఇది క్రిమినల్ పని. మీ మీద కేసు పెట్టమంటారా?

6. మన ప్రాంతానికి వస్తున్న అధికారులు, సంఘాల సంస్థల నాయకులు, ప్రసంగీకులు, అధికార ప్రతిపక్ష నాయకులను కలవాలి. తెలుగు వాడకం మీద ఒప్పించి వారి ప్రకటన కాగితాలను తీసుకోవాలి. వాటిని ప్రసార మాధ్యమాలకు ఇవ్వాలి.
7. ఉద్యమం లోనికి నిరంతరం కొత్తవారిని చేర్చటం అనే కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉండాలి.
8. ప్రతి సాహిత్య సమావేశానికి వెళ్లి చివరగా తెలుగు కోసం ప్రభుత్వం చేయవలిసిన పనులను వివరిస్తూ ఒక తీర్మానాన్ని అందు కోసం చేయించాలి. ఉద్యమ నినాదాలివ్వాలి. సంతకాలు పెట్టించి ప్రభుత్వానికి, పత్రికలకు పంపాలి. వట్టి సాహిత్యానికే పరిమితం అయితే తెలుగు ప్రేమికులకు భ్రమ కలిగించి –కొంత మంది అంటున్నట్లు మత్తు మందుగ పనిజేసి– ఉద్యమ బాట నుంచి పక్క బాట పట్టిస్తుంది.
9. రచయితలను కలవాలి. “మీరు రాసిన పుస్తకం ఎవరూ– మీ మనమడితో సహా– చదువరు అని మీకు తెలుసు. అందుకనే 500 ప్రతులనే వేస్తారు. ఒక 50 ప్రతులను మీకు తెలిసిన వారికి ఊరకనే ఇస్తారు. మిగిలిన 450 పుస్తకాలు మీరు ఉన్నంత కాలం మీ ఇంట్లో ఉంటాయి. వాటిని దులపలేక, సర్దలేక పెండ్లం మిమ్ములను తిడుతూనే ఉంటుంది. తెలుగు వారు 18 కోట్ల మంది ఉన్నా మనకు ఈ గతి పట్టింది. కాని 3 కోట్ల మందే ఉన్న మలయాళీలు ప్రతి రచయిత 10,000 ప్రతులకు తక్కువ వేయకుండ చూస్తారు. వాటిని కొంటారు. ఇక్కడ బడిలో తెలుగు లేదు కాబట్టి మీ పుస్తకాలను కొనే వారు దొరకరు. అందుకని మీరు కూడ కొంతకాలం కలాన్ని పక్కన పెట్టి కాలు జాడించి భాషోద్యమంలోకి కదలాలి.” అని చెప్పాలి.
10. ముందు మనం మారాలి. మారిన మనిషిగ కుటుంబంలోని మిగిలిన వారికి, మన నేస్తాలకు, తెలిసిన వారికి చాల స్పష్టంగ కనపడాలి. మనం మాట్లాడేటప్పుడు వీలున్నంత వరకు తెలుగు మాటలనే వాడాలి; ఇంగ్లిష్, సంస్కురుతం, హిందీ లాంటి పెర నుడుల మాటలను క్రమంగ వదిలెయ్యాలి. తెలుగు పరిపుష్టమైన భాషే అన్న అభిప్రాయాన్ని మనం పెంపొందించాలి. సమావేశాలలో, కార్యాలయాలలో, ఇతర చోట్ల మన పేరు, చిరునామాలను తెలుగులోనే రాయాలి. అన్ని చోట్ల –బ్యాంకులు సహా– మీ సంతకాలను తెలుగు లోనే పెట్టాలి. మీ చేపలుకి (cell phone) అంకెను తెలుగులోనే చెప్పాలి.
11. వాట్సాప్, టెలిగ్రాం, ఇమెయిల్, ఫేస్ బుక్, ట్విట్టర్ లాంటి కొత్త సాంఘిక మాధ్యమాల్లో చురుకుగా పాల్గొని ఉద్యమ సందేశాన్ని పెద్దగ ప్రచారం చేయాలి.

12. విశ్వ విద్యాలయాలు, కళాశాలల అధికారులను కలవాలి.
13. ప్రతి పల్లెటూరులోను తెలుగు పంతుళ్ళు ఉన్నారు. అంటే సహజంగానే మారు మూల ప్రాంతాల్లో కూడ మన సైనికులున్నారు. మన ఉద్యమానికి మిగిలిన కార్యకర్తలకు కేంద్ర బిందువుగ వీరిని కదిలించాలి. బడులలో తెలుగు పోతే వారి జాతే అంతరించి పోతుంది అన్న విషయాన్ని వారికి వివరించాలి.
14. పత్రికలలో మన వ్యాసాలు, ఉత్తరాలు క్రమం తప్పకుండ కనపడాలి. తెలుగు తల్లి కోసం సమాజం గళమెత్తినది అన్న సందేశం స్పష్టంగ కనపడాలి.
15. తెలుగును పెంపొందించాలి అన్న మంచి ఆశయంతో చాల సంస్థలు తాము ఎన్నుకొన్న సందర్భాలలో కవితలు, కతలు, నవలలు, వగైరా పోటీలు పెడుతుంటారు. భాషోద్యమం పోటీల వైపు మారాల్సిన అవసరాన్ని వారికి తెలియజేయాలి.
16. ముందుగ తెలుగును ఒక విషయంగ కూడ చెప్పని బడుల మీద ఫిర్యాదు చేయాలి, వ్యాజ్యాలు వేయాలి.
17. ఉత్తేజపరిచి ఉరికించే ఉద్యమ నినాదాలను తయారు చేయాలి. పాటలు రాయాలి, పాడించి సాంఘిక మాధ్యమాలలో పెద్దగ ప్రచారానికి పెట్టాలి.
18. పత్రికలు, టి.వి., సినిమా బాధ్యులను కలవాలి. తెలుగుతో పాటు వారి బ్రతుకుతెరువు కూడ ఇబ్బందులలో పడుతుంది అన్న సంగతిని వారికి గుర్తు చేయాలి. సరైన తెలుగును వాడి మిగిలిన వారికి మంచి దారిని చూపించాలని కోరాలి. ఉద్యమ వార్తలు, వ్యాసాలకు ప్రాముఖ్యతను ఇవ్వాలి అని చెప్పాలి.
19. రాజకీయ నాయకులను, అందునా ప్రతిపక్ష నాయకులను కూడ తప్పక కలవాలి. అన్ని పార్టీల వారు మన ఉద్యమాన్ని సమర్థిస్తేనే అడ్డంకులు తగ్గిపోతాయి.
20. మన కోర్కెలలో చాలా వాటిని అమలు చేయటానికి ప్రభుత్వానికి అయ్యే అదనపు ఖర్చు కూడ ఉండదు. ఈ విషయాన్ని వారి దృష్టికి తెచ్చి ముందుగ వాటిని అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి అని తెలపాలి.
21. జిల్లా న్యాయమూర్తిని కలిసి మీరే చట్టాలకి వ్యతిరేకంగా పని జేస్తే ఎలా అని అడగాలి. తీర్పులు, పాలన తెలుగులోనే ఉండాలని ఉన్న స్పష్టమైన ఆదేశాలను ఎందుకు పాటించటం లేదు అని అడగాలి. 170 ఏండ్ల క్రితమే బ్రౌన్ దొర తెలుగులో తీర్పులు ఇచ్చాడు.
22. మన మనస్సుల్లో స్పష్టత ఉండాలి: కోరికలు, తీర్మానాలు, మహజర్ల దశ నుంచి మనం రోడ్డు మీదకు రావాలి.
23. మన పిల్లలకు తెలుగు ఆటలు, పాటలు, కళలు నేర్పాలి; మన కార్యక్రమాలలో అవి కనపడాలి.

వెనుమాట

ఇందులోని అభిప్రాయాలతో మీరు ఏకీభవించవచ్చు లేక వ్యతిరేకించవచ్చు కాని తటస్థంగా మాత్రం ఉండలేరు. ఏకీభవిస్తే సంతోషం. లేకపోతే ఇంకా సంతోషం– ఎందుకంటే నేను ఎక్కడ పొరబడ్డానో మీరు వివరంగా తెలియజేస్తారు. ఇందులో కొన్ని మార్చాల్సిన భాగాలు, తీసివేయాల్సిన విషయాలు, చేర్చాల్సిన సంగతులు మీకు కనబడతాయి. పుస్తకాన్ని చదివేటప్పుడు కాగితం, కలం దగ్గరుండాలి. ఈ పొత్తంలో కావాల్సిన కూర్పులు, మార్పులు, చేర్పులపై నేర్పుగా మీ తీర్పును ఇవ్వండి. కొంచెం ఓపిక చేసుకొని, తెలుగు తల్లి సేవకోసం, ఆ వివరాలను అన్నింటిని నాకు (చేపలుకి అంకె 95052 98565, korapa4@gmail.com) తెలియజేయండి. తరువాతి ముద్రణలలో తగిన సవరణలు చేస్తాను.

తమ భాషను, సంస్కృతిని, కళలను కాపాడుకోవటమే ఒక జాతి యొక్క ప్రధానమైన, ఉన్నతమైన కర్తవ్యం. ఈ దిశగా మనం తెలుగు ప్రజలకు చైతన్యం కలిగించాలి. తెలుగు రాష్ట్రాలు, బయటి రాష్ట్రాలు, ఇతర దేశాలలో ఉన్న చైతన్యవంతులు అందరితో కలిసి విశాలమైన ఐక్య సంఘటనను ఏర్పరచి ఉమ్మడి కనీస ప్రణాళికపై విస్తృత ఉద్యమ రూపంలో మనం కదిలి పోరాడాలి. తెలుగు భాష, సంస్కృతులను పట్టి పీడిస్తున్న క్షుద్ర శక్తులను తరిమి కొట్టుదాం. గొప్ప తెలుగు భాష కోసం మన జవసత్వాలన్నింటిని పెట్టి విస్ఫు లింగాలలా విజృంభిద్దాం. కదలండి, కదిలించండి. మనది న్యాయమైన పోరాటం. తప్పక విజయం మనదే!

నన్నయాదుల కన్నతల్లికి సన్నజాజుల మాలలు అర్పిస్తూ
ఆంధ్రకేసరి వీరమాతకు సాంద్రకర్పూర హారతులందిస్తూ
రాలు కరిగే త్యాగరాజుని రాగసుధలో పరవశిస్తూ
కూచిపూడి కళామతల్లికి న్యాంజలులు సమర్పిస్తూ
అమెరికాలో తెలుగుతల్లికి సాహిత్యాలంకరణలు చేస్తూ
మురిసిపోదాం మనందరం మనందరం తెలుగుభాషాభిమానులం

1994లో అలా ఒక చిన్న ఊహతో తెలుగు సాహిత్యానికి పెద్ద పీట వేసి హ్యూస్టన్ నగరంలో మొదలైన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అచిరకాలంలోనే ఆ దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగానే అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి తెలుగు భాషా, సాహిత్యాలకి పర్యాయపదంగా గుర్తింపు పొందింది. మందీ, మార్బలమూ, శాశ్వత నిధి నిక్షేపాలూ లేకపోయినా కేవలం తెలుగు భాషా, సాహిత్యాభిమానుల అండదండలే కొండంత బలంగా తెలుగు సాహిత్యానికి 'చంద్రుడికో నూలుపోగు' సమర్పిస్తున్న లాభాపేక్ష లేని సంస్థ 'వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా'కు 2019 రజతోత్సవ సంవత్సరం.

కొనసాగిస్తున్న సాహిత్య కార్యక్రమాలు, సాధించిన విజయాలు

- 1995 నుండి ప్రతీ ఏటా విదేశీ రచయితల ఉగాది ఉత్తమ రచనల పోటీలు ఇప్పటిదాకా 24.
- నాలుగు అంతర్జాతీయ కథల పోటీలు.
- 1998 నుండి జాతీయ స్థాయి ద్వైవార్షిక అమెరికా తెలుగు సాహితీ సదస్సులు. (అట్లాంటా, చికాగో, డిట్రాయిట్, న్యూజెర్సీ, ఫ్రెమాంట్ (కాలిఫోర్నియా), ఇండియానాపొలిస్, హ్యూస్టన్, బృహత్ వాషింగ్టన్ డి.సి.)
- 2005లో భారతదేశంలో (హైదరాబాద్) అనుబంధ విభాగ సంస్థాపన.
- 2010 నుండి 'నా మొట్ట మొదటి కథ', 'నా మొట్ట మొదటి కవిత'ల పోటీలు.

- 2006 నుండి నాలుగు దేశాలలో రెండేళ్ళ కొకసారి (భారతదేశం, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యునైటెడ్ కింగ్‌డం, సింగపూర్, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియాలలో) ఆరు ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులు.
- మూడు జాతీయ మహిళా రచయితల సాహిత్య సమ్మేళనాలు (హైదరాబాద్–2012, 2014, 2016).
- రెండు యువతరం సాహితీ సమ్మేళననాలు (2013–హైదరాబాద్, 2017–కాకినాడ).
- ఉత్తర అమెరికా మొట్ట మొదటి తెలుగు కథ 50వ వార్షికోత్సవాలు (2014, హ్యూస్టన్).
- 2005 నుండి 'నెల తప్పకుండా' 'నెల నెలా తెలుగు వెన్నెల' సాహిత్య ప్రసంగాలు (హైదరాబాద్) ఇప్పటిదాకా సుమారు 170.
- అమెరికా తెలుగు కథానిక 13 సంకలనాలతో సహా 76 తెలుగు పుస్తకాల ప్రచురణ.
- వందలాది సాహిత్య, సంగీత, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలకి నిరంతర సహకారం.
- సుమారు 100 మంది భారతదేశ తెలుగు సాహితీవేత్తలకి, కళాకారులకి అమెరికా పర్యటన అవకాశాలు.
- 2005లో సామాజిక సేవా, ధార్మిక కార్యక్రమాలకి విస్తరణ. వేగేశ్న ఫౌండేషన్ వికలాంగుల సంస్థ, (హైదరాబాద్), కాకినాడలో ఉన్న మ్యునిసిపల్ హైస్కూల్, పి.ఆర్. కాలేజ్, జెఎన్‌టియు విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, బాలికల పాఠశాలలు, ఇతర ప్రాంతాలలోనూ సుమారు 20 సంస్థలకి చేదోడు వాదోడుగా ఐదు మిలియన్ డాలర్లపైగా విరాళాల సేకరణ.

వ్యవస్థాపకులు: **వంగూరి చిట్టెన్ రాజు**

E-mail: vangurifoundation@gmail.com

USA Phone: 832 594 9054

శాయి రాచకొండ, హ్యూస్టన్ (సంపాదకులు)

వంశీ రామరాజు (మేనేజింగ్ ట్రస్టీ. భారతదేశ విభాగం)

ఈ పొత్తాన్ని చదివిన పెద్దల తలపోతలు

నా తెలుగే గొప్ప భాష అని చెప్పి నేను కూడ ఉద్యమిస్తున్నాను... ఈ పుస్తకం ఒక తెలుగు వాడి వేదన, ఆవేదన, పరివేదన, రోదన... **పుస్తకం రాయించింది సరస్వతియా అన్నంత అందంగా... వాక్యం చదివినప్పుడు కళ్ళలోంచి రక్తం కారుతున్నది...వీరి ఆవేదన చూసాక మన మనస్సుల్లో మార్పు రాకపోతే మనమందరం మనుష్యులంగాదు.**

–కె.వి.రమణాచారి.

ఈ పుస్తకం పాఠక జనుల మన్ననలు పొందగలదు.

–రామోజీ రావు.

ఇప్పటి తెలుగు సమాజానికి తెలుగు అవసరాన్ని గురించి, తెలుగు ప్రాధాన్యం తగ్గిపోవడం, అసలు తెలుగే తగ్గిపోవడం, ముందు తరాల్లో తెలుగు బొత్తిగా తగ్గిపోయే పరిస్థితులు మనం కొని తెచ్చుకోవడం గురించి భాషాప్రేమికులు, భాషోద్యమకారులు పారుపల్లి వారు కార్యకారణ సంబంధం వివరిస్తూ సరళంగా, సూటిగా, స్పష్టంగా చెప్పిన పుస్తకం ఇది. అంతే కాదు, భావోద్వేగపూరితంగా చెప్పారు.

– ఆవుల మంజులత.

అనేక మంది ఈ భాషోద్యమాల్లో పనిజేసారు. అనేకమైన వ్యాసాల్నీ, పుస్తకాల్నీ రాసారు. **ఐతే వాటన్నిట్లోకి కూడ ఒక తలమానికంగా భావించే పుస్తకంగా దీన్ని నేను గుర్తిస్తున్నాను.** **–దీర్ఘాసి విజయ భాస్కర్.**

ఏ దేశమేగినా, ఏ పీఠమెక్కినా మాతృభాషను కించపరచడం మాని ఇప్పుడేం చేయాలో ఆలోచించి భాష మనుగడ కోసం కలిసికట్టుగా ఉద్యమస్థాయిలో ముందుకు సాగాలనే కర్తవ్యనిర్దేశం చేయడమే రచయిత ఆలోచన, ఈ పుస్తకం ఉద్దేశం కూడా.

–తెలుగు వెలుగు

ఎంతో పరిశోధనతో, నిష్కర్షగా రాసిన అభిప్రాయాలున్న పుస్తకమిది. మన భాషాసంస్కృతులను కాపాడుకోవడమే తక్షణ కర్తవ్యం... ఈ పుస్తకం మన పాలకులకు దిక్సూచిగా దోహదం చేస్తుందన్నది చిట్టెన్ రాజు మాట. **–నవ్య**

పుస్తకం తెలుగు విశ్వవ్యాప్తంగా మాట్లాడే 18 కోట్ల మంది తెలుగు ప్రజలని కదిలించే విధంగా ఉంది. తెలుగు వారికి కనువిప్పు లాంటిది.

–సంకేపల్లి నాగేంద్ర శర్మ, కరీం నగర్.

కొన్ని సందర్భాలలో పుస్తకం చదువుతున్నప్పుడు కళ్లనీళ్లు వచ్చాయి.

–రాఘవేంద్ర, శాండియాగో.

తెలుగోడు తెలుగు పట్ల స్వయానా పాటిస్తున్న న్యూనత భావాన్ని, సొంత చేతుల తోనే తెలుగు తల్లిని కాలంలో పాతి పెట్టడానికి ప్రయత్నిస్తున్న తెలుగోడి తీరును ఈ చిన్న పుస్తకంలో గమనించినట్లయితే నిజమైన తెలుగోడి గుండెలో వణుకు పుడుతుంది. తెలుగు భాషా సాహిత్యాల, సంస్కృతుల ఉనికి, ఉద్ధరణ కోసం రచయిత పారుపల్లి వారు పాటుపడుతున్న తీరు చరిత్రలో నిలిచిపోతుంది. ...తెలుగు భాష ప్రస్తుత పరిస్థితులలో ఎలాంటి హీన స్థితిని ఎదుర్కొంటున్నదో సమగ్ర అవగాహనతో విశ్లేషించి రచయిత వ్రాసిన ఈ పుస్తకం తెలుగు ప్రజలందరికీ తప్పక కనువిప్పు కలిగిస్తుంది.

– కె. వి. రమణారెడ్డి, కడప.

పారుపల్లి వారు కనుమరుగౌతున్న తెలుగు భాషను ఏడు కణుపుల్లో తీపి చెరుకు గడగా అందించారు. చదువుతూ ఉంటే ఆనందం, ఆశ్చర్యం, అయ్యో అనే బాధ ప్రతి చదువరికీ కలగడం నిజం... వేమన పద్యాలు 'పట్టు, తల్లి'. ఈ పద్యాల గొప్పతనం వివరించి బాగా రాశారు. అయితే ముద్రణలో వారు చూసుకో లేదో ఏమో గణదోషాలు ఉన్నాయి.

–మీగడ రామలింగస్వామి.

తెలుగు సాహిత్యంలో మొట్ట మొదటి భాషోద్యమ రచనతో తెలుగు భాష కనుమరుగు అవుతుందని, అమ్మ నుడిని కాపాడుకోవడం ఎలాగో తమ పుస్తకంలో వివరించారు.

–వెంకటేశ్వర రావు, తెలుగు స్కాలర్. [illegible]

తెలుగు భాష గొప్పతనం, తెలుగు భాషను పరిరక్షించేందుకు దేశం లోను, విదేశాలలోను ప్రతి తెలుగు వాడిని ప్రోత్సహించే విధంగా ఉన్న 'తెలుగే గొప్ప భాష' పొత్తం తెలుగు సమాజానికి చాలా అవసరం.

– రాళ్ళపల్లి సుందరరావు, అధ్యక్షులు,రాష్ట్రేతర తెలుగు సమాఖ్య, ఖరగపూర్.

తెలుగు జాతి కనుమరుగవ్వకుండా అందరిని జాగృతపరిచేందుకు రచయిత చేసిన కృషి అభినందనీయం. గ్రంథం చివరలో తెలుగు భాషను కాపాడుకోవడానికి ఏం చేయాలో సుదీర్ఘంగా తమ సలహాలు, సూచనలు చేశారు.

–ఆంధ్ర భూమి.

ఈ మధ్య అభివృద్ధి పేరుతో సాగుతున్న విధానాల కారణంగా అంతరించిపోయే దిశగా తెలుగు భాష ప్రయాణిస్తున్నదన్నదే విషాదం.

–నమస్తే తెలంగాణ.

రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర రావు మాట్లాడుతూ... కోదండ రామయ్య భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారని ... అన్నారు.

—ఆంధ్ర జ్యోతి.

ఈ సందర్భంగ సి. హెచ్. ఆంజనేయరెడ్డి, వంశీ రామరాజు, తెన్నేటి సుధాదేవి, దేవులపల్లి ప్రభాకర రావు, ఆవుల మంజులత తదితరులు పాల్గొని రచయిత యొక్క రచన శైలిని ప్రశంసించి సత్కరించారు.

–సూర్య

బడి, గుడి, రాబడి, ఏలుబడి, పలుకుబడి అయిదు రంగాల్లోనూ తెలుగు వాడుక జరిగినప్పుడే తెలుగు భవిష్యత్ తరాలకు నిలుస్తుంది.

–నవ తెలంగాణ

తెలుగు వారి వేదన, ఆవేదన, పరివేదన, రోదనలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి.

—ఈనాడు.

తెలుగు భాష గురించి మాట్లాడటానికి, భాష పరిస్థితి తెలపడానికి, మనం అనురక్తిని పెంచుకోవటానికి, తెలుగును మరింత పరివ్యాప్తం చేయడానికి పుస్తక రచయిత పారుపల్లి కోదండ రామయ్య చేసిన కృషి అనితర సాధ్యం.

— వార్త

ఈ నాటి కథా నాయకుడు, ఈ గ్రంధాన్ని రచించినటువంటి చీఫ్ ఇంజనీర్ రిటైర్డ్ శ్రీ పారుపల్లి కోదండ రామయ్య గారు కూడ తన అభిప్రాయంలో తెలుగే గొప్ప భాష కాని కనుమరుగౌతున్నది అనే విషయాన్ని ఒక తెలుగు వాడిగా, తెలుగు వాళ్ళకందరికీ కూడ చెప్పుకోవడాని కోసం అని చెప్పి ఈ గ్రంధాన్ని తీసుకొచ్చినటువంటి ఈ వేళ వారికి నమస్కారం.

–ఈటివి

మీ వేదన నుండి వేదం లాంటి పుస్తకం ఊపిరి పోసుకొంది. చదువుతున్నంత సేపు గర్వంగా, బాధగా ఉంది. మన తెలుగు గొప్పదనాన్ని ఇన్ని రకాలుగా చెప్పవచ్చని తెలిసి గర్వంగా ఉంది. అలాటి భాషను ఆత్మ న్యూనత భావంతో కించపరచుకొంటూ ఆనందించే వారిని చూసి సిగ్గుగానూ, బాధగానూ ఉందండి.

–దేవీప్రసాద్, బెంగుళూరు.